

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




శుక్రవారం | 2-5-2025 | పేజీలు: 18 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 16 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి ఉ.9.15 తదుపరి షష్ఠి, నక్షత్రం: ఆర్ద్ర మ.1.04 తదుపరి పునర్వసు, వర్జ్యం: రా.12.49-2.23, దుర్ముహూర్తం: ఉ. 8.24-9.14, మ.12.37-1.28, అమృతఘడియలు:లేవు, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.52, సూర్యాస్తమయం: 6.32 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాజస్థాన్ ఇంటికి..

- ప్లేఆఫ్స్ రేసు నుంచి అవుట్
- 100 రన్స్ తేడాతో చిత్తు
- ముంబైకి వరుసగా ఆరో విజయం


రోహిత్ (53)
సూర్యకుమార్ (48 నాటౌట్)

జైపూర్: ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసు నుంచి రాజస్థాన్ రాయల్స్ కూడా వెనుదిరిగింది. గుజరాత్‌పై ఆహా.. అనే రీతిలో చెలరేగిన ఈ జట్టు తమ తర్వాతి మ్యాచ్‌లోనే పూర్తిగా చేతులెత్తేసింది. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌లోనూ విఫలమై ముంబై ఇండియన్స్ చేతిలో 100 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. దీంతో ఈ జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకొంది. అటు తొలి ఐదు మ్యాచుల్లో నాలుగింటిని కోల్పోయిన ముంబై ఇండియన్స్.. ఆ తర్వాత వరుసగా ఆరో విజయాన్ని ఖాతాలో వేసుకోవడం విశేషం. అలాగే 14 పాయింట్లతో పట్టికలో టాప్‌నకు చేరింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 2 వికెట్లకు 217 పరుగులు చేసింది. ఓపెనర్లు రికెల్టన్ (61), రోహిత్ (53) అర్ధసెంచరీలు సాధించగా సూర్యకుమార్ (48 నాటౌట్), హార్దిక్ (48 నాటౌట్) వేగం కనబర్చారు. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 16.1 ఓవర్లలో 117 పరుగులకు కుప్పకూలింది. ఆర్చర్ (30) టాప్ స్కోరర్. కర్ణ్, బౌల్ట్‌లకు మూడేసి, బుమ్రాకు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రికెల్టన్ నిలిచాడు.

పేకమేడలా..: తమ చివరి మ్యాచ్‌లో 210 పరుగులను 15.5 ఓవర్లలోనే పూర్తి చేసిన రాజస్థాన్.. ఈసారి 217 పరుగుల ఛేదనలో అతికష్టంగా 100 పరుగులను దాటించి 16.1 పరుగులకే కుప్పకూలింది. కానీ అంతకుముందు ఈ లక్ష్య ఛేదనలో 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ పటిష్ట బౌలింగ్ లైనప్ కలిగిన ముంబైని ఎలా ఎదుర్కొంటాడోనని అంతా ఎదురుచూశారు. కానీ ఎలాంటి అద్భుతాలూ జరుగలేదు. తొలి ఓవర్‌లోనే వైభవ్‌ను పేసర్ చాహర్ డకౌట్‌గా పంపి ఆర్‌ఆర్‌కు షాకిచ్చాడు. ఇక రెండు సిక్సర్లతో జోరు మీదున్న జైస్వాల్ (13), రాణా (9)లను బౌల్ట్ అవుట్ చేయగా.. ఆ తర్వాత బుమ్రా వరుస బంతుల్లో పరాగ్ (16), హెట్‌మయెర్ (0)ల పనిబట్టాడు. దీంతో ఐదు ఓవర్లు కూడా పూర్తి కాకుండానే రాజస్థాన్ 47/5 స్కోరుతో నిలిచింది. అయినా పవర్‌ప్లేలో జట్టు 62 పరుగులు సాధించడం గమనార్హం. మిగిలిన ఆటగాళ్లను కూడా ముంబై బౌలర్లు చకచకా అవుట్ చేయడంతో 12 ఓవర్లలోనే 91/9 స్కోరుతో నిలిచింది. చివర్లో ఆకాశ్ (4 నాటౌట్)ను అండగా చేసుకుని ఆర్చర్ చెలరేగడంతో కనీసం వంద పరుగులైనా దాటగలిగింది. 17వ ఓవర్ తొలి బంతికి ఆర్చర్‌ను బౌల్ట్ అవుట్ చేయడంతో 23 బాల్స్ ఉండగానే ఆర్‌ఆర్ ఆట ముగిసింది.

ఓపెనర్ల శతక భాగస్వామ్యం: ముంబై ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన నలుగురు బ్యాటర్లూ చెలరేగారు. రికెల్టన్-రోహిత్ జోడీ కచ్చితమైన షాట్లతో ఎదురుదాడికి దిగి తొలి వికెట్‌కు 116 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. అలాగే చివరి ఐదు ఓవర్లలో సూర్య, హార్దిక్‌ల ప్రతాపంతో 71 పరుగులు రాబట్టింది. రెండో ఓవర్‌లోనే రోహిత్‌ను ఎల్బీగా ప్రకటించినా.. రివ్యూకు వెళ్లి బతికిపోయాడు. పవర్‌ప్లేలో జట్టు 58 పరుగులకు చేరింది. అయితే ప్రమాదకరంగా మారిన ఓపెనింగ్ జోడీని వరుస ఓవర్లలో రాజస్థాన్ బౌలర్లు పెవిలియన్‌కు చేర్చారు. 12వ ఓవర్‌లో రికెల్టన్‌ను తీక్షణ బౌల్డ్ చేయగా.. అర్ధసెంచరీ పూర్తి చేసిన రోహిత్‌ను పరాగ్ పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత బాధ్యతను సూర్యకుమార్, హార్దిక్ తీసుకోవడంతో ఆర్‌ఆర్ బౌలర్లకు ఫలితం దక్కలేదు. ఆర్చర్ కాస్త కట్టడి చేసినా ఆఖరి ఓవర్‌లో మరో 13 పరుగులతో స్కోరు 210+ దాటగలిగింది. ఈ జోడీ మధ్య మూడో వికెట్‌కు అజేయంగా 94 పరుగులు జత చేరాయి.

1. ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో నలుగురు బ్యాటర్లు 45+ రన్స్ సాధించడం ఇదే తొలిసారి.
2. టీ20ల్లో ఒకే జట్టు తరపున ఎక్కువ పరుగులు (ముంబై, 6024) చేసిన రెండో బ్యాటర్‌గా రోహిత్. విరాట్ (ఆర్‌సీబీ, 8871) టాప్‌లో ఉన్నాడు.

ప్రతీ సిక్సర్‌తో ఆరు గృహాలకు విద్యుత్

ముంబైతో మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు పూర్తి గులాబీ రంగు జెర్సీలతో ఆడింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సాధికారతకు మద్దతుగా ఆర్‌ఆర్ 'పింక్ ప్రామిస్' క్యాంపెయిన్ నిర్వహిస్తుండగా.. దీంట్లో భాగంగానే జట్టంతా పూర్తి పింక్‌లోకి మారింది. అలాగే రాజస్థాన్‌లో మహిళల ఆధ్వర్యంలో నడిచే గ్రామాల అభివృద్ధికి ప్రతీ టిక్కెట్ ధర నుంచి రూ.100లను విరాళంగా ఇవ్వనుంది. అంతేకాకుండా మ్యాచ్‌లో నమోదయ్యే ఒక్కో సిక్సర్‌కు ఆరు ఇళ్లచొప్పున సంభార్ ప్రాంతంలోని సౌరశక్తితో కరెంట్‌ను అందివ్వబోతున్నట్టు రాజస్థాన్ రాయల్స్ ఫౌండేషన్ పేర్కొంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ముంబై	11	7	4	0	14	1.274
బెంగళూరు	10	7	3	0	14	0.521
పంజాబ్	10	6	3	1	13	0.199
గుజరాత్	9	6	3	0	12	0.748
ఢిల్లీ	10	6	4	0	12	0.362
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	11	3	8	0	6	-0.780
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	10	2	8	0	4	-1.211

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

ముంబై: రికెల్టన్ (బి) తీక్షణ 61; రోహిత్ (సి) జైస్వాల్ (బి) పరాగ్ 53; సూర్యకుమార్ (నాటౌట్) 48; హార్దిక్ (నాటౌట్) 48; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 217/2. వికెట్ల పతనం:** 1-116, 2-123; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-42-0; ఫరూఖి 4-0-54-0; తీక్షణ 4-047-1; కార్తికేయ 2-0-22-0; ఆకాశ్ 4-0-39-0; పరాగ్ 2-0-12-1.

రాజస్థాన్: జైస్వాల్ (బి) బౌల్ట్ 13, వైభవ్ సూర్యవంశీ (సి) జాక్స్ (బి) చాహర్ 0, రాణా (సి) తిలక్ (బి) బౌల్ట్ 9, పరాగ్ (సి) రోహిత్ (బి) బుమ్రా 16, జురెల్ (సి) అండ్ (బి) కర్ణ్ శర్మ 11, హెట్‌మయెర్ (సి) సూర్య (బి) బుమ్రా 0, శుభమ్ దూబే (సి) బౌల్ట్ (బి) హార్దిక్ 15, ఆర్చర్ (సి) బుమ్రా (బి) బౌల్ట్ 30, తీక్షణ (సి) సూర్య (బి) కర్ణ్ శర్మ 2, కార్తికేయ (సి) చాహర్ (బి) కర్ణ్ శర్మ 2, మధ్వాల్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు 15, మొత్తం: 16.1 ఓవర్లలో 117 ఆలౌట్; వికెట్లపతనం:** 1-1, 2-18, 3-41, 4-47, 5-47, 6-64, 7-76, 8-87, 9-91, 10-117; **బౌలింగ్:** దీపక్ చాహర్ 2-0-13-1, బౌల్ట్ 2.1-0-28-3, బుమ్రా 4-0-15-2, బాష్ 3-0-29-0, హార్దిక్ పాండ్యా 1-0-2-1, కర్ణ్ శర్మ 4-0-23-3.

లిఫ్టింగ్‌లో రెండు కాంస్యాలు


జోష్న
సాహు

లిమా (పెరూ): యూత్, ప్రపంచ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్లు మరో రెండు కాంస్యాలు సాధించారు. గురువారం యూత్ బాలికల 40 కి. విభాగంలో జోష్నా సబర్ మొత్తం 129 కేజీలు (56కి.+72కి.) ఎత్తి కాంస్య పతకం నెగ్గింది. బుధవారం..క్లీన్ అండ్ జెర్క్‌లో ఆమె రజత పతకం అందుకుంది. ఇక యూత్ బాలుర 49 కి. కేటగిరీలో హర్షవర్దన్ సాహు మొత్తం 197 కి. (87కి.+110కి.) ఎత్తి కాంస్యం దక్కించుకున్నాడు. క్లీన్ అండ్ జెర్క్‌లోనూ సాహు కాంస్యం గెలుపొందాడు.

శ్రేయా‌స్‌కు రూ. 12 లక్షల జరిమానా

చెన్నయ్: పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. చెన్నయ్ సూపర్ కింగ్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ నిర్ణీత సమయానికి ఓవర్లను పూర్తి చేయకపోవడంతో ఈ చర్య తీసుకున్నారు.

భారత్‌కు ఓదార్పు విజయం

- ఇంగ్లండ్‌పై 3-2తో గెలుపు
- సుదీర్మన్ కప్

గ్జియామెన్ (చైనా): సుదీర్మన్ కప్ మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో నాకౌట్‌కు చేరడంలో విఫలమైన భారత్‌కు ఓదార్పు విజయం లభించింది. గ్రూప్-డిలో భాగంగా గురువారం జరిగిన ఆఖరి పోరులో 3-2తో ఇంగ్లండ్‌పై గెలుపొందింది. సింగిల్స్‌లో అనుపమా ఉపాధ్యాయ, సతీష్ కరుణాకరన్, డబుల్స్‌లో తనీషా/శ్రుతి మిశ్రా తమ మ్యాచ్‌ల్లో నెగ్గారు. గ్రూప్ తొలి రెండు మ్యాచ్‌ల్లో డెన్మార్క్, ఇండోనేసియా చేతిలో ఓడడంతో భారత్ నాకౌట్ అవకాశాలు గల్లంతయ్యాయి.

లార్డ్స్‌లో ఫైనల్



మహిళల టీ20 వరల్డ్‌కప్ వేదికలను ఖరారు చేసిన ఐసీసీ

దుబాయ్: వచ్చే ఏడాది జరిగే మహిళల టీ20 వరల్డ్‌కప్ ఫైనల్‌కు ప్రఖ్యాత లార్డ్స్ క్రికెట్ మైదానాన్ని వేదికగా ఐసీసీ ఖరారు చేసింది. 12 జట్ల పోటీ కప్ 2026, జూన్ 12న ఆరంభం కానుండగా.. జూలై 5న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. టోర్నీలో 7 వేదికల్లో మొత్తం 33 మ్యాచ్‌లు జరుగుతాయి. లార్డ్స్‌తోపాటు ఓల్డ్ ట్రాఫర్డ్, హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్, ఓవల్, హాంప్‌షైర్ బౌల్, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇప్పటిదాకా 10 జట్లతో జరిగిన ఈ టోర్నీలో ఈసారి మరో 2 టీమ్‌లు అదనంగా చేరుతాయి. పూర్తి షెడ్యూల్‌ను ఐసీసీ త్వరలో విడుదల చేయనుంది. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ సహా ఎనిమిది జట్లు ఈపాటికే అర్హత సాధించగా.. మిగిలిన నాలుగు బెర్త్‌లను టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్ ద్వారా నిర్ణయిస్తారు.

నేటి మ్యాచ్

గుజరాత్ x హైదరాబాద్
వేదిక: అహ్మదాబాద్
రా.7.30 నుంచి



సాత్విక్ జంటకు 'ఖేల్‌రత్న' ప్రదానం

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ ఎట్టకేలకు మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును అందుకొంది. గురువారం కేంద్ర క్రీడామంత్రి మన్సుఖ్ మాండవీయ..ఈ అవార్డును ప్రదానం చేశారు. 2023లో ప్రదర్శనకుగాను గతేడాది సాత్విక్ జంటను ఖేల్‌రత్నకు ఎంపిక చేశారు. గత ఫిబ్రవరిలో అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని షెడ్యూల్ చేయగా.. ఇందు కోసం వెళ్తున్న సమయంలో సాత్విక్ తండ్రి కాశీ విశ్వనాథం గుండెపోటుతో మరణించడంతో వాయిదా పడింది.

ఆఖరి రోజు 4 స్వర్ణాలు

రెండో స్థానంలో భారత్ :ఆసియా బాక్సింగ్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15, అండర్-17 చాంపియన్‌షిప్‌లో ఆఖరిరోజు గురువారం భారత బాక్సర్లు నాలుగు స్వర్ణాలు కొల్లగొట్టారు. దాంతో మొత్తం 43 పతకాల (15 స్వర్ణ, 6 రజత, 22 కాంస్య)తో భారత్ పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. కజకిస్థాన్ అగ్రస్థానం దక్కించుకుంది. అండర్-17 బాలికల విభాగంలో ఖుషీ చంద్ (46కి.), అహానా శర్మ (50కి.), జానత్ (54కి.), అన్షిక (80+) పసిడి పతకాలతో, సిమ్రన్‌జీత్ కౌర్ (60కి.), హర్షిక (63కి.), రజత పతకాలతో టోర్నీని ముగించారు. ఇక..బాలుర అండర్-17 కేటగిరీలో దేవాన్ష్ (80కి.) రజత పతకం అందుకున్నాడు.

విఘ్నేష్ స్థానంలో రఘు శర్మ


రఘు

ముంబై: ముంబై ఇండియన్స్ లెఫ్టామ్ స్పిన్నర్ విఘ్నేష్ పుతుర్ గాయంతో ఐపీఎల్‌కు దూరమయ్యాడు. తాజా సీజన్‌లోనే అరంగేట్రం చేసిన తను ఐదు మ్యాచ్‌ల్లో ఆరు వికెట్లు తీశాడు. అతడి స్థానంలో జట్టు 32 ఏళ్ల పంజాబ్ లెగ్ స్పిన్నర్ రఘు శర్మను ఎంపిక చేసుకుంది. 11 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో అతడు 57 వికెట్లు తీశాడు. అలాగే గత విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ తరపున పేసర్ అర్షదీప్ తర్వాత 14 వికెట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఇక రాజస్థాన్ రాయల్స్ పేస్ బౌలర్ సందీప్ శర్మ కూడా రాబోయే అన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. గుజరాత్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో సందీప్ చేతి వేలికి గాయమైంది. వైద్య పరీక్షల్లో దాన్ని ఫ్రాక్చర్‌గా నిర్ధారించారు.

బిజినెస్

కాగ్నిజెంట్‌లో 25,000 మంది ఫ్రెషర్ల హైరింగ్



న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రాంగణ నియామకాల ద్వారా 20,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోనున్నట్లు అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో ఫ్రెషర్లకు ఉద్యోగాలివ్వనున్నట్లు కాగ్నిజెంట్ సీఈఓ రవి కుమార్ ఎస్ వెల్లడించారు. బలమైన మానవ వనరుల వ్యవస్థ నిర్మాణంతో పాటు గడిచిన రెండేళ్లలో పెరిగిన మేనేజ్డ్ సర్వీసెస్ ప్రాజెక్టులు, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్‌కు మద్దతుగా ఫ్రెషర్ల నియామకాలను పెంచాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కంపెనీ ఫ్రెషర్ల నియామకాలతో పాటు ఏఐ ద్వారా ఉత్పాదకత పెంపు, మానవ వనరులను మరింత మెరుగ్గా వినియోగించుకోవడంపై దృష్టి సారించిందన్నారు. ఈ మార్చి 31 నాటికి కాగ్నిజెంట్‌లో మొత్తం 3,36,300 మంది ఉద్యోగులున్నారు. అందులో 85 శాతానికి పైగా కంపెనీకి చెందిన భారత కార్యాలయాల్లో పనిచేస్తున్నారు.

త్రైమాసిక ఆదాయం 510 కోట్ల డాలర్లు: మార్చితో ముగిసిన త్రైమాసికంలో కాగ్నిజెంట్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7.45 శాతం పెరిగి 510 కోట్ల డాలర్లకు చేరింది. ఈ ఏడాది మొత్తానికి ఆదాయ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 2.6-5.1 శాతం నుంచి 3.9-6.4 శాతానికి పెంచింది. 2025లో మొత్తం 2050-2,100 కోట్ల డాలర్ల రాబడి నమోదు కావచ్చని సంస్థ అంచనా వేసింది.

జీఎస్‌టీ వసూళ్లలో సరికొత్త రికార్డు



ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లకు చేరిక ● వార్షిక ప్రాతిపదికన 12.6 శాతం వృద్ధి

జీఎస్‌టీ చరిత్రలో నెలవారీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు దాటడం ఇది రెండో సారి

న్యూఢిల్లీ: ఏప్రిల్‌లో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.2.37 లక్షల కోట్లకు పెరిగాయి. 2024 ఏప్రిల్‌లో నమోదైన రూ.2.10 లక్షల కోట్ల ఆదాయంతో పోలిస్తే 12.6 శాతం వృద్ధి నమోదైంది. దేశంలో ఆర్థిక కార్యకలాపాలు జోరందుకోవడంతోపాటు వ్యాపారుల ఆర్థిక సంవత్సరాంతర సర్దుబాట్లు ఇందుకు దోహదపడ్డాయి. ఎందుకంటే, వ్యాపారులు మార్చి నెల ఆర్థిక లావాదేవీలపై జీఎస్‌టీని ఏప్రిల్‌లో చెల్లిస్తారు. 2017 జూలై నుంచి జీఎస్‌టీ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి నెలవారీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాటడం ఇది రెండోసారి. వసూళ్లలో రెండో అత్యధిక రికార్డుతో పాటు గతంలో రూ.2 లక్షల కోట్లకు పైగా వసూళ్లు కూడా క్రితం ఏడాది ఏప్రిల్‌లోనే నమోదు కావడం గమనార్హం. కాగా, ఈ మార్చిలో వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లుగా ఉంది.

ఆర్థిక జోరుకు సంకేతం: కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్‌టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 10.7 శాతం పెరిగి రూ.1.90 లక్షల కోట్లకు చేరాయి. వస్తు దిగుమతులపై పన్ను రాబడి 20.8 శాతం వృద్ధి చెంది రూ.46,913 కోట్లుగా నమోదైంది. అదే సమయంలో కేంద్ర ప్రభు త్వం రూ.27,341 కోట్ల పన్నును రిఫండ్ చేసింది. ఈ రిఫండ్ సర్దుబాటు అనంతరం జీఎస్‌టీ నికర వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా ఉన్నాయి.ఈ ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే జీఎస్‌టీ నికర ఆదాయం రూ.2 లక్షల కోట్లు దాటడం ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరుకు సంకేతమని డెలాయిట్ ఇండియా భాగస్వామి ఎంఎస్ మణి అన్నారు.

> జీఎస్‌టీ ఆదాయ తాజా గణాంకాలు భారత ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకత, సహకార సమాఖ్యవాద ప్రభావానికి నిదర్శనం. వసూళ్లు రికార్డు స్థాయికి చేర్చటంలో పాలు పంచుకున్న పన్ను చెల్లింపుదారులకు కృతజ్ఞతలు. పన్ను వసూళ్ల వృద్ధిలో కేంద్ర, రాష్ట్ర జీఎస్‌టీ అధికారుల పాత్ర ఎంతో ఉంది.
> -నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి

1.5 కోట్లు దాటిన జీఎస్‌టీ రిజిస్ట్రేషన్లు

గత ఆర్థిక సంవత్సరం (2024-25) చివరి నాటికి జీఎస్‌టీ నెట్‌వర్క్‌లోని రిజిస్టర్డ్ వ్యాపారుల సంఖ్య 1.5 కోట్లు దాటింది. అందులో 25 లక్షల మంది 2024-25లో రిజిస్టర్ చేసుకున్నారు. కాగా, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడులో 10 లక్షల చొప్పున జీఎస్‌టీ రిజిస్టర్డ్ వ్యాపారులున్నారు.

ఇక 15 సెకన్లలోనే యూపీఐ చెల్లింపులు

జూన్ 16 నుంచి అమలు

న్యూఢిల్లీ: డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిపే యూపీఐ చెల్లింపుల ప్రక్రియ మరింత త్వరితం కానుంది. ప్రస్తుతం ఒక్కో యూపీఐ చెల్లింపు లావాదేవీ పూర్తయ్యేందుకు 30 సెకన్లు పడుతోంది. వచ్చే నెల 16 నుంచి ఇది 15 సెకన్లకు తగ్గనుంది. దీనికి సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) గురువారం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందుకనుగుణంగా తమ వ్యవస్థలను సిద్ధం (అప్‌డేట్) చేసుకోవాలని బ్యాంకులు, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి థర్డ్ పార్టీ యాప్స్‌ను ఎన్‌పీసీఐ ఆదేశించింది. మరోవైపు చెల్లింపులు, బదిలీలు, బ్యాలెన్స్ చెక్, పిన్ మార్పు వంటి ఏపీఐ రెస్పాన్స్ టైమ్‌ను బ్యాంకులు, పేమెంట్ యాప్స్ ఇక నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలి. లేకపోతే చర్యలు తప్పవని ఎన్‌పీసీఐ హెచ్చరించింది.

పెంచిన ఏటీఎం చార్జీలు అమలు షురూ

ఏటీఎం చార్జీల పెంపుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు గురువారం నుంచి అమలులోకి వచ్చాయి. దీని ప్రకారం ఒక నెలలో ఉచితంగా విత్‌డ్రా చేసుకునేందుకు ఇచ్చిన పరిమితి దాటితే చేసే ఒక్కో లావాదేవీపై బ్యాంకులు రూ.23 చార్జీ చేయనున్నాయి. గతంలో ఈ చార్జీ రూ.21 ఉండేది. ఒక్కో లావాదేవీపై రూ.2 పెంచుకునేందుకు బ్యాంకులను అనుమతిస్తూ మార్చి 28న ఆర్‌బీఐ సర్క్యులర్ జారీ చేసింది. కస్టమర్ల ఖాతా ఉన్న బ్యాంక్ ఏటీఎంలలో ఉచిత లావాదేవీల (ఆర్థిక, ఆర్థికేతర) పరిమితి మెట్రో నగరాల్లో అయితే నెలకి మూడు కాగా నాన్ మెట్రో నగరాల్లో అయితే ఐదుగా ఉంది.

వచ్చే దశాబ్దిలో రూ.8.5 లక్షల కోట్లు

మీడియా, వినోద రంగంపై అంబానీ అంచనా



ముంబై: దేశంలో మీడియా, వినోద రంగం వచ్చే దశాబ్ది కాలంలో మూడు రెట్లు పెరిగి 10 వేల కోట్ల డాలర్లకు (రూ.8.5 లక్షల కోట్లు) చేరవచ్చని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ అన్నారు. ప్రస్తుతం ఈ రంగం పరిమాణం 2800 కోట్ల డాలర్లుగా (రూ.2.38 లక్షల కోట్లు) ఉంది. దేశంలో అతిపెద్ద మీడియా సంస్థ నెట్‌వర్క్ 18 అధిపతి కూడా అయిన అంబానీ ముంబైలో గురువారం ప్రారంభమైన వేవ్స్ 2025 సదస్సులో మాట్లాడుతూ.. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి లక్షల్లో ఉద్యోగావకాశాలు కల్పించగల సామర్థ్యం ఉన్నదని అన్నారు. వీటి అనుకూల ప్రభావం ఇతర రంగాలపై కూడా ఉంటుందని తెలిపారు. కథలు వినిపించడం, డిజిటల్ టెక్నాలజీ విభాగాలు రెండింటిలోనూ భారత్‌కు కీలక స్థానం ఉన్నదని, ఇవి వ్యూహాత్మకంగా కీలకమైనవని చెప్పారు. ఏఐ, ఇమ్మెర్సివ్ టెక్నాలజీలు కథలు చెప్పడాన్ని మరింత సజీవం చేస్తాయని, అన్ని భాషల ప్రేక్షకులకు మరింత చేరువ చేస్తాయని అంబానీ అన్నారు. ఈ సాధనాలు వినియోగించుకోవడం ద్వారా భారత్‌కు చెందిన అత్యంత ప్రతిభావంతులైన యువ క్రియేటర్లు ప్రపంచ వినోద రంగానికి బ్లాక్‌బస్టర్లు అందించవచ్చని సూచించారు. తీవ్ర అస్థిరతలు, కల్లోలాలతో కూడిన ప్రస్తుత ప్రపంచంలో మన కథలు భవిష్యత్తుకు ఆశాజ్యోతిగా నిలుస్తాయని, అవి అందరినీ ఐక్యం చేసి స్ఫూర్తిని, చైతన్యాన్ని నింపుతాయని ఆయన అన్నారు. ఐదు వేల సంవత్సరాల నాగరిక వైభవం గల మన దేశం ప్రపంచానికి రామాయణ, మహాభారతాలను, అద్భుతమైన జానపద గేయాలను అందించిందని అంబానీ చెప్పారు.

భారత విమానాలపై పాక్ నిషేధంతో ఏఐపై రూ.5,000 కోట్ల భారం

న్యూఢిల్లీ: భారత విమానాలు తన గగనతలం నుంచి ప్రయాణించకుండా పాకిస్థాన్ విధించిన నిషేధం భారత విమానయానంపై పెద్ద భారమే మోపుతోంది. ఒక్క ఎయిర్ ఇండియా (ఏఐ)పైనే ఈ భారం ఏడాదికి ఎంత లేదన్నా 60 కోట్ల డాలర్ల (సుమారు రూ.5,070 కోట్లు) వరకు ఉంటుందని అంచనా. కంపెనీ రాసిన ఒక లేఖను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ ఈ మేరకు ఒక కథనం ప్రచురించింది. ఈ నిషేధంతో ఢిల్లీ నుంచి యూరప్, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా దేశాలకు వెళ్లే భారత విమానాలు ఇక గుజరాత్, ఇరాన్ మీదుగా ప్రయాణించాలి. ఇందుకు ఎంత లేదన్నా ఒక్కో విమానానికి గంట అధిక సమయం, దాదాపు 10 టన్నుల అదనపు ఇంధనం ఖర్చవుతాయని అంచనా. అమెరికా, కెనడా, యూరప్ దేశాలకు ఎయిర్ ఇండియా ఢిల్లీ నుంచి రోజూ కనీసం 35 విమాన సర్వీసులు నడుపుతోంది.

- **హైదరాబాద్ మార్కెట్లోకి ఆల్ట్.ఎఫ్ కోవర్కింగ్**

కోవర్కింగ్ సంస్థ ఆల్ట్.ఎఫ్.. హైదరాబాద్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 56,000 చదరపు అడుగుల్లో తొలి సెంటర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ సెంటర్ సీటింగ్ సామర్థ్యం 1,200. ప్రస్తుతం ఆల్ట్.ఎఫ్.. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్‌లో 11 వేల సీటింగ్ సామర్థ్యం గల సెంటర్లను నిర్వహిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	435	విజయవాడ	460
వరంగల్	437	గోదావరి	440
చిత్తూరు	513	విశాఖపట్నం	445

డజను గుడ్లు రూ. 60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	127
వరంగల్	125	గుంటూరు	125
కరీంనగర్	125	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	97
కర్నూలు	125	నెల్లూరు	102
విశాఖపట్నం	126	అనంతపురం	102
గోదావరి	127		

సవాళ్లున్నా ఆటో ముందుకే

రెండు, మూడు స్థానాల్లోకి మహీంద్రా, టాటా

న్యూఢిల్లీ: తీవ్ర సవాళ్లతో కూడిన వాతావరణంలో కూడా ఆటో రంగం అమ్మకాలను పెంచుకుంది. ఏప్రిల్ నెలలో మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) కార్ల అమ్మకాలు పెరిగాయి. అయితే టాటా మోటార్స్, హ్యుండయ్ అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన తగ్గాయి. దీంతో ఇంతకాలం రెండో స్థానంలో ఉంటూ వచ్చిన హ్యుండయ్ మోటార్స్ ఆ స్థానాన్ని కోల్పోగా మహీంద్రాకు కోల్పోగా మూడో స్థానంలో టాటా మోటార్స్ నిలిచింది. కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా మొత్తం అమ్మకాలు ఏప్రిల్ నెలలో ఏడు శాతం పెరిగి 1,79,791కి చేరాయి. గత ఏడాది ఏప్రిల్‌లో కంపెనీ 1,68,089 కార్లను విక్రయించింది. కాగా దేశీయ విక్రయాలు మాత్రం ఒక శాతం పెరిగి 1,37,952 నుంచి 1,38,704కి చేరాయి. ఎగుమతులు 22,160 యూనిట్ల నుంచి 27,911 యూనిట్లకు పెరిగాయి.

కంపెనీ	విక్రయాలు ఏప్రిల్ 2025	ఏప్రిల్ 2024	వృద్ధి (%)
మహీంద్రా అండ్ మహీంద్రా	84,170	----	19
టాటా మోటార్స్	45,199	47,883	-6
హ్యుండయ్ మోటార్స్	50,201	44,374	-12
కియా ఇండియా	23,623	19,968	18
టయోటా కిర్లోస్కర్	27,324	20,494	33
జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్	5,829	4,725	23
హోండా కార్స్	3,360	4,351	-23
ద్విచక్ర వాహనాలు			
సుజుకీ మోటార్ సైకిల్	1,12,948	99,377	14
టీవీఎస్ మోటార్	4,43,896	3,83,615	16
రాయల్ ఎన్‌ఫీల్డ్	86,559	82,043	6

మార్కెట్లో మోసాలను అడ్డుకునే సత్తా మాకుంది

సెబీ చైర్మన్ పాండే

ముంబై: స్టాక్ మార్కెట్లో జరిగే మోసాలు, కుట్రలను అడ్డుకునే సత్తా తమకు ఉందని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు ఉండాల్సిన అవసరం లేదన్నారు. మోసగాళ్ల ఆటకట్టించేందుకు ఇప్పటికే అవసరమైన నియంత్రణలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఎవరైనా ఈ నియంత్రణలు పనిచేయడం లేదనే అభిప్రాయంతో ఉంటే, వారు వెంటనే ఆ అభిప్రాయం నుంచి బయటికి రావాలని పాండే కోరారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,730 ▼	87,750 ▼	1,07,000 ▼
విజయవాడ	96,200 ▼	90,000 ▼	96,000 ▼
విశాఖపట్నం	95,820 ▼	87,750 ▼	1,07,000 ▼
రాజమండ్రి	95,730 ▼	87,750 ▼	96,500 ▼
ప్రొద్దుటూరు	95,700 ▼	88,040 ▼	96,800 ▼
ముంబై	94,360 ▼	86,440 ▼	94,110 ▼

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 2-5-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా అనుసంధానం

2

ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత పెంచేందుకే

ఆర్‌జీఐ నుంచి నేరుగా మరణాల సమాచారం

వెంటనే బీఎల్వోలతో క్షేత్రస్థాయిలో ధ్రువీకరణ


కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

నాటి స్వప్నం..



2015లో అమరావతికి శంకుస్థాపన

ఐదేళ్లు ఆగిన 'అమరావతి'కి పునః ప్రాణ ప్రతిష్ఠ! తెలుగు వారి కలల రాజధానిగా మొదలై... వడివడిగా పరుగులు తీసి... జగన్ రాకతో ఒక్కసారిగా కుదేలైన రాజధానిలో మళ్లీ పనుల కళ! 2015 అక్టోబరు 22వ తేదీన ప్రధాన మంత్రి హోదాలో నరేంద్ర మోదీ అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు! నిరాటంకంగా, నిర్విరామంగా పనులు కొనసాగాయి. అవి అదే వేగంతో, అంతే ఊపుతో కొనసాగి ఉంటే ఇప్పటికి కీలక నిర్మాణాలన్నీ పూర్తయి... మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు జరిగేవి. ప్రజా రాజధాని ఈపాటికి కళ్లముందు సాక్షాత్కరించేది. కానీ... జగన్ నిర్వాకంతో ఐదేళ్లకుపైగా కాలం కరిగిపోయింది. అమరావతి చిట్టడవిలా మారిపోయింది. దాదాపుగా పూర్తయిన నిర్మాణాలకూ దిక్కులేకుండా పోయింది. కూటమి



ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ అమరావతిపై దృష్టి సారించింది. రాజధాని నగర నిర్మాణం పూర్తి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం సిద్ధిస్తోంది. అమరావతిపై జగన్ కక్షల నుంచి మొలిచిన పిచ్చి చెట్లు, పొదలూ తొలగించి... నాడు ఆగిపోయిన నిర్మాణాలు నేటికీ బలంగానే ఉన్నాయని నిర్ధారించి... చట్టపరమైన, సాంకేతిక అడ్డంకులను అధిగమించి... మళ్లీ కాంట్రాక్టులు అప్పగించేందుకు ఇన్నాళ్లు పట్టింది. శుక్రవారం ప్రధాని మోదీ 'అమరావతి 2.0'కు శ్రీకారం చుడుతున్నారు. ఇక ఆలస్యమేమీ ఉండదు! అడ్డంకులేవీ ఉండవు! పనుల ప్రారంభానికి నిర్మాణ సంస్థలు సర్వం సిద్ధం చేశాయి. మునుపటి వేగమే మళ్లీ! మూడేళ్లలో అమరావతిలోని కీలక నిర్మాణాలన్నీ పూర్తి చేయడమే లక్ష్యం!

నేడు సాకారం..



శుక్రవారం ప్రధాని మోదీ ఆవిష్కరించనున్న పైలాన్

సమగ్ర కథనాలు...14,15లో

అమరావతికి జయం!

అడ్డంకులు అధిగమించి అడుగు ముందుకు

నాడు రాజధాని నిర్మాణానికి ప్రధాని శ్రీకారం

నేడు అదే మోదీ చేతుల మీదుగా పునరుద్ధరణ

జగన్ కారణంగా ఐదేళ్ల కాల హరణం

కూటమి రాగానే మళ్లీ అమరావతిపై దృష్టి

ఇక పరుగు తీయనున్న రాజధాని పనులు

అమరావతి, మే1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. శుక్రవారం అమరావతి నిర్మాణ పనులకు మోదీ చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్నారు. రూ.49,040 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటు మరో రూ.8 వేల కోట్ల విలువైన పనులకు

మిగతా 13వ పేజీలో...



రాజధానిలో సర్వాంగ సుందరంగా సిద్ధమైన అమరావతి పునఃప్రారంభ కార్యక్రమ వేదిక

2.0కు సర్వం సిద్ధం

నేడు ప్రధాని చేతుల మీదుగా పనులకు శ్రీకారం

రూ.49,040 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన

మరో రూ.8 వేల కోట్ల పనులకూ పచ్చజెండా

మధ్యాహ్నం 2.55కు గన్నవరం ఎయిర్‌పోర్టుకు

అక్కడి నుంచి హెలికాప్టర్‌లో వెలగపూడికి

వేదికపై మోదీ, బాబు, పవన్ సహా 14 మంది

రెండున్నర గంటల పాటు ప్రధాని పర్యటన

సభకు వచ్చే ప్రజల కోసం 8 వేల బస్సులు



కూటమి జెండాలతో కళకళలాడుతున్న సీడ్ యాక్సిస్ రోడ్

పాక్‌లో గుబులు!

ఇప్పటికే అంతర్గత సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతున్న దాయాది దేశం



గురువారం పాకిస్థాన్‌లోని టిల్లా ఫైరింగ్ రేంజ్‌లో ఆ దేశ సైనిక విన్యాసాలు

భారత్‌తో పోరు తప్పదేమోనని ఆందోళన

బంగ్లాను వాడుకుని భారత్‌పై ఒత్తిడికి ప్లాన్

అందుకే భారత్-బంగ్లా సరిహద్దుల్లో పాక్ సైన్యం, ఐఎస్ఐ కదలికలు!

అటు ఎల్వోసీ వెంట నిఘా రాడార్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థల మోహరింపు

పాక్ ప్రధాన నగరాలు కరాచీ, లాహోర్‌ల గగనతలంపై నెల రోజులపాటు ఆంక్షలు

పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ అదృశ్యం

దేశం వదిలి పారిపోయారనే ప్రచారం

న్యూఢిల్లీ, మే 1: అంతర్గత సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్థాన్.. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతర పరిణామాలతో ఆందోళన చెందుతోంది. ఇప్పటికే ఓవైపు అఫ్ఘానిస్థాన్, బలూచిస్థాన్, ఇరాన్‌లతో ఉద్రిక్త పరిస్థితులు, పాక్ ఆర్మీ చీఫ్ అదృశ్యమయ్యారనే ప్రచారం, సైన్యం, నేవీ యుద్ధానికి సిద్ధంగా లేవనే అంచనాలు.. మరోవైపు భారత్‌తో యుద్ధం తప్పదేమోననే యోచనతో ఆ దేశ ఆత్మస్థైర్యం దెబ్బతిన్నట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లో పాక్ సైనికాధికారులు, పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ కదలికలు ఉన్నాయని బయటపడటం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో

మిగతా 2వ పేజీలో...

అమృత్‌సర్‌లో ఉగ్ర కుట్ర భగ్నం!

భారీగా ఆయుధాలు స్వాధీనం

తుపాకులు, గ్రనేడ్లు ఉండటంతో కలకలం

బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసుల ఆపరేషన్

పాకిస్థానీలు భారత్ వీడేందుకు గడువు పొడిగింపు

2

మానవతా దృక్పథంతో గడువు సవరించిన కేంద్రం

భారత్‌కు రూ.1100 కోట్ల సైనిక సామగ్రి సరఫరాకు అమెరికా ఆమోదం

13

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటాం

రాజ్‌నాథ్‌తో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్



ఆత్మకూరు శివార్లలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవ శిలాఫలకం వద్ద సీఎం చంద్రబాబు, మంత్రులు ఆనం, ఫరూక్, టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు వేమిరెడ్డి, బీద, కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

పారిశ్రామికీకరణతోనే రాష్ట్రాభివృద్ధి

ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారుచేస్తాం

ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలి

ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్లగ్ అండ్ ప్లే విధానం

పరిశ్రమల స్థాపనకు ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి

దరఖాస్తులు పరిశీలించి జూన్‌లో కొత్త పింఛన్లు

రైతులకు మూడు విడతల్లో రూ.20 వేలు సాయం

'తల్లికి వందనం' కింద ప్రతి బిడ్డకూ రూ.15 వేలు

రాష్ట్రంలో 35 లక్షల బంగారు కుటుంబాల ఎంపిక

ఆదుకోవడానికి మార్గదర్శులు ముందుకు రావాలి

ఆత్మకూరు ప్రజా వేదికలో సీఎం చంద్రబాబు పిలుపు

50 ఎంఎస్ఎంఈ పార్కుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

తెలుగుదేశం పార్టీ జెండాలో నాగలి, గుడిసె, చక్రం ఉంటా యి. నాగలి రైతులకు, గుడిసె పేదలకు, చక్రం కార్మికులకు సూచిక. రైతులు, పేదలు, కార్మికులకు ఎల్లప్పుడూ టీడీపీ అండగా నిలుస్తుంది.

- సీఎం చంద్రబాబు

నెల్లూరు, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. వారిని దృష్టిలో పెట్టుకొనే రూ.వేల కోట్ల ఆదాయం వదులుకొని ఇసుకను ఉచితం చేశామని తెలిపారు. రైతులు, పేదలు, కార్మికుల

మిగతా 12వ పేజీలో...

శ్రామికులతోనే దేశ ప్రగతి



అభివృద్ధికి ఉపాధి పథకం వెన్నెముక

ఉపాధి శ్రామికుల సంక్షేమానికి కట్టుబడతాం

శిథిల ఆర్థిక వ్యవస్థకు ఊపిరిగా పంచాయతీరాజ్ నిధులు: డిప్యూటీ సీఎం

13



వారికి ఎస్సీ హోదా వర్తించదు

12

క్రైస్తవంలోకి మారగానే దానిని కోల్పోతారు

ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరు

ఫిర్యాదుదారు పాస్టరు.. ఆయన ఫిర్యాదు చెల్లదు.. స్పష్టంచేసిన హైకోర్టు

పాక్ నుంచి తిరిగొచ్చిన బెజవాడ కోడలు!

అటారీ సరిహద్దుకు చేరుకున్న మోనికా రజని

పుట్టింటి వారిని చూడటానికి పాకిస్థాన్‌కు

పహల్గాం ఉగ్రదాడితో తిరిగి భారత్‌కు రాక

భర్త పవన్ రబ్బర్ ఇండస్ట్రీస్ అధినేత

2

గురునానక్ కాలనీలో కుటుంబం నివాసం

ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.3,354 కోట్లు

9

రాష్ట్రంలో 2017 నుంచి ఇదే అత్యధికం

రేపటి నుంచి గ్రూప్-1 మెయిన్స్

9

రాజ్ సహాయకుడు అరెస్ట్

సిట్ అదుపులో క్యాష్ హ్యాండ్లర్ దిలీప్.. చెన్నై నుంచి దుబాయ్ వెళ్లే ప్రయత్నం

ముందే లుక్ ఔట్ సర్క్యులర్ జారీ.. చెన్నైలో అరెస్టు చేసి.. బెజవాడకు తరలింపు

మద్యం కమీషన్లు వసూలు చేసిన ఐదుగురిలో దిలీప్ ఒకరు!

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరో వ్యక్తిని అరెస్టు చేసింది. మద్యం విధానం రూపకల్పన నుంచి వసూళ్ల వరకూ కీలక పాత్ర పోషించిన రాజ్ కసిరెడ్డి అలియాస్ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి వ్యక్తిగత

మిగతా 12వ పేజీలో...



కసిరెడ్డికి 'సిట్' కస్టడీ

వారం రోజులిస్తూ కోర్టు ఆదేశాలు

అడ్డగోలుగా కట్టేశారు!

డ్రాయింగ్ లేదు..ఉత్తర్వులూ లేవు

నోటి మాటతోనే అంతెత్తు గోడ కట్టారు

సిమెంట్ పిల్లర్లు లేకుండానే 'మమ'

ఈవో ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకోని కమిషనర్

అయినా హడావుడిగా 5 రోజుల్లో నిర్మాణం పూర్తి

సింహాచలంలో ఇంజనీరింగ్ విభాగం నిర్వాకమిదీ

ప్లాన్ మార్చారు.. ప్రాణాలపైకి తెచ్చారు : విచారణ కమిటీ

(విశాఖపట్నం,అమరావతి-ఆంధ్రజ్యోతి)

సింహాచలంలో దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి చందనోత్సవం వేళ జరిగిన పెను విషాదం పరాకాష్ఠగా నిలిచింది. ఏడుగురి ప్రాణాలు బలి తీసుకున్న రిటైనింగ్ వాల్ (సంరక్షణ గోడ) నిర్మాణానికి ఎటువంటి అధికారిక ఉత్తర్వులూ లేవు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే దానికి ఇంజనీరింగ్ అధికారులు డ్రాయింగ్ కూడా గీయలేదు. చందనోత్సవం నిర్వహిస్తున్నందున అక్కడ అత్యవసరంగా గోడ నిర్మించాలని, వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ నోటి మాట ప్రకారం కాంట్రాక్టర్

మిగతా 9వ పేజీలో...

వదిన చెబితేనే చేశా..

స్టోన్ క్రషర్ యజమానికి ఫోన్ చేసి మాట్లాడా

నేనెవరినీ బెదిరించలేదు

జాషువాయే ఆయన్ను భయపెట్టారు

విచారణలో రజిని మరిది వెల్లడి

కోర్టు ఆదేశాలతో గోపీని కస్టడీకి తీసుకున్న ఏసీబీ

3 రోజులపాటు విచారణ

అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): 'మా వదిన చెబితేనే స్టోన్ క్రషర్ యజమానికి ఫోన్ చేసి మాట్లాడా.. నేనెవరినీ బెదిరించలేదు.. అప్పటి గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అధికారి పల్లె జాషువాయే ఆయన్ను భయపెట్టారు..' అని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు విడదల రజిని మరిది



మిగతా 12వ పేజీలో...

ఎవ్వరూ కాపాడలేదు



మమ్మల్ని సమీపించిన ఉగ్రవాది - మీరు హిందువులా, ముస్లిములా అని అడిగాడు. కల్మా చదవమన్నాడు. మేము హిందువులం అని చెబుతుండగానే శుభంను కాల్చేశాడు. దాదాపు 45 నిమిషాలు కాల్పులు జరిగాయి. మమ్మల్ని కాపాడటానికి ఒక్కరూ ముందుకు రాలేదు. ఎవ్వరూ కాపాడరని ఉగ్రవాదులకు ముందే తెలుసు. అందువల్లే తాపీగా మతమేమిటో అడిగి తెలుసుకొని మరీ చంపేశారు. మేము వద్దు, వద్దంటున్నా- గుర్రాలవాడు బలవంతంగా మమ్మల్ని ఈ ప్రాంతానికి తీసుకొని వచ్చాడు. టెర్రరిస్టులకు స్థానికులు సహాయపడ్డారు. మేము ముస్లిములమైఉంటే బతికేవాళ్లం. హిందువులం కాబట్టే చంపేశారు.

- పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన శుభం ద్వివేది (కాన్పూర్) భార్య ఐశన్య

వాళ్లనేమీ అనొద్దు



ఆయన గొప్పగా బతికారు. మేమంతా గర్వపడేలా జీవించారు. అన్ని విధాలా ఆయన గౌరవాన్ని కాపాడతాం. ఉగ్రవాదులు కాల్పులు జరిపాక కూడా ఆయన కొద్దిసేపు బతికే ఉన్నారు. కానీ, కాపాడేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. ఆయనను చంపిన వాళ్లు బతక కూడదు. ఆ ఉగ్రవాదులను వదలకూడదు. అలాగని, ముస్లిములను, కశ్మీరీలను ప్రజలు వ్యతిరేకించాలని మేము కోరుకోవడం లేదు. మేము శాంతి కోరుతున్నాం. అవును.. శాంతి కావాలంటున్నాం. అదే సమయంలో మాకు న్యాయం కూడా జరగాలి

- ఉగ్రవాదుల దాడిలో అమరుడైన ఇండియన్ నేవీ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి (గురుగ్రామ్)

లోకం తీరు



పీవోకేను స్వాధీనం చేసుకోవాలి

» ఈసారి వదిలిపెట్టకూడదు: ఒవైసీ

హైదరాబాద్, మే 1: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను స్వాధీనం చేసుకోవాలని, ఈసారి మాత్రం వదిలిపెట్టకూడదని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మోదీ ప్రభుత్వానికి సూచించారు. ఉగ్రవాదులను 'ఇంట్లోకి చొరబడి చంపుతామ'న్న ప్రధాని మోదీ గత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. 'ఈసారి ఇంట్లోకి చొరబడి అక్కడే ఉండాల'ని వ్యాఖ్యానించారు. గురువారం ఒవైసీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాక్ సైనికులు పోస్టులను ఖాళీ చేసి వెళ్లిపోతున్నారన్న వార్తలపై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. 'అదే నిజమైతే చాలా మంచిది. మనం వెళ్లి ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాల'ని సూచించారు. మోదీ ప్రభుత్వం ఎల్‌వోసీ వెంబడి ఉగ్రవాదుల స్థావరాలను 2019లోనే నిర్మూలించకపోవడాన్ని ఒవైసీ విమర్శించారు. పీవోకే మనదేనని పార్లమెంటు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఈసారి కేంద్ర ప్రభుత్వం గట్టి చర్య తీసుకోవాలని సూచించారు.

ఒక్క ఉగ్రవాదిని కూడా వదలం: షా

న్యూఢిల్లీ, మే 1: పహల్గాంలో పర్యాటకులపై పాశవిక దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఎవర్నీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని, వారిని వెంటాడి పట్టుకుంటామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో అస్సోం బోడో సమాజం నాయకుడు ఉపేంద్రనాథ్ బ్రహ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పహల్గాం దాడికి గట్టిగా బదులిస్తామని, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని చెప్పారు.

పాక్ జాతీయులు భారత్ వీడేందుకు గడువు పొడిగింపు

న్యూఢిల్లీ, మే 1: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ జాతీయులు భారత్ నుంచి వెళ్లిపోయేందుకు విధించిన గడువును కేంద్రం నిరవధికంగా పొడిగించింది. తొలుత ఏప్రిల్ 30 వరకు మాత్రమే భారత్ గడువు విధించింది. అయితే వాఘా-అటారీ సరిహద్దు వద్ద తమ జాతీయులను గుర్తించి లోపలికి అనుమతించడంలో పాక్ అధికారులు చురుగ్గా వ్యవహరించడం లేదు. దీంతో పెద్ద సంఖ్యలో పాక్ జాతీయులు వాఘా-అటారీ సరిహద్దు వద్ద వేచి చూస్తున్నారు. ఈ తరుణంలో భారత్ మానవతా దృక్పథంతో గడువును సవరించింది. దీంతో పాక్ జాతీయులకు ఊరట లభించినట్లైంది. మరోవైపు ఇప్పటివరకు 911 మంది పాక్ జాతీయులు భారత్ నుంచి వెళ్లిపోయారు. కాగా, వాఘా-అటారీ సరిహద్దు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ వద్ద అబ్దుల్ వహీద్ భట్ అనే 80 ఏళ్ల పాక్ జాతీయుడు మృతి చెందాడు. 1980లోనే వీసా గడువు ముగిసినా భారత్‌లో ఉన్న భట్ పక్షవాతంతో బాధపడుతున్నాడు.

పాక్‌లో గుబులు!

(మొదటిపేజీ తరువాయి)

భారత్‌ను నేరుగా ఎదుర్కోలేని పాక్.. బంగ్లాదేశ్‌ను పావుగా వాడుకుని భారత్‌పై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నం చేస్తోందని రక్షణ నిపుణులు, విశ్రాంత సైనికాధికారులు చెబుతున్నారు.



గురువారం సైనిక విన్యాసాల సందర్భంగా నినాదాలు చేస్తున్న పాక్ సైనికులు

బంగ్లాదేశ్‌లో పాక్ సైన్యం, ఐఎస్ఐ ఏజెంట్ల కదలికలు

భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో పాక్ సైన్యం అధికారులు, ఆ దేశ నిఘా సంస్థ ఐఎస్ఐ ఏజెంట్ల కదలికలు బయటపడ్డాయి. దీనితో భారత ప్రభుత్వం బంగ్లా సరిహద్దుల్లో హైఅలర్ట్ ప్రకటించింది. ఇది బంగ్లాదేశ్ వేదికగా భారత్‌పై ఒత్తిడిని పెంచేందుకు పాక్ వేస్తున్న ఎత్తుగడ అనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. నిజానికి పాకిస్థాన్‌కు నలువైపులా చిక్కులే. అఫ్ఘానిస్తాన్‌లో తాలిబాన్ల పాలన తిరిగి మొదలైన తర్వాత రెండు దేశాలకూ పడటం లేదు. అఫ్ఘాన్ వేదికగా పనిచేస్తున్న తెహ్రీకే తాలిబాన్ పాకిస్థాన్ సహా పలు ఉగ్రవాద సంస్థలు తరచూ పాక్‌లో దాడులు చేస్తున్నాయి. ఇక బలూచిస్థాన్ వేర్పాటువాదులు ఇటీవలి కాలంలో తరచూ పాక్ సైన్యంపై దాడులు చేస్తుండటం తలనొప్పిగా మారింది. ఇరాన్‌ను అడ్డాగా చేసుకున్న జైష్ అల్ అదిల్ వంటి ఉగ్రవాద సంస్థలు పాక్‌పై.. పాకిస్థాన్‌లోని కొన్ని ఉగ్రవాద సంస్థలు ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయి. దీనితో పాక్, ఇరాన్ రెండు దేశాలు కూడా పరస్పరం సరిహద్దులు దాటి ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితిలో భారత్ చర్యలతో పాక్ ఆందోళనలో పడిందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. బంగ్లాదేశ్‌లో ఇటీవలి తిరుగుబాటు అనంతరం.. పాక్ అనుకూల మతవాద శక్తులు బలపడ్డాయని.. వాటిని పావుగా వాడుకుని భారత్‌ను ఇబ్బంది పెట్టాలన్నది పాక్ వ్యూహమని అంటున్నారు.

ఆర్మీ చీఫ్ మాయం వెనుక...

ఉగ్రవాదులను రెచ్చగొట్టి పహల్గాం ఘటనకు మూలకారకుడిగా ప్రచారం జరిగిన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్.. అదృశ్యమయ్యాడనే వార్తలు చర్చనీయాంశంగా మారాయి. ఆయన కుటుంబంతో సహా విదేశాలకు వెళ్లిపోయారని.. లేదా రావల్పిండిలోని ఓ బంకర్‌లో దాక్కున్నారని ప్రచారం జరుగుతోంది. పాక్ ప్రభుత్వం దీనిపై పూర్తి స్పష్టత ఇవ్వకుండా.. ప్రధాని షెహబాజ్‌తో ఆసిమ్ మునీర్ కలసి ఉన్న ఓ ఫొటోను విడుదల చేసింది. తాజాగా గురువారం కూడా.. 'భారత్ ఎలాంటి మిలటరీ చర్యలు చేపట్టినా.. తీవ్ర స్థాయిలో ప్రతిస్పందిస్తాం..' అంటూ ఆసిమ్ మునీర్ భారత్‌ను హెచ్చరించినట్టుగా ప్రకటన విడుదల చేసింది. కానీ ఆసిమ్ మునీర్ నేరుగా మీడియా ముందుకు మాత్రం ఇప్పటివరకు రాలేదు. ఇక పాక్ ప్రజల్లో పలుకుబడి ఉన్న ఇమ్రాన్‌ఖాన్‌ను పదవీచ్యుతుడిని చేసి, జైలుపాలు చేయడం వెనుక ఆర్మీ హస్తంపై అక్కడి ప్రజల్లో ఆగ్రహం నెలకొంది. ఈ క్రమంలో ఆసిమ్ మునీరే ప్రణాళిక రచించారని.. భారత ఆర్మీ దాడికి దిగితే, పాక్ సైన్యానికి ప్రజల మద్దతు లభిస్తుందని, సైన్యంపై పట్టు పెంచుకోవచ్చని భావించారని ఆరోపణలు ఉన్నాయి. పాకిస్థాన్‌లోని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ.. 'ది సండే గార్డియన్' ఆంగ్ల పత్రిక ఈ వివరాలను ప్రచురించింది. కానీ భారత ప్రతిస్పందన తీవ్రంగా ఉండటంతో.. ఆసిమ్ మునీర్ పట్ల పాక్ పాలకులు, ఆర్మీ అధికారుల్లోనే వ్యతిరేకత నెలకొందని, ఆయన అదృశ్యం వెనుక ఇదే కారణమై ఉంటుందని పేర్కొంది. మరోవైపు ఆర్మీ చీఫ్ అదృశ్యం, భారత్ దాడి భయంతో.. పాక్ ఆర్మీలో వివిధ ర్యాంకుల అధికారులు రాజీనామాలు చేస్తున్నారని, ఈ అంశం పాకిస్థాన్ పాలకుల్లో గుబులు రేపుతోందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. ఆసిమ్ మునీర్ అదృశ్యం వెనుక భారత్‌పై ఒత్తిడి పెంచే ప్రత్యేక వ్యూహమేదైనా ఉండొచ్చని రక్షణ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ప్రధాన నగరాల గగనతలంపై ఆంక్షలు

పాక్‌లోని ప్రధాన నగరాలు కరాచీ, లాహోర్‌ల గగనతలంపై ఆ దేశం ఆంక్షలు విధించింది. మే నెల మొత్తం రోజూ తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 వరకు ఎలాంటి ఎయిర్ ట్రాఫిక్ ఉండకుండా నిషేధం విధించింది. ఆ సమయాల్లో ప్రయాణించే పౌర విమానాలను ఇతర మార్గాల ద్వారా మళ్లించనున్నట్టు తెలిపింది. ఇక ఆ దేశానికి చెందిన అన్ని విమానాశ్రయాల్లోనూ ఈ నెల రోజులు హైఅలర్ట్ ప్రకటించింది.

బలహీనంగా పాక్ నేవీ..!

ప్రస్తుతం పాక్ నావికాదళం బాగా బలహీనంగా ఉందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. పాక్ నేవీలో ఎనిమిది జలంతర్గాములు ఉన్నాయి. అందులో పీఎన్ఎస్ హశ్మత్, పీఎన్ఎస్ హర్మత్, పీఎన్ఎస్ హమ్జా ప్రస్తుతం పనిచేసే స్థితిలో లేవు. రెండు అగోస్టా-70, మూడు అగోస్టా 90బీ తరహా జలంతర్గాములు మాత్రమే కాస్త మెరుగైన స్థితిలో ఉన్నాయి. ఇందులో ఒక అగోస్టా-70, ఒక అగోస్టా 90బీ జలంతర్గాములు.. మరమ్మతుల కోసం కరాచీ నేవీ బేస్‌లో ఉన్నట్టు ఇటీవల ఉపగ్రహ చిత్రాల ద్వారా గుర్తించారు. మరో అగోస్టా-90బి జలంతర్గామి కరాచీ షిప్‌యార్డ్ ఇంజనీరింగ్ వర్క్స్‌లో పూర్తిగా నేలమీదకు తెచ్చి పెట్టి ఉంది. అంటే దానికి భారీ స్థాయిలో మరమ్మతులు, ఆధునికీకరణ అవసరం. అంటే ప్రస్తుతం పాక్ వద్ద ఒక అగోస్టా-70, ఒక అగోస్టా 90బీ జలంతర్గాములు మాత్రమే పనిచేసే స్థితిలో ఉన్నాయి. భారత రిటైర్డ్ మేజర్ జనరల్ గగన్ దీప్ బక్షి ఇటీవల ఓ ఆంగ్ల మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలను వెల్లడించారు. కాగా, భారత్ నుంచి ఎలాంటి ముప్పు ఎదురవుతుందో అనే ఆందోళనలో ఉన్న పాకిస్థాన్ దాదాపు మూడేళ్లుగా ఖాళీగా ఉన్న జాతీయ భద్రత సలహాదారు(ఎన్ఎస్ఏ) పోస్టును భర్తీ చేసింది. ప్రస్తుత ఐఎస్ఐ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ముహమ్మద్ అసిమ్ మాలిక్‌ను పాక్ జాతీయ భద్రత సలహాదారు(ఎన్ఎస్ఏ)గా నియమించింది.

'ఎలక్ట్రానిక్ వార్'కూ సిద్ధం

భారత్ ఏక్షణమైనా దాడి చేయవచ్చనే ఆందోళనతో పాకిస్థాన్ తన రాడార్ నిఘా వ్యవస్థలు, సిగ్నల్ జామర్లతో కూడిన ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలను నియంత్రణ రేఖ సమీపంలోకి తరలిస్తోంది. అందులో చైనా తయారీ టీపీఎస్-77 రాడార్ వ్యవస్థలు ఉన్నాయి. అవి సుమారు 463 కిలోమీటర్ల దూరం, 30.5 కిలోమీటర్ల ఎత్తు వరకు గగనతలంపై నిఘా పెట్టగలవని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. అదే చైనా తయారీ డీడబ్ల్యూఎల్-002 ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ (ఈడబ్ల్యూ) వ్యవస్థ.. శత్రుదేశాల రాడార్లు, జీఎన్ఎస్ఎస్ (గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం) సిగ్నళ్లను జామ్ చేయగలదని వివరిస్తున్నారు. కానీ.. మన దేశం వద్ద అంతకన్నా అత్యాధునిక సంయుక్త, హిమశక్తి వంటి వ్యవస్థలు ఉన్నట్టు చెబుతున్నారు.

కశ్మీర్‌లోనే పహల్గాం ఉగ్రవాదులు!

» దట్టమైన అటవీ ప్రాంతంలో దాక్కున్నట్లు ఎన్ఐఏ వెల్లడి

న్యూఢిల్లీ/శ్రీనగర్, మే 1: పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల ఆచూకీ కోసం భద్రత దళాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. అణువణువూ శోధిస్తున్నాయి. అయితే ఆ ఉగ్రవాదులు ఇంకా దేశం విడిచి పారిపోలేదని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తాజాగా వెల్లడించింది. వీరంతా దక్షిణ కశ్మీర్‌లోని దట్టమైన అడవుల్లో దాక్కున్నట్లు ఆ వర్గాల ద్వారా తెలిసింది. దాడి జరిపిన తర్వాత ఎవరిపై ఆధారపడొద్దని ఆహారం, ఇతరత్రా సామగ్రి తీసుకొని పక్కా ప్లాన్‌తో అటవీ ప్రాంతంలోకి పారిపోయారని సమాచారం. ఆయా ప్రాంతాల్లో మరికొంత మంది ఉగ్రవాదులు ఉండే అవకాశం లేకపోలేదని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇక ప్రాథమిక దర్యాప్తు మేరకు.. దాడికి 48 గంటల ముందే నలుగురు ఉగ్రవాదులు బైసరన్ లోయకు చేరుకున్నారు. అరు, బేతాబ్ లోయలతో సహా మరో నాలుగు ప్రాంతాల్లో ఉగ్రవాదులు తొలుత రెక్కీ నిర్వహించి స్థానికులను కలిసి ఆరా తీశారని దాడి తర్వాత ఎన్ఐఏ విచారణలో తేలింది. ఈ నేపథ్యంలోనే ఉగ్రవాదులు భద్రత తక్కువగా ఉండే బైసరన్‌ను ఎంచుకున్నట్లు సమాచారం. ఉగ్రవాదుల వద్ద అధునాతన సమాచార పరికరాలున్నాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. వారు వాడిన పరికరాల్లో సిమ్‌లు ఉండవని.. ఇతరులు గుర్తించకుండా చిన్నపాటి ఎన్‌క్రిప్టెడ్ సందేశాలు పంపవచ్చని చెబుతున్నాయి. దాడి ప్రారంభమయ్యే (మధ్యాహ్నం 1.15 గంటల) వరకు భద్రతా దళాలు గుర్తించకుండా ఉగ్రవాదులు 3 శాటిలైట్ ఫోన్లు ఉపయోగించారని తెలిసింది.

ఆర్మీ చీఫ్‌తో ప్రధాని మోదీ భేటీ

ప్రధాని మోదీ బుధవారం ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదితో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ ఇందులో పాల్గొన్నారు.

పాక్ నుంచి తిరిగొచ్చిన బెజవాడ కోడలు!

» అటారీ సరిహద్దుకు చేరుకున్న మోనికా రజని

» పుట్టినింటి వారిని చూడటానికి పాకిస్థాన్‌కు

» పహల్గాం ఉగ్రదాడితో తిరిగి భారత్‌కు రాక

» భర్త పవన్ రబ్బర్ ఇండస్ట్రీస్ అధినేత

» గురునానక్ కాలనీలో కుటుంబం నివాసం

విజయవాడ(వన్‌టౌన్), మే 1(ఆంధ్రజ్యోతి): బెజవాడ యువకుడిని వివాహం చేసుకున్న పాకిస్థాన్ యువతి మోనికా రజని(35) తిరిగి భారత్ చేరుకున్నారు. కొద్దిరోజుల క్రితం తన పుట్టినింటి వారిని చూడటానికి ఆమె పాక్‌కు వెళ్లారు. పెహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ పౌరులు దేశం విడిచి వెళ్లాలని కేంద్రం ఆదేశించింది. అదేవిధంగా పాక్ ప్రభుత్వం సైతం భారతీయులను తమ దేశం నుంచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో మోనికా రజని వద్ద ఎన్‌వోఆర్‌ఐ సర్టిఫికెట్, దీర్ఘకాలిక వీసా ఉండటంతో తన కుమార్తె సైమరా(5)తో పాటు పాకిస్థాన్ నుంచి బయలుదేరి గురువారం అటారీ సరిహద్దుకు చేరుకున్నారు. మోనికా రజని తొమ్మిదేళ్ల క్రితం విజయవాడకు చెందిన పవన్‌ను వివాహం చేసుకున్నారు. వీరి కుటుంబం స్థానిక గురునానక్ కాలనీలో నివసిస్తోంది. భర్త ఆటోనగర్‌లో రబ్బర్ ఇండస్ట్రీ నిర్వహిస్తుంటారు. మోనికా రజని భారత్‌కు తిరిగి వస్తుండటంతో ఆమె భర్త, కుటుంబీకులు అంతా అమృత్‌సర్ వెళ్లారు. అటారీ సరిహద్దు వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టు (ఐసీపీ) వద్దకు చేరుకున్నానని, ఇక్కడ కస్టమ్స్, ఇమిగ్రేషన్ క్లియరెన్స్ కోసం దాదాపు 3గంటలు పట్టిందని తెలిపారు. విజయవాడకు వెళ్లేముందు తాను, కుటుంబ సభ్యులు స్వర్ణ దేవాలయాన్ని సందర్శిస్తామని పేర్కొన్నారు. తాను కూడా పాకిస్థాన్‌లో హిందూ కుటుంబంలోనే జన్మించానని, తమది పెద్దలు కుదిర్చిన వివాహమని వివరించారు. వారి కుటుంబం విజయవాడ వస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది.

భారత యువతికి.. పాక్ పౌరసత్వం

కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలోని సనత్‌నగర్‌కు చెందిన మహిళ పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్నారు. అక్కడే కొంతకాలం ఉన్న తర్వాత భర్తతో విభేదాలు రావడంతో విడాకులు తీసుకుని తిరిగి తన స్వస్థలానికి తిరిగొచ్చారు. అనంతరం వేరే వ్యక్తిని వివాహం చేసుకుని ఇక్కడే ఉంటున్నారు. పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన ఆమె దీర్ఘకాలిక వీసాపై ఇక్కడ ఉంటున్నారు. ఆమె ఇక్కడ ఉండేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని పోలీసు వర్గాలు నిర్ధారించాయి. ఆమెకు సంబంధించిన పత్రాలు అన్నీ సమర్పించాలని పోలీసులు సూచించారు.

70 మందికి పైగా పాక్ మహిళలు భారత్‌కు

చండీగఢ్, మే 1: భారతీయులను వివాహం చేసుకున్న 70మందికి పైగా పాకిస్థానీ మహిళలు అటారీ సరిహద్దు మీదుగా భారత్‌కు చేరుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థానీయులకు జారీ చేసిన అన్ని వీసాలను కేంద్రం రద్దు చేసింది. తమ తల్లిదండ్రులను కలుసుకోవడానికి పాక్ వెళ్లిన మహిళలను సరైన పత్రాలు ఉన్నప్పటికీ అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు భారత్‌కు తిరిగి రాకుండా అడ్డుకున్నారు. అయితే చర్చల అనంతరం పాకిస్థాన్ పాస్‌పోర్టుతో పాటు ఎన్‌వోఆర్‌ఐ (నో అబ్జెక్షన్ టు రిటర్న్ టు ఇండియా) సర్టిఫికెట్, దీర్ఘకాలిక వీసా (ఎల్‌టీవీ) ఉండి, భారతీయులను వివాహం చేసుకున్నవారికి తిరిగి వెళ్లడానికి మినహాయింపు ఇచ్చారు. దీంతో 70మందికి పైగా ఎన్‌వోఆర్‌ఐ వీసాదారులతో సహా మొత్తం 240 మంది గురువారం భారత్‌లోకి ప్రవేశించారు. మరోవైపు భారత్ నుంచి 140 మంది అటారీ సరిహద్దు మీదుగా పాక్‌కు వెళ్లిపోయారు. కాగా, స్వల్పకాలిక పర్యటనల కోసం పాకిస్థాన్‌కు వెళ్లేవారికి విదేశీ వ్యవహారాల శాఖ ఎన్‌వోఆర్‌ఐ సర్టిఫికెట్లు జారీ చేస్తుంది. ఇవి ఉన్నవారిని ఎలాంటి ఆంక్షలు లేకుండా భారత్‌కు తిరిగి రావడానికి అనుమతిస్తారు.

జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా అనుసంధానం

» ఈసీ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, మే 1: జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయబోతున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. తద్వారా ఓటరు జాబితాను కచ్చితత్వంతో నవీకరించడంతో పాటు ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత పెంచడానికి వీలవుతుందని పేర్కొంది. ఇందుకోసం మరణాలకు సంబంధించిన సమాచారాన్ని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) నుంచి ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు పొందుతామని తెలిపింది. మరణించిన వారి కుటుంబాల నుంచి సమాచారం వచ్చే వరకు వేచిచూడకుండా.. ఆర్‌జీఐ నుంచి సమాచారం వచ్చిన వెంటనే బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించుకుంటారని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే ఓటరు సమాచార చీటీ (వీఐఎస్) ఓటర్లకు మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా అందులోని వివరాలను పెద్ద అక్షరాలతో ఉండేలా రూపొందించాలని ఈసీ నిర్ణయించింది. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని తేలికగా గుర్తించడంతో పాటు పోలింగ్ అధికారులు కూడా జాబితాలోని పేర్లను సులభంగా చూసుకునేందుకు సౌకర్యంగా ఉంటుందని తెలిపింది. దీంతో పాటు బూత్ స్థాయి అధికారులకు ఫొటో ఐడీ కార్డు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు

న్యూఢిల్లీ, మే 1: వాణిజ్య అవసరాలకు వినియోగించే 19.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరను అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ రంగ ముడి చమురు సంస్థలు తగ్గించాయి. హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే వాణిజ్య సిలిండర్ ధర రూ.14.50 తగ్గిస్తూ గురువారం నోటిఫికేషన్ జారీచేశాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో వంటగ్యాస్ సిలిండర్ రూ.1,741లకు లభిస్తుంది. ఏప్రిల్ ఒకటో తేదీన రూ.41 తగ్గించిన తర్వాత మళ్లీ వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గించడం ఇదే ప్రథమం. ఇక విమానాల్లో వినియోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) కిలో లీటర్‌పై 4.4% అంటే రూ.3,954.38 ధర తగ్గించాయి.

నీట్‌పై తప్పుడు ప్రచార చానెళ్లను గుర్తించాం: ఎన్‌టీఏ

న్యూఢిల్లీ, మే 1: ఎంబీబీఎస్, బీడీఎస్ సహా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 4న నిర్వహించే నీట్-యూజీ పరీక్షాపత్రం లీకైందంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్న సోషల్‌మీడియా చానెళ్లను గుర్తించామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా 106 టెలిగ్రామ్, 16 ఇన్‌స్టాగ్రామ్ చానెళ్లు తప్పుడు ప్రచారంచేస్తున్నట్లు ఆ వర్గాల కథనం. ఈ తప్పుడు ప్రచారం ఆటకట్టించేందుకు ఎన్‌టీఏ ఏర్పాటుచేసిన ప్రత్యేక పోర్టల్‌కు 1500కి పైగా ఫిర్యాదులు వచ్చాయి. దీంతో నీట్-యూజీ 2025 సమగ్రతను కాపాడేందుకు సదరు మోసపూరిత సోషల్‌మీడియా చానెళ్లపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైన ఎన్‌టీఏ.. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్‌కు ఫిర్యాదుచేసినట్లు సమాచారం.

కులగణనపై కిం కర్తవ్యం?

కేంద్రం నిర్ణయంతో కాంగ్రెస్ డైలమా.. నేడు వర్కింగ్ కమిటీ భేటీ



మల్లికార్జున ఖర్గే

» హెడ్‌లైన్ సరే.. టైమ్‌లైన్ ఏదీ?

» పక్కదోవ పట్టించే ఎత్తుగడ: జైరాం

» 515 కోట్లతో కుల గణన సాధ్యమా?

» రిజర్వేషన్లు 68% ఉండాలి: ఖర్గే

న్యూఢిల్లీ/బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ కులగణన డిమాండ్‌తో మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడిన కాంగ్రెస్.. ఇప్పుడు అయోమయంలో పడింది. జనాభా లెక్కల సేకరణతోపాటే కులగణన కూడా జరపాలని మోదీ క్యాబినెట్ ఆకస్మికంగా తీసుకున్న నిర్ణయం ఆ పార్టీని విస్మయానికి గురిచేసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కులగణననే ప్రధాన ప్రచారాస్త్రంగా మార్చుకున్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గ నిర్ణయంతో అది బీజేపీ చేతికి వెళ్లిందన్న ఆందోళన ఆ పార్టీ నేతల్లో నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఈ అంశంపై తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు ఆ పార్టీ అత్యున్నత నిర్ణాయక విభాగమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శుక్రవారం ఢిల్లీలో భేటీకానుంది. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం మీడియాతో మాట్లాడారు. వర్కింగ్ కమిటీ కులగణన, పహల్గాం ఉగ్రదాడిపై విస్తృతంగా చర్చిస్తుందన్నారు. కులగణనను ఆమోదిస్తూ ప్రభుత్వం 'హెడ్‌లైన్' ఇచ్చిందని.. కానీ దాని అమలుకు డెడ్‌లైన్ ఎక్కడని ప్రశ్నించారు. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై గట్టి చర్య తీసుకోవాలన్న డిమాండ్ల నేపథ్యంలో కులగణనపై నిర్ణయం పక్కదోవ పట్టించే ఎత్తుగడగా అభివర్ణించారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని రద్దుచేస్తూ నిర్ణయం తీసుకోకుండా ఎవరు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. ఇందుకోసం పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆ నిధులు ఏ మూలకు: ఖర్గే

దేశవ్యాప్తంగా కులగణన సర్వే జరిపేందుకు రూ.575 కోట్లు సరిపోతాయా అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రాన్ని ప్రశ్నించారు. గురువారం బెంగళూరు, హుబ్బళిలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. 'కర్ణాటకలో కులగణనకు పదేళ్ల కిందట రూ.168 కోట్లు ఖర్చు చేశారు. అలాంటిది దేశవ్యాప్తంగా దీనికి రూ.575 కోట్లే కేటాయించడం ఏమిటి? ఇది ఉత్తరప్రదేశ్‌లో సర్వేకు కూడా సరిపోదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ప్రగతి పట్ల ప్రధానికి నిజంగా ఆసక్తి ఉంటే రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయాలి. కోటా ఇప్పటికే 50 శాతానికి మించిపోయింది. ముందుగా ఆ 50% పరిమితిని తొలగించాలి. 67-68 శాతానికి పెంచాలి. తమిళనాడులో కూడా 68% రిజర్వేషన్ అమలవుతోంది' అని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు లభించేలా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా చర్యలు తీసుకుందని.. దానిని కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వారిని అమరులుగా గుర్తించాలి: రాహుల్

పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో చనిపోయినవారికి అమరవీరుల హోదా ఇవ్వాలని రాహుల్‌గాంధీ ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. వారి కుటుంబ సభ్యులకు వెన్నంటి ఉంటానని.. తమవారిని అమరవీరులుగా గుర్తించాలన్న వారి డిమాండ్‌కు మద్దతిస్తున్నానని, వారి మనోభావాలను గౌరవించాలని కోరుతున్నానని గురువారం 'ఎక్స్'లో తెలిపారు.

అమృత్‌సర్‌లో ఉగ్ర కుట్ర భగ్నం!

» భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్న బలగాలు

న్యూఢిల్లీ, మే 1: భారత్-పాక్ సరిహద్దుల్లో మరో ఉగ్ర కుట్ర భగ్నమైంది. అమృత్‌సర్ జిల్లాలోని భరోపాల్ గ్రామం సమీపంలో ఉగ్ర కుట్రను సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) భగ్నం చేసింది. భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుంది. బీఎస్ఎఫ్ ఇంటెలిజెన్స్ విభాగం అందించిన విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం సాయంత్రం పంజాబ్ పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు 2 హ్యాండ్ గ్రనేడ్లు, 3 పిస్టళ్లు, 6 మ్యాగజీన్లు, 50 రౌండ్ల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకొని దర్యాప్తు నిమిత్తం వాటిని స్థానిక పోలీసులకు అప్పగించారు.

ఆగని పాక్ కవ్వింపు చర్యలు

పహల్గాం ఉగ్రదాడి అనంతరం సరిహద్దుల్లో పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. నియంత్రణ రేఖ వెంబడి భారత పోస్టులను లక్ష్యంగా చేసుకొని పాక్ సైన్యం జరిపిన కాల్పు లు వరుసగా ఏడోరోజు గురువారం రాత్రి కూడా కొనసాగాయి. 'ఏప్రిల్ 30-మే 1 అర్ధరాత్రి వేళ జమ్ము కశ్మీర్‌లోని కుప్వారా, ఊరీ, అఖ్నూర్ ప్రాంతాల్లో నియంత్రణ రేఖ వెంబడి పాక్ దళాలు కాల్పులకు తెగబడ్డాయి. చిన్నపాటి ఆయుధాలతో పాక్ బలగాలు జరిపిన కాల్పులకు భారత సైన్యం దీటుగా బదులిచ్చింది' అని రక్షణ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఇరు దేశాలకు చెందిన మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్లు గత మంగళవారం హాట్‌లైన్‌లో మాట్లాడుకున్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాక్ సైన్యం కాల్పులకు పాల్పడుతున్న విషయాన్ని ప్రస్తావించిన భారత్.. దాయాది దేశానికి గట్టి హెచ్చరికలు జారీ చేసింది.


అరేబియా సముద్రంలో గస్తీ ముమ్మరం

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో అరేబియా సముద్రంలో భారత నావికా దళం గస్తీని ముమ్మరం చేసింది. సముద్ర భద్రతను బలోపేతం చేసే దిశగా యుద్ధ నౌకలను మోహరించడంతో పాటు యాంటీ-షిప్, యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ మిసైళ్ల ప్ర యోగాలను విజయవంతంగా నిర్వహించినట్లు నేవీ వర్గాలు ధ్రువీకరించాయి. గుజరాత్ తీరంలోని అంతర్జాతీయ సముద్ర సరిహద్దు సమీపంలో భారత కోస్ట్ గార్డ్ సైతం నౌకలను మోహరించింది.

భారత్‌కు ఆత్మరక్షణ హక్కు : అమెరికా

» రాజ్‌నాథ్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడిన అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సేత్

న్యూఢిల్లీ, మే 1: భారత్‌కు తనని తాను రక్షించుకునే హక్కు ఉందని, ఈ విషయంలో భారత్‌కు తమ మద్దతు ఉంటుందని అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సేత్ పేర్కొన్నారు. అలాగే, ఉగ్రవాదంపై చేసే పోరులోనూ భారత్‌కు తమ అండ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో గురువారం ఫోన్‌లో మాట్లాడిన పీట్.. పెహల్గాం ఉగ్రదాడి ఘటనపై విచారం వ్యక్తం చేశారు. పెహల్గాం ఘటనతో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తుందనే విషయం రుజువైందని రాజ్‌నాథ్ ఈ సందర్భంగా పీట్‌తో అన్నారు. ఈ మేరకు వారి మధ్య జరిగిన సంభాషణపై కేంద్ర రక్షణ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. మరోపక్క, ఉగ్రవాదంపై చేసే పోరులో భారత్‌కు సహకరించేందుకు కట్టుబడి ఉన్నామని అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రుబియో భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో అన్నారు. ఈ మేరకు రుబియో తనతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారని, పెహల్గాం ఘటనపై విచారం వ్యక్తం చేశారని జైశంకర్ గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. మరోవైపు.. పెహల్గాం దాడి నేపథ్యంలో భారత్ దౌత్యపరంగా వివిధ దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తాత్కాలిక సభ్య దేశాల్లో ఎనిమిదింటితో విదేశీ వ్యవహారాల శాఖ మాట్లాడింది. ఈ క్రమంలో విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్.. దక్షిణ కొరియా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి చోటేయుల్‌తో గురువారం ఫోన్‌లో మాట్లాడారు.


అతిరథ మహారథులకు
స్వాగతం – సుస్వాగతం
Amaravati
భారతదేశ అభివృద్ధి కొరకు
అహర్నిశలు కృషి చేస్తున్న భారత ప్రధాని
శ్రీ నరేంద్ర మోది గారు
ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి ప్రదాత, నవ్యాంధ్ర సృష్టికర్త
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
నేడు దేవభూమి నవ్యాంధ్ర రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి
మరియు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి
విచ్చేయుచున్న సందర్భంగా వారికి
స్వాగతం - సుస్వాగతం
With Best Compliments from
INDOSOL™
Indosol Solar Pvt Ltd.
A Subsidiary of
Shirdi Sai Electricals Ltd.
Corporate Office : Galaxy by Auro Realty, 16th Floor, A-Wing, Opposite IKEA, Raidurgam,
Hyderabad, Telangana, India - 500081. www.indosolsolar.com

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నవభావవతి.. అమరావతి!!

మహాకవులు జన సంక్షేమం కోసం సార్వకాలీన సంస్కారాలు ప్రబోధిస్తారు. సంఘర్షణలను ఎదుర్కొనే ధీశక్తి నిస్తారు. భావి లక్ష్యాలను నిర్దేశిస్తారు. మహాసంకల్పాలకు సంసిద్ధులను చేస్తారు. కాలం ఏదైనా అటువంటి సంస్కారాలు, ధీశక్తులు, లక్ష్యాలు, మహాసంకల్పాల అవసరం ఎప్పుడూ ఉంటుంది. వాటిని పసిగట్టి, అవాహన చేసుకుని, సమేకమై ప్రజలు ముందుకు నడిచినప్పుడు ఆధునిక ప్రజాస్వామ్యం పరిపక్వతను పొందుతుంది. అసాధ్యాలను సుసాధ్యం చేస్తుంది. అద్భుతాల సృష్టికి కేంద్రం అవుతుంది. ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా అమరావతి పనులు పునః ప్రారంభమయ్యే నేటి శుభవేళ జనావళి అటువంటి పరిపక్వత దిశగా అడుగులేస్తేనే ఆంధ్ర ప్రగతిరథం పరుగులు పెడుతుంది.

అమరావతి ఒక రాజధాని నగరం మాత్రమే కాదు.. అదొక భావన.. జాతి పునర్నిర్మాణ పరికల్పన.. నవ నిర్మాణానికి ప్రేరణ.. రూపుకట్టే భవితను తలచుకుని పొంగుకొచ్చే అనుభూతి.. సమష్టి శ్రేయోసాధనకు ఆలంబన.. అంటూ ఎన్నో విశేషణాలతో ఆంధ్ర ఆలోచనాపరులు తాదాత్మ్యం చెందొచ్చు. ఇవన్నీ సాధారణ జనబాహుళ్యంలో ఎంత త్వరగా ఉదయిస్తే అంత త్వరగా అమరావతి ఆంధ్రావళికి జయగీతి అవుతుంది. అద్భుతమైన వాస్తుకళ ఉట్టిపడే ఆకాశ భవనాలు కట్టుకుంటే సరిపోదు. సంపద సృష్టికి, మేధో ఉత్కృష్టతకు కొత్త భావాలకు వేదికగా అమరావతి వెలుగొందాలి. మధ్యయుగాల నావికులు తమ సాహసోపేత సముద్ర యాత్రలతో కొత్త ఖండాలు, పురాతన దేశాలను కనుగొన్నట్టే సమష్టి సంక్షేమాల కోసం అమరావతి కేంద్రంగా అన్వేషణలు జరగాలి. 'అభివృద్ధి చెందిన దేశాలు కష్టపడి ఏళ్ల తరబడి చేసిన దీర్ఘయాత్రని అభివృద్ధి చెందే దేశాలు ఒక మహాముందడుగులో అందిపుచ్చుకోవాలని' విక్రమ్ సారాభాయి అన్న మాటలు ప్రేరణగా తీసుకుంటేనే అమరావతి అభివృద్ధి నిజంగానే ఊపందుకుంటుంది.

తొలుత కర్నూలులో మజిలీ చేసి, అనంతరం భాగ్యనగరం నుంచి కదలి, తుదకు అమరావతికి చేరిన ఆంధ్ర రాజధాని కోసం సంకల్పాలు ఘనంగా చెప్పుకున్నా, నిర్మాణ పథకాలను పటిష్ఠంగా రూపొందించుకున్నా భవిష్యత్తు గండాలు లేకుండా చూసుకోవటం ప్రాణావసరం. రాజకీయ కక్షలకూ, స్వార్థాలకూ అయిదేళ్లపాటు అమరావతి మూగసాక్షిగా నిలిచిపోయింది. నవ్యాంధ్ర ఆశలు, సంకల్పాలే పునాదులై లేచిన మహానిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. రాజధాని లేని రాష్ట్రంగా కొనసాగిన చరిత్ర నవభారతంలో ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే దక్కింది. భాషాప్రయుక్త రాష్ట్రాలకు ఊపిరులు ఊది దేశంలో బలమైన సమాఖ్య వ్యవస్థ ఏర్పడటానికి కారణమైన ఆంధ్రకు ఆ దుస్థితి ఏర్పడుతుందని ఎవరూ ఊహించలేదు. ఒకటో రెండో విధానాలపై విబేధాలుంటే వాటిని ఉపసంహరించుకోవటమో, సంస్కరించటమో చాలా రాష్ట్రాల్లో జరిగింది. కానీ అందరి ఆమోదంతో ఏర్పాటైన రాజధానిని మూడుచోట్లకు మూడు ముక్కలుగా విసిరివేయటానికి అయిదేళ్లపాటు అహర్నిశలూ పథకాలు రచించటం ఆంధ్రలో మాత్రమే జరిగిన వైపరీత్యం! దీన్ని ఎదుర్కోటానికి భూములు ఇచ్చిన రైతులు కనీవినీ ఎరగని రీతిలో ఆందోళనలు చేపట్టాల్సి రావటమూ ఎక్కడా జరగలేదు. రాష్ట్ర రాజధాని కోసం స్వచ్ఛందంగా భూములు ఇవ్వటానికి రైతులు ముందుకు రావటమే దేశచరిత్రలోనే ఒక అద్వితీయ సంఘటన అనుకుంటే దానికీ ఎన్నో దుష్ట లక్ష్యాలను, ప్రేరణలను అంటగట్టటం ఆంధ్రలోనే జరిగింది. అమరావతికి ఎదురైన రాజకీయ విఘ్నాలు కళ్లముందు మెదలుతున్నా నగర విస్తరణ కోసం అవసరమైన మరిన్ని భూములు ఇవ్వటానికి రైతులు మళ్ళీ సంసిద్ధత వ్యక్తంచేయటం గొప్పగానే భావించాలి. ఎకరం భూమి వదులుకోటానికీ రైతులు ముందుకురాని పరిస్థితే దేశంలో చాలా చోట్ల ఉంది. అమరావతికి ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైతే ఎక్కడాలేని సానుకూలత ఇక్కడ ఉందనే చెప్పుకోవచ్చు. కాకపోతే భవిష్యత్తులో రాజధానిని అమరావతి నుంచి మార్చలేని విధంగా పార్లమెంటులో చట్టంచేయాలనే ప్రతిపాదన వచ్చింది. దానికి సాధ్యాసాధ్యాలు రాజ్యాంగబద్ధంగా ఉంటాయో లేవో కూడా స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉంది. గతంలోని చేదు అనుభవాలు అటువంటి డిమాండ్లు తలెత్తేలా చేస్తున్నాయి.

దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాత పెట్టుబడులను ఆకర్షించటానికి ఏ రాష్ట్రం అవకాశాలను ఒకపట్టాన వదులుకోలేదు. పెట్టుబడులు ఇతరచోట్లకు పోకుండా రాష్ట్రాలు శతవిధాలుగా ప్రయత్నించాయి. ఏదో ఒకచోట ప్రాథమిక సౌకర్యాలను పటిష్ఠంగా ఏర్పాటుచేసి అక్కడికి పెట్టుబడులు తరలివచ్చేలా చేశాయి. అమరావతిలో మాత్రమే గడిచిన అయిదేళ్లలో ఆ ప్రక్రియకు గండికొట్టేలా వ్యవహారాలు జరిగాయి. పెట్టుబడులు పెట్టేవారు విధానాల్లో కొనసాగింపును కోరుకుంటారు. ఫలానాచోట రాజధాని ప్రాంతమనో, పారిశ్రామిక ప్రాంతమనో ఇచ్చిన హామీలను దృష్టిలో ఉంచుకునే పెట్టుబడులు పెట్టటానికి సంసిద్ధులు అవుతారు. అందుకే అమరావతి విషయంలో భవిష్యత్తులో మళ్లీ వెనకడుగులు పడకుండా చూడటమే పెద్ద సవాల్. జనబలంతోనే ఆ వెనుకడుగుల ప్రమాదం లేకుండా చూసుకోవచ్చు. అమరావతి అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా విధానాలు రూపొందించితే జన బలం వెన్నంటే ఉంటుంది. అదే అమరావతికి శ్రీరామరక్ష!

ఆవేదనలోనూ మతం ఉన్నదా?

ఈ దుఃఖ సమయంలో మోహన్ దాస్ కరంచంద్ గాంధీ జీవించి ఉంటే ఏమి చేసి ఉండేవారు? కలకత్తా, నౌఖాలిలో ఛిద్రమైన మానవతను చిగురింపజేసినట్లుగానే ఆయన ఇప్పుడు కూడా కచ్చితంగా పహల్గాంకు వెళ్లి, ఉగ్రవాద బీభత్స బాధితుల కుటుంబ సభ్యులను, ఆ ఘాతుకం నుంచి ఎలాగో బయటపడ్డ వారిని పరామర్శించేవారు. వారితో కలిసి ప్రార్థనలు చేసేవారు. వేద మంత్రాలు పఠించాలని, భక్తి గీతాలు గానం చేయాలని, ఖురాన్ ప్రవచనాలు చదవాలని పట్టుబట్టి ఉండేవారు.. పహల్గాంలోనే ఉండిపోయి వీధులలోను, కొండవాలుల్లోను సంచరిస్తూ ప్రతి గృహానికి, ప్రతి దుకాణానికి వెళ్లి గృహస్తులు, దుకాణదారులు, పట్టణవాసులు చెప్పేది సావధానంగా వినేవారు.

వారి చేతులను ఆత్మీయంగా తన చేతుల్లోకి తీసుకునేవారు. అంతులేని వ్యాకులత, వీడని భీతిలో ఉన్న వారు తమ పనులు తాము చేసుకునేందుకు సహాయపడేవారు. 'అంతరంగం అట్టడుగున అంతమందిమీ మానవులమే కదా', వేదనకు సామాజిక అంతరాలు ఉండవని, జీవన వ్యాపకాలు కొనసాగేందుకు ఒకరికొకరు తోడ్పడుకుంటూ సమష్టిగా ముందుకు సాగాలని గాంధీ చెప్పి ఉండేవారు. గాంధీ ప్రేమానురాగాలు నిర్నీకమైనవి. సామాజిక విధుల పాటింపును ఆయన పట్టించుకునేవారు కాదు. సమాజ నిర్దేశాలు మానవతా మమతలు పంచేందుకు ఆటంకాలు అని ఆయన భావించేవారు. మనిషి శ్రేయస్సు పట్ల ఎటువంటి సంకుచితత్వాలు లేని ఈ ఆరాటమే, గాంధీతో విభేదించేవారితో సహా ఎంతో మంది, ఆయనను మహాత్ముడుగా గౌరవించేలా చేసింది. ఒక మతోన్మాది కాల్పులకు ఆయన బలై 77 సంవత్సరాలు గడిచిపోయాయి. పహల్గాం సృష్టించిన ఈ దురవస్థలో నా ఆలోచనలు ఆయన వైపుకు మళ్లాయి. ఆ మహనీయ మానవతా స్ఫూర్తిని ఆవాహన చేసుకోవాలి కదా.

ఉగ్రవాద దాడుల్లో చనిపోయిన వ్యక్తుల మత నేపథ్యం గురించి నేను సాధారణంగా ప్రస్తావించను. కుల మతాలు, మరేయితర సామాజిక అంతరాలకు అతీతంగా ప్రతి మనిషి జీవితమూ చాలా విలువైనది. మానవత అఖండమైనది. ప్రతి సామాన్యుడి జీవితమూ దానిలో ఒక అంతర్భాగం. ఉగ్రవాద ఘాతుకంలో, ఏ మతం వాడైనా లేదా నాస్తికుడు అయినా ఒక వ్యక్తి జీవితం ఛిద్రమైపోవడం మన మనసును గాయపరుస్తుంది, మన ఆత్మను చీల్చివేస్తుంది. మనలను ఒక నిస్సహాయత ఆవహించేలా చేస్తుంది. ఏమి చేయాలి? ఏమి చేయాలో తెలియని పరిస్థితిలోకి మనలను నెట్టివేస్తుంది. దురాగతానికి పాల్పడినవారు తాము నిర్దిష్టంగా ఎవరిని లక్ష్యంగా చేసుకున్నది సందేహాతీతంగా చెప్పినప్పటికీ మన దుఃఖాలు, ఆవేదనలకు హత్యకు గురైన వారి సామాజిక– మత అస్తిత్వాలు కారణాలు కాకూడదు. బాధితుల సామాజిక, మత నేపథ్యాలను బట్టి మన ఆవేదనలు ఉండకూడదు. ఇది అరిగిపోయిన మాటే అయినప్పటికీ నేను మళ్లీ మళ్లీ చెప్తుతాను. ఉగ్రవాదులకు మతం లేదు. ఉగ్రవాదమే వారి మతం. తమది ఫలానా మతం అని వారు చెప్పవచ్చు. ఆ మతాన్ని తమ చర్యకు ఉపయోగించుకుని ఉండవచ్చు. అయితే అలా చేసే హక్కు వారికి లేదు. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు అవసరమైన చర్యలను ఏ ప్రభుత్వమైనా చేపట్టి తీరాలి. హింసాకాండ, జాతి విద్వేషం, మత మౌఢ్యాన్ని తిరస్కరించిన మనుషులుగా ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు మనమూ పూనుకోవాలి. పౌర సమాజ సభ్యులుగా అది మన కర్తవ్యం.



కుల మతాలు, ఇతర సామాజిక అంతరాలకు అతీతంగా ప్రతి మనిషి జీవితమూ చాలా విలువైనది. ఉగ్రవాద ఘాతుకంలో, ఏ మతంవాడైనా, నాస్తికుడు అయినా ఒక వ్యక్తి జీవితం ఛిద్రమైపోవడం మన మనసును గాయపరుస్తుంది, మన ఆత్మను చీల్చివేస్తుంది. మనలను ఒక నిస్సహాయత ఆవహించేలా చేస్తుంది. దురాగతానికి పాల్పడినవారు తాము నిర్దిష్టంగా ఎవరిని లక్ష్యంగా చేసుకున్నది చెప్పినప్పటికీ మన దుఃఖాలు, ఆవేదనలకు హత్యకు గురైన వారి సామాజిక– మత అస్తిత్వాలు కారణాలు కాకూడదు.

అయితే నేడు బాధితుల మత అస్తిత్వం గురించి ప్రస్తావించకుండా ఉగ్రవాద దురాగతాల గురించి మాటా మంతీ జరపలేకపోతున్నాం. అలా చేయడంలో మనం ఒక సామాజిక బృందం పట్ల మన అపేక్షను వ్యక్తం చేస్తున్నాం. మరో వర్గం ప్రజల పట్ల వేలెత్తి చూపుతున్నాం. లేదా ఈ రెండిటి మధ్య ఒక సమతౌల్యతను పాటిస్తున్నాం. ఈ మూడు రకాల వైఖరులను మనం జాగరూకతతో ప్రదర్శిస్తున్నాం. ఈ బలవంతానికి ఆవలివైపు కొన్ని ఆశలు ఉన్నాయి. ప్రతి ఖండన మూల్యాంకనమవుతుంది. ఉగ్ర చర్యను ఖండించిన వ్యక్తి బాధితుడి సామాజికవర్గానికి చెందినవాడైతే బాధను వ్యక్తం చేయడంతో సరిపోతుంది. అయితే ఉగ్ర ఘాతుకానికి పాల్పడిన మతానికి చెందినవాడైతే ఆ ఖండన హెచ్చుస్థాయిలో ఉండాలని ఆశిస్తారు. ప్రతిస్పందన అంతకంటే ఏ మాత్రం తక్కువగా ఉన్నా ఆ వ్యక్తి మీద ఆరోపణలు వెల్లువెత్తుతాయి, వెలివేతకు దారితీస్తుంది. జనం ఇలా ఒక ఉచ్చులో చిక్కుకొని, తాము ఎటున్నాము, మిగతావారు తమను ఎలా చూస్తున్నారన్న సంశయంలో ఇరుక్కుంటారు. ఇలా ఆచితూచి స్పందించాల్సిన పరిస్థితికి లోనైనప్పుడు దుఃఖం అనేది కేవలం ఒక బాహ్య వ్యక్తీకరణగా, ఒక ముసుగు లాగా మిగిలిపోతుంది.

దుఃఖం ఒక శక్తిమంతమైన మానవానుభవం. మనలను సృజనాత్మక జీవులుగా పరివర్తన చెందించే శక్తి దానికి ఉన్నది. దుఃఖ సమయంలో సామాజిక చిరునామాలు అదృశ్యమవుతాయి, విభేదాలు, వ్యత్యాసాలు క్షయిస్తాయి. ఆనందం సైతం ఏకం చేయలేని విధంగా దుఃఖం మనుషులను సమైక్యపరుస్తుంది. సంతోష సంబరాల నుంచి మనం తేలిగ్గా వెనక్కి వెళ్లిపోగలం. అయితే బాధతో రోదించినప్పుడు, కుంగిపోయినప్పుడు మన చెంతనే ఎవరూ ఉన్నా వారిని చుట్టుకుపోతాం. పరస్పరం ఓదార్చుకుని సాంత్వన చెందుతాం. ఈ అనుద్దేశపూర్వకమైన భాగస్వామ్యంలో ఎటువంటి నిర్ణయమూ లేదు. ఒకసారి బాధాతప్త సమూహంలో భాగమైపోయినప్పుడు దాని నుంచి మనలను మనం విడదీసుకోవడం చాలా కష్టం. భావోద్వేగ సామీప్యత ప్రభావం మనలను వేరుపడనీయదు. ఉద్దేశపూర్వకంగా ఎవరూ తమ నిజభావాలకు విరుద్ధంగా ప్రవర్తించరు. ఈ మానవ ప్రవృత్తి కారణంగానే పహల్గాం, దాని పరిసర ప్రాంతాల ప్రజలు ఉగ్రవాద ఘాతుకం సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. ఆ దురాగతం తమకు ఏమి చేసిందో ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నప్పుడు వారి మాటల్లో ఆ మానవతా సున్నితత్వం మనకు అవగతమవుతుంది. వారి మాటల్లో ఆవేదన మనకు విశదమవుతుంది. ఆ దుర్మార్గ ఘటన తమ గడ్డపై జరిగినందుకు వారు లజ్జా భావంతో కుంగిపోతున్నారని కూడా మనం అర్థం చేసుకుంటాం. దురదృష్టవశాత్తు పహల్గాం ఉగ్రచర్యకు సాక్షులుగా ఉన్నవారి, ఆ ప్రాంతంలో నివసించే వారి ఆవేదనాపూరిత మాటలను ఉపేక్షించడం జరుగుతోంది.

పహల్గాం విషయమై మాట్లాడేవారు నాతో సహా ఎవరూ కశ్మీర్‌లో నివసిస్తున్నవారు కాదు, ఆ ఉగ్రవాద దాడికి ప్రత్యక్షంగా ప్రభావితమైనవారూ కాదు. అయినప్పటికీ ఆ ఘటన విషాదానికి సంబంధించి హృదయాన్ని మెలిపెట్టే కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఆ తీవ్ర మనోవ్యాకులతతో మనం ఏం చేస్తున్నాం? ఆ విషాద అనుభవంతో మనం అంటిపెట్టుకుని ఉండాలి. పరిసరాల నైసర్గిక శోభను వీక్షిస్తూ తన్మయులై ఉన్న వారు ఉగ్రవాద నైచ్యం కారణంగా కొద్ది నిముషాలలో నిండు జీవితాలను కోల్పోవడం ఎంత బాధాకరమైన విషయం! ఆ కఠోర వాస్తవాన్ని అంగీకరించేందుకు ఎంతగా గింజుకోవాలి? అయితే మనం అందుకు బదులుగా ఆ ఘాతుక చర్యకు బలయిన మనుషులను మరచిపోయి, వారిని ఫలానా సామాజిక సమూహాలకు చెందినవారుగా గుర్తిస్తున్నాం. ఆగ్రహాన్ని, విద్వేషాన్ని వ్యక్తం చేస్తున్నాం. దుఃఖాన్ని అతిక్రమించినప్పుడు మనం ఇతరుల బాధల్లో పాలుపంచుకోలేం. సహానుభూతిని వ్యక్తం చేయలేం. ఆత్మరక్షణ కొరవడిన మానవ దుర్బలత్వాన్ని నిర్నిబద్ధంగా పంచుకోలేము.

సామాజిక అనుబంధాలు రెండు విధాలుగా ఉపయోగపడతాయి. ఒకరు హిందువు అయితే, ఉగ్రదురాగతం పట్ల ఆవేదన వ్యక్తం చేసేందుకు ఆ ఘటన బాధితులు హిందువులు అన్నది స్పష్టమవడం తప్పనిసరి అవుతుంది. హతుడి మత అస్తిత్వం తెలియనప్పుడు బాధ వ్యక్తీకరణ హృదయపూర్వకంగా ఉండదు. హిందువులు 'ఇతరులు' మాదిరిగా తమ సొంత మతస్తుల 'బాగోగుల'కు ఒకటి కారనేది మరో ఆరోపణ. ఈ కారణంగా పహల్గాం విషాద ఘటనను మత సంఘీభావాన్ని పెంపొందించేందుకు ఉపయోగిస్తున్నారు. ఆ ఉగ్రచర్యను ఏవగించుకుంటున్న వారు కూడా ఇస్లాంను, ముస్లింలను నిందిస్తున్నారు. ఘాతుకానికి పాల్పడినవారిని ముస్లింలుగా పేర్కొనకపోతే ఆ దుష్కార్య ఖండన ఒట్టి దగా అని ఆక్షేపిస్తున్నారు. ఇదీ మనలను మనం, ఇతరులను భావిస్తున్న తీరు అనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుంటే భిన్న ప్రజలతో నెలకొల్పుకుంటున్న సంబంధాలు గురించి మనం విస్మయపడవలసి ఉన్నది. మన సాహచర్యాలూ, సంసర్గాలూ అన్నీ సామాజిక వర్గీకరణలతో ముడివడి ఉన్నప్పుడు ఆ సంబంధాలు నిజమైనవి అవ్వవు. అయినప్పుడు నిజమైన ప్రేమ ఎక్కడ మనకు లభ్యమవుతుంది?

తాత్వికుడు జిడ్డు కృష్ణమూర్తి నుంచి ఒక విలువైన మాటతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. ఒక భిన్న సందర్భంలో ఆయన ఇలా చెప్పారు: 'ప్రేమ ఆలోచన కాదు, ప్రేమ జ్ఞాపకమూ కాదు... ఈర్ష్య, ద్వేషం, హింస.. ఇలా ప్రేమ కాని ప్రతి దాన్నీ మనం తిరస్కరించాలి'.



(ద టెలిగ్రాఫ్)

◆ టి.ఎమ్. కృష్ణ
కర్ణాటక సంగీతవేత్త, ప్రజా మేధావి

జనహృదయాధీశుడు

"I see no sense in the children being seperated from their countrymen and in their having no manner of education in their language. India is not a barbaric country; it has schools and colleges, some of which are as good as the best of them in England."

ఇది తొంబై ఏళ్ల క్రితం సంగతి. విజయనగర సంస్థాన అధిపతి మహారాజా అలక్ నారాయణ్ జమీందారీ వ్యవహారాల్ని నిర్వహించడంలో అసమర్థులనీ, కాబట్టి ఆయన్ని జమీందారుగా తప్పించి వారి పిల్లల్ని ఇంగ్లండ్‌లోని యూనివర్సిటీకి పంపించాలనీ అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది. దానిని న్యాయస్థానంలో సవాలు చేస్తూ మహారాజా అలక్ నారాయణ్ తన పిల్లల్ని ఈ దేశంలోనే ఎందుకు ఉంచాలో చెబుతూ న్యాయమూర్తి ఎదుట స్వయంగా చేసిన వాదనే ఆ పై మాటలు. "పిల్లల్ని స్వదేశస్తుల నుండీ, స్వభాష నుంచి వేరు చేయడం అర్థరహితం" అంటూ, "భారతదేశ మేమీ అనాగరిక దేశం కాదు; ఆ మాటకొస్తే మీ ఇంగ్లండుతో పోటీపడగల విద్యాసంస్థలు ఇక్కడున్నాయి," అన్నారు అలక్ నారాయణ్. ఇంకా స్వాతంత్ర్యం రాని కాలంలో రెండు సొంత విమానాలు, వాటి కోసం విమానాశ్రయం, అంతులేని ఆస్తిపాస్తులు, ప్రపంచవ్యాప్తంగా పలుకుబడి హోదా ఉన్న ఒక యువరాజు నోటి వెంట న్యాయస్థానంలో వచ్చిన మాటలివి. ఇక న్యాయమూర్తి సంస్థానానికి అనుకూలంగా తీర్పు ఇవ్వక తప్పలేదు.

ఆ ఒక్క తీర్పే విజయనగర సంస్థానానికి చెందిన ఆఖరి మహారాజుగా పూసపాటి విజయరామ గజపతి రాజు (పి.వి.జి. రాజు) గారిని ఈ దేశపు విలక్షణ దార్శనికుడిగా మలచగలిగింది. చిట్టచివరి విజయనగర సంస్థానాధిపతి పి.వి.జి రాజు గురించి గత ఏడాది ఏప్రిల్‌లో 'The Last Maharaja of Vizianagaram' అనే విలువైన గ్రంథం ప్రచురితమైంది. "దేశమును ప్రేమించుమన్నా, మంచియన్నది పెంచుమన్నా; దేశమంటే మట్టి కాదోయి, దేశమంటే మనుషులోయ్" అన్న గురజాడ అప్పారావు వాక్యాలతో గ్రంథం ప్రారంభం అవుతుంది. అశోక్ గజపతిరాజు ముందుమాటతో 80 పైబడ్డ అరుదైన ఫోటోలు, ఛాయా చిత్రాలతో కలిసి చదివించే చారిత్రక కథనం ఇది.



పి.వి.జి రాజు చివరి వరకూ ప్రజానేతగానే వెలిగారు. పార్టీలతో సంబంధం లేకుండా సగటు మనిషి పక్షానే నిలిచారు. అట్టడుగు వర్గాల కోసం చేయగలిగినంతా నిష్కామ కర్మగా చేశారు. రాజ్యాలేలే రాజులు అనేకమంది ఉండొచ్చు. కానీ, జన హృదయాల్లో నిలిచే రాజులు అరుదు.

విజయనగర పూసపాటి సంస్థానం దేశంలోనే విస్తృతమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం కలిగిన కుటుంబం. స్వాతంత్ర్యానికి పూర్వం స్పష్టమైన బ్రిటిష్ వ్యతిరేక వైఖరితో ఎన్నికలలో పోటీ చేసి ఏకంగా 56వేల మెజార్టీ సాధించిన ఘనత ఈ సంస్థానానిది. సర్వేపల్లి రాధాకృష్ణ మొదలుకొని సర్ సి.వి. రామన్ వరకూ, మహాజ్ఞాని మాక్స్ ముల్లర్ నుంచి మహా వైజ్ఞానికుడు ఐన్‌స్టీన్ వరకూ సంస్థానం తలవని, కలవని ప్రజాపక్ష బుద్ధిజీవులు లేరు. జస్టిస్ పార్టీ నుంచి కాంగ్రెస్, కమ్యూనిస్ట్, సోషలిస్ట్ ఇతరేతర అన్ని రాజకీయ పార్టీలు, వాటి సిద్ధాంతాలతో లోతైన అవగాహన కలిగిన రాజ కుటుంబం విజయనగర పూసపాటి సంస్థానం.

'దక్షిణాది బనారస్'గా పేరు గాంచిన విజయనగరంలో విజయనగర కోట కోసం స్థలం సూచించిన వ్యక్తి ఒక సూఫీ సాధువు, హజరత్ సయ్యద్ ధన్శేశ వలీబాబా. శతాబ్దాల చరిత్ర కలిగిన రాజ కుటుంబానికి సంబంధించిన నిర్మాణానికి ఒక ముస్లిం సూఫీ సాధువు మార్గదర్శకుడు కావడం అరుదైన విషయం. నాటి బలీయమైన మత సామరస్యానికి ఇది ప్రతీక. ఇప్పటికీ కోట వద్ద ఆయన దర్గా ఉంది. పి.వి.జి. రాజు గారిది విశ్వజనీన మతం. అందుకే ప్రజలు అందరి కోసం కోటలో ఒక మాసోనిక్ ఆరాధనాలయం కూడా నిర్మించారు. బుర్రకథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు గారి నుంచి ఎలెక్ట్రానిక్ కార్పొరేషన్ అధినేత అయ్యగారి సాంబశివరావు వరకూ రాజావారి ఉదారత్వంతో వికసించిన కుసుమాలు చాలానే ఉన్నాయి. ఇక ఆయన చేసిన విద్యా సాంస్కృతిక సేవా కార్యక్రమాల వివరాలు, దానధర్మాల చిట్టా విప్పితే అది మరో మహాగ్రంథం అవుతుంది. రాణి ఎలిజబెత్, ఫిలిప్ యువరాజు మొదలు ఎందరో ప్రముఖులు విజయనగర సంస్థానం ఆతిథ్యం పొందారు. ఒకసారి జపాన్‌లో జరిగిన ఏదో కార్యక్రమానికి వెళ్ళిన షహనాయి విద్వాంసుడు బిస్మిల్లాఖాన్‌ను విజయనగరం నుంచి అక్కడకు వెళ్ళిన ఒక ప్రముఖుడు పలకరించగా దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కూడా ఆ సంస్థానంలోని ఆతిథ్యాన్ని తల్చుకుని మురిసిపోయాడట.

పి.వి.జి రాజు చివరి వరకూ ప్రజానేతగానే వెలిగారు. పార్టీలతో సంబంధం లేకుండా సగటు మనిషి పక్షానే నిలిచారు. అట్టడుగు వర్గాల కోసం చేయగలిగినంతా నిష్కామ కర్మగా చేశారు. విద్యార్థి దశలో కాలిఫోర్నియాలోని ఒక రెస్టరెంట్‌లో కూడా కొంత కాలం పనిచేయడం ఒక యువరాజు జీవితంలో ఊహించలేం. జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా వంటి సోషలిస్టు నాయకులతో పి.వి.జి. రాజు గారికి ఉన్న అనుబంధం అసాధారణమైంది. సమానతను క్రియాశీలంగా పాటించిన రాజవంశీయులు, జమీందారులు అరుదు. సోషలిస్ట్ పార్టీ సమావేశాలు జరిగినప్పుడు చోటా మోటా నాయకులు సైతం ఖరీదైన హోటల్ గదుల్లో ఉండేవారు కానీ పి.వి.జి. రాజు మాత్రం పార్టీ ఆఫీస్‌లో నేల మీద ఒక చాప పరచుకుని హాయిగా నిద్రపోయేవారట. ఇలాంటి నమ్మశక్యం కాని ఘటనలు రాజు గారి జీవితంలో అనేకం. ఆయన డైరీల ఆధారంగా రూపొందించిన ఈ గ్రంథం ఒక మంచి ప్రయత్నం. స్వయంగా ఆయనే స్వీయచరిత్ర రాసి ఉంటే ఇంకెంత గొప్పగా ఉండేదో అనే ఆశ మాత్రం పాఠకుడికి కలుగుతుంది. నూటొక్క సంవత్సరాల క్రితం జన్మించిన ఆయన ముప్పయ్యేళ్ళ క్రితం కన్నుమూశారు.

ఉన్నత విద్యావంతుడు, మేధావి, విస్తృత యాత్రికుడు, స్వతంత్ర ఆలోచనాశీలి, స్వేచ్ఛా ప్రియుడు, సంఘ సంస్కర్త, అన్నిటికీ మించి అసంఖ్యాక ప్రజల ఆకాంక్షలకు నిలువెత్తు రూపంగా తిరుగాడిన పి.వి.జి రాజు మరణ వార్త విని సుమారు రెండు లక్షల మంది ప్రజానీకం స్వచ్ఛందంగా సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చారంటే ప్రజల హృదయాల్లో ఆయనకి ఉన్న విశిష్ట స్థానం అర్థమౌతుంది. రాజ్యాలేలే రాజులు అనేకమంది ఉండొచ్చు. కానీ, జన హృదయాల్లో నిలిచే రాజులు అరుదుగా మాత్రమే ఉంటారు. అందులో పివిజి రాజు గారొకరు.

• గౌరవ్ (సామాజిక కార్యకర్త)

అమరావతి.. పునః ప్రారంభోత్సవం..!

అమరేంద్రుడి పట్టణమైన అమరావతి
బుద్ధుడి అర్చనలందుకున్న అమరావతి
చంద్రుడు కోరుతున్న అపూర్వ మహానగరి
నవ్యాంధ్రుల యువ రాజధాని అమరావతి

మూడు ముక్కలతో రాజకీయ జూదమాడి
పూర్వ పాలకులు రాజధాని లేకుండా చేసి
తలలేని మొండెంతో.. తుగ్లక్ పాలన చేసిరి
అభివృద్ధిని ఉంచినారు.. ఆమడ దూరాన..!

కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టగానే
ముండ్ల చెట్ల మధ్య నున్న అమరావతిని తీసి
ఎడ్ల బండి మీద పెట్టి..
వాడవాడలో ఊరేగించే...
దేశ ప్రధాని చేత... దశ తిరిగేలా
మరల ప్రారంభోత్సవం..!

ఆంధ్రులంతా నవ రాజధానికి ఆశీస్సులివ్వాలి
పవన వేగంతో నిర్మించాలని ప్రార్థించండి
ఆ సూర్య చంద్రులూ... ఉన్నంత వరకూ
అమరావతి అజరామరమని.. దీవించండి..!

– సుకవి, దివిసీమ

(నేడు రాజధాని అమరావతి పునః ప్రారంభోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

అమరావతికి పునర్వైభవం


ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్‌ను నియంత్రించేందుకు తయారైన వ్యాక్సిన్లలో 33శాతం వాటా హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీదే. బయోటెక్ సంస్థను స్థాపించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందు చూపుతో ఏర్పాటు చేసిన ఈ జీనోమ్ వ్యాలీలో 200కు పైగా ప్రధాన ఫార్మాస్యూటికల్ కంపెనీలు, 10వేల మందికి పైగా శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారు. ప్రపంచం మొత్తంలోని టీకాలలో మూడవ వంతు ఇక్కడి నుంచే వస్తున్నాయి. విశాలమైన రాజధాని ప్రాధాన్యత ఏమిటో హైదరాబాద్‌ను చూస్తే అర్థమవుతుంది. హైదరాబాద్ కేవలం తెలంగాణకే కాదు... దేశంలోనే నేడు పెద్ద నగరాలలో ఒకటి అయ్యింది. అదే అనుభవంతో ఆర్థిక, ప్రజా రాజధాని చెయ్యాలని ప్రభుత్వం అమరావతి నిర్మాణం తలపెట్టింది. విశాలమైన రోడ్లు, అండర్ గ్రౌండ్ పవర్ లైన్స్, నీటి వసతి, ఒక ఆహ్లాదకరమైన, ప్రపంచ స్థాయి నగరంగా రాజధాని ప్రణాళిక సిద్ధం చేసి, పనులు ప్రారంభంకానున్నాయి. వైసీపీ ప్రభుత్వం దెబ్బతీసిన అమరావతి బ్రాండ్‌ను పునరుద్ధరిస్తూ ప్రజలు గర్వంగా చెప్పుకునేలా, ప్రపంచ స్థాయి నగరంగా రాజధాని అమరావతి నిర్మాణం జరగబోతున్నది.

రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు రావాలంటే ఇతర రాష్ట్రాలకు దీటుగా రాజధాని ఉండాలన్న ఉద్దేశంతో ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాన్ని చేపట్టారు. చంద్రబాబుపై నమ్మకంతో రైతులు ఒక్క రూపాయి తీసుకోకుండా 58 రోజుల్లో 34,281 ఎకరాల భూముల్ని స్వచ్ఛందంగా రాజధాని నిర్మాణం కోసం ఇచ్చారు. 2015 అక్టోబర్ 22న రాజధానికి ఉద్దండరాయునిపాలెంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. 2015లో పనులు ప్రారంభించి... హైకోర్టు, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల నివాస భవనాలు, రహదారుల నిర్మాణాన్ని చేపట్టారు. అయితే జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కక్షపూరితంగా వ్యవహరించి భూములిచ్చిన రైతులను అక్రమ కేసులతో వేధించి, అవమానించి, రాజధాని పనులు నిలిపివేశారు.

పాలకులు ఎవరైనా అభివృద్ధిని ఆకాంక్షిస్తూ, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ ఇతర రాష్ట్రాలకు, ప్రాంతాలకు పోటీగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. అందుకు విరుద్ధంగా జగన్‌రెడ్డి విధ్వంసానికి పాల్పడి, రాష్ట్రానికే తలమానికమైన ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు. వైసీపీ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు జగన్‌రెడ్డి ఎన్ని కుయుక్తులు పన్నినా శాంతియుతంగా, నిర్విరామంగా రైతులు, మహిళలు 1632 రోజుల పాటు అలుపెరుగని పోరాటం చేశారు.

పెట్టుబడులు, ఉపాధి కల్పన దిశగా అమరావతి పునర్నిర్మాణం చేయడంతో పాటు మిగిలిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి చంద్రబాబు ప్రణాళికలు రూపొందించారు. ప్రతి జిల్లాలోను పారిశ్రామిక అభివృద్ధి జరిగేందుకు బాటలు వేశారు. వినూత్న నగరంగా అమరావతిని నిర్మించేందుకు సింగపూర్ ప్రభుత్వం ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌ను ప్రామాణికంగా తీసుకున్నారు. ప్రజలపై భారం పడకుండా సొంతంగా నిధులు సమకూర్చు కోగలిగిన ప్రాజెక్టుగా దీనిని రూపొందించారు.

అమరావతిని రాజధానిగా నిర్మిస్తే కృష్ణా, గుంటూరు జిల్లాలు మాత్రమే అభివృద్ధి చెందుతాయని వైసీపీ తన పెయిడ్ ఆర్టిస్టుల ద్వారా దుష్ప్రచారం చేయించడం సిగ్గుచేటు. అమరావతి నిర్మాణానికి ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని దశలవారీగా అమ్ముతూ రాజధాని నిర్మాణానికి చేసిన అప్పులను వడ్డీలతో సహా చెల్లించవచ్చు. మిగిలిన డబ్బుని 175 నియోజకవర్గాల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు. రాజధానిలో నిర్మాణాలు అన్నీ పోగా, రూ.2లక్షల కోట్ల పైబడి విలువైన మిగులు భూములు అమరావతిలో ఉన్నాయి. పదేళ్ల తరువాత సైబరాబాద్ వద్ద పెరిగినట్లు ఇక్కడ భూముల విలువ ఎకరం రూ.50 కోట్లకు పైగా పెరుగుతుంది. అయితే, రాష్ట్ర నిధులన్నీ అమరావతికి ఖర్చు చేస్తున్నారంటూ ప్రాంతీయ చిచ్చు పెట్టే కుట్ర రాజకీయాలు చేస్తూ, అబద్ధాలు ప్రచారం చేస్తున్నది జగన్ ముఠా. అమరావతి పూర్తయితే పెట్టుబడులన్నీ ఏపీకి వస్తాయనే భయంతో వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది.



పెట్టుబడులు, ఉపాధి కల్పన దిశగా అమరావతి పునర్నిర్మాణం చేయడంతో పాటు మిగిలిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి చంద్రబాబు ప్రణాళికలు రూపొందించారు. ప్రతి జిల్లాలోను పారిశ్రామిక అభివృద్ధి జరిగేందుకు బాటలు వేశారు. ప్రజలపై భారం పడకుండా సొంతంగా నిధులు సమకూర్చుకోగలిగిన ప్రాజెక్టుగా అమరావతిని రూపొందించారు.

భూసమీకరణలో భూములు ఇచ్చిన వారిలో 32శాతం ఎస్సీలు, ఎస్టీలు; బీసీలు 14శాతం, రెడ్డి సామాజికవర్గం 20శాతం; కమ్మ సామాజికవర్గం 18శాతం; కాపు సామాజికవర్గం 9శాతం; ముస్లిం సామాజికవర్గం మూడు శాతం ఉన్నారు. ఇలాంటి చోట కులం రంగువేసే ప్రయత్నం జగన్ ముఠా చేస్తున్నది. జగన్‌రెడ్డి నిర్వాకం వల్ల రూ.2లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యాసంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. మూడు రాజధానుల పేరుతో కుల చిచ్చు, ప్రాంతీయ చిచ్చు పెట్టి, తన కుంభకోణాల నుండి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేశారు. జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో అమరావతిని కుప్పకూల్చారు. ఎక్కడి పనులు అక్కడ ఆపేశారు. రాజధాని నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు తెచ్చిన మెటీరియల్‌ను కూడా తమ అనుచరులతో దోపిడీ చేయించారు. వాస్తవానికి అమరావతి ప్రాంతంలో దళితులు, బీసీలు ఎక్కువగా ఉన్నారు. దళిత రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా దళితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించి, వారి చేతులకు బేడీలు వేసి జైళ్లకు తరలించి, హింసించారు.

అమరావతి వంటి రాజధాని వస్తే రాష్ట్రానికే పేరు, గుర్తింపు వస్తుంది. ఇదొక ఆర్థికశక్తిగా మారి రాష్ట్రాన్ని నడిపిస్తుంది. ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్. సంపద సృష్టికి కేంద్రంగా అమరావతి ఉంటుంది. అమరావతి 2.0 పనులను నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి 15 వేల కోట్ల రుణం మంజూరైంది. జర్మనీకి చెందిన డెవలప్‌మెంట్ బ్యాంకు కేఎఫ్ డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు, హడ్కో నుంచి 15,400 కోట్లు రుణాలు రావడం హర్షణీయం. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన రాజధాని అమరావతి అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు మోదీ చేతుల మీదుగా మరోసారి కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టింది. అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుంది.


రైతుల ప్రాణత్యాగాలు ఓవైపు... పోరాటాలు మరోవైపు... న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కుచెదరకుండా అలా నిలబడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన పరిపాలనా దక్షతతో ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకులను ఒప్పించి, తెచ్చిన నిధులతో అమరావతి పనులు రానున్న కాలంలో పరుగులు పెట్టబోతున్నాయి.

■ ఏలూరి సాంబశివరావు
పర్చూరు శాసనసభ్యులు

మహానగరంగా అమరావతి!

అమరావతి రూపంలో ఒక మహానగరాన్ని నిర్మించుకునే అవకాశం ఆంధ్రప్రదేశ్‌కు దక్కింది. స్వాతంత్ర్యానంతరం దేశంలో కొత్తగా నిర్మించ తలపెట్టిన నగరం ఇది. ఆ చారిత్రిక స్పృహ, ఆ దార్శనికత ఉన్న నాయకుడు చంద్రబాబు. వైసీపీ విధ్వంస విధానాలతో నిలిచిపోయిన అమరావతి పునర్నిర్మాణాన్ని మూడేళ్ళలో పూర్తి చెయ్యాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి తెలుగువాడు గర్వంగా తలెత్తుకునేలా రాజధాని నిర్మించాలని చంద్రబాబు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రజా రాజధానిలో పరిపాలన, న్యాయ, ఆర్థిక, విజ్ఞాన, ఎలక్ట్రానిక్స్, ఆరోగ్య, క్రీడా, మీడియా, పర్యాటక వంటి తొమ్మిది థీమ్ సిటీలను నిర్మించబోతున్నారు. అమరావతి పునర్నిర్మాణ పనులకు నేడు ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.లక్ష కోట్ల పనులకు శ్రీకారం చుడుతున్నది కూటమి ప్రభుత్వం.

– నీరుకొండ ప్రసాద్



అద్వితీయం

శంకుస్థాపనతో అమరావతికి మహర్దశ



పడి లేవడం కెరటం గుణం. అమరావతి కూడా ఓ కెరటమే. వైసీపీ హయాంలో వెనకడుగు పడినా.. కూటమి ప్రభుత్వం వచ్చాక రెట్టింపు ఆశలతో మళ్లీ ఎగసిపడుతోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.49 వేల కోట్ల పనులతో ఆవిష్కృతం కాబోతోంది. ఇంకా రూ.61 వేల కోట్ల పనులు చేపట్టే అవకాశం కూడా ఉండటం, రాజధాని చుట్టుపక్కల కీలకమైన మౌలిక సదుపాయాలకు బీజం పడుతుండటంతో ఆశల అమరావతి సాకారమయ్యే ందుకు ఈ పునః ప్రారంభోత్సవం కీలకం కానుంది.

- గతంలో రూ.15 వేల కోట్ల పనులతో నిర్మాణానికి శ్రీకారం
- తాజాగా అంతకు మూడు రెట్ల పనులతో పునర్నిర్మాణం
- రూ.49 వేల కోట్ల పనులకు టెండర్లు
- రూ.61 వేల కోట్లకు చేపట్టాల్సిన పనులు
- కేంద్ర, ప్రైవేట్ సంస్థల పెట్టుబడులు మరో రూ.30 వేల కోట్లు
- అదనపు భూ సమీకరణ జరిపితే మరింత పెరిగే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతి నిర్మాణం రూ.15 వేల కోట్ల విలువైన పనులతో మొదలైంది. తాజాగా పునర్నిర్మాణాన్ని పురస్కరించుకుని అంతకుమించి రూ.70 వేల కోట్ల పనులతో శ్రీకారం చుట్టగా, రూ.49 వేల కోట్ల విలువైన పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఇక అమరావతిలో కేంద్ర సంస్థలు, ప్రైవేట్ సంస్థలు పెట్టే పెట్టుబడులు కలిపితే మొత్తం రూ.లక్షన్నర కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇప్పటికే రూ.30 వేల కోట్ల మేర అమరావతి పెట్టుబడులను ఆకర్షించింది. విద్య, పరిశోధనాభివృద్ధి, ఆరోగ్యం, ఆతిథ్యం, బ్యాంకులు, కేంద్ర సంస్థల రూపేణా రూ.30 వేల కోట్ల పెట్టుబడుల సమీకరణ జరిగింది. ఈ సంస్థలన్నీ శంకుస్థాపన అనంతరం పనులు ప్రారంభించనున్నాయి. పునర్నిర్మాణ పనుల కోసం సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నుంచి నిధుల సమీకరణ జరుపుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, గృహ నిర్మాణం, వ్యాపారాల నిర్వహణకు అవసరమైన నిర్మాణ కార్యకలాపాలకు కూడా శ్రీకారం చుడుతుండటంతో పెట్టుబడులు మరిన్ని పెరిగే అవకాశముంది. వీటన్నింటి నేపథ్యంలో అమరావతి విస్తరణ కోసం మరో 44 వేల ఎకరాలను సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. శంకుస్థాపన అనంతరం దీనిపై ప్రకటన చేసే అవకాశముంది.

మౌలికసదుపాయాల కల్పన

అమరావతి చుట్టూ మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుడుతున్నారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టుకు అయ్యే రూ.35 వేల కోట్ల ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఈ మెగా ప్రాజెక్టు సాకారమైతే అమరావతే కాకుండా రాజధాని ప్రాంత పరిధిలోని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు కూడా అభివృద్ధి చెందుతాయి. ఈ భారీ ప్రాజెక్టుకు ఇటీవలే కేంద్రం అనుమతులిచ్చింది. భూ సేకరణ దిశగా అడుగులు

మిగతా 6లో..



కనకదుర్గమ్మ వారధిపై జనసేన, బీజేపీ, టీడీపీ జెండాల రెపరెపలు

ఆంధ్రుల కలల రాజధాని అమరావతి చరిత్రలో మరో సువర్ణాధ్యాయానికి నేడు తెరలేవనుంది. ఐదేళ్ల బానిస సంకెళ్లను తెంచుకుని సంకల్ప బలంతో ముందుకుసాగే సమయం వచ్చేసింది. చిట్టడవి నుంచి చరిత్రలో లిఖించే స్థాయికి చేరుకునే శుభ ముహూర్తం కొద్ది గంటల్లో ఆవిష్కృతం కానుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం 'అమరావతి 2.0'కు శ్రీకారం చుట్టనుండటంతో సర్వత్రా పండుగ వాతావరణం నెలకొంది. అంగరంగ వైభవంగా జరిగే ఈ వేడుకకు రాష్ట్రవ్యాప్తంగా లక్షల జనాభా తరలివస్తుండగా, రాజధాని రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. ఏర్పాట్లు కూడా భారీస్థాయిలో ఉండటం, అమరావతితో పాటు కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతుండటంతో అంతటా ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక అమరావతి అడ్డంకులకు చెల్లు.. అక్రమాలకు చెల్లు.. ఇకపై అన్నీ మంచి శకునములే.. శుభసూచకములే.. అంటూ హర్షిస్తున్నారు.

రారండోయ్.. వేడుక చూద్దాం..



శంకుస్థాపన పైలాన్ సిద్ధం



పునః సంకల్పం

నేడే అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన

నేటి మధ్యాహ్నం రాజధాని రానున్న ప్రధాని నరేంద్రమోదీ

- అందంగా ముస్తాబైన రాజధాని ప్రాంతాలు, రహదారులు
- ఇప్పటికే పూర్తయిన భారీ సభా వేదికలు, పైలాన్
- కూటమి జెండాలతో కళకళలాడుతున్న ప్రధాన రోడ్లు
- కేంద్ర బలగాల పర్యవేక్షణలో సభా ప్రాంగణం
- రాజధాని రైతులకు ప్రాధాన్యం.. సింహభాగం గ్యాలరీలు
- రాష్ట్రవ్యాప్తంగా రానున్న వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- మొత్తం 3 వేల బస్సుల్లో తరలిరానున్న ప్రజలు
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు ప్రత్యేక గ్యాలరీ

అందంగా రహదారులు

రాజధానికి చేరుకునే రోడ్లు పచ్చదనంతో అందంగా ఆకట్టుకుంటున్నాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న మట్టిని తొలగించడంతో పాటు డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు నీరందేలా డ్రిప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలు సేదతీరడానికి ప్రతి 500 మీటర్లకు ఒక టెంట్ వేశారు.



ముస్తాబైన సభా వేదిక



పీఎం కాన్వాయ్ ట్రయల్ రన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు సర్వం సిద్ధమైంది. ఏర్పాట్లన్నీ గురువారం మధ్యాహ్నానికే కొలిక్కి వచ్చాయి. సభా ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. మూడు పొడవాటి వాటర్ ప్రూఫ్ టెంట్లతో ప్రధాన వేదికను సిద్ధం చేశారు. మధ్యలో ఉన్న టెంట్‌కు అభిముఖంగా ప్రధాన వేదిక ఉంటుంది. ఒకవైపు ప్రత్యేక ఆహ్వానితులకు, మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాలకు చోటు కల్పించారు. మధ్యలో ఉన్న ప్రధాన వేదిక వద్ద డీ సర్కిల్ ఏర్పాటు చేశారు. ఈ సర్కిల్ దాటి లోపలికి ఎవరూ ప్రవేశించలేనంతగా ఏర్పాట్లు జరిగాయి. డీ సర్కిల్‌కు ముందుగా వీవీఐపీలకు ఒకవైపు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మీడియాకు మరోవైపు గ్యాలరీలు ఇచ్చారు. ఈ గ్యాలరీల వెనుక వైపు ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రింట్ మీడియా, సీనియర్ ఆఫీసర్లకు గ్యాలరీలు ఇచ్చారు. రెండో వరుస గ్యాలరీ తర్వాత రాజధాని రైతుల గ్యాలరీలు ఇచ్చారు. మొదటి వేదికలో కూడా రాజధాని రైతులకు గ్యాలరీలు ఉన్నాయి. మూడో వేదికలో సాంస్కృతిక బృందానికి, పారిశ్రామికవేత్తలకు, ఇతర వీఐపీలకు మొదటి, రెండు గ్యాలరీలు కేటాయించారు. మిగిలిన గ్యాలరీలన్నీ ప్రజలకు కేటాయించారు. సభలో సగభాగం అమరావతి రైతులకే సీట్లు ఇచ్చారు. వేదిక వెనుక వైపు ప్రధానమంత్రి కాన్వాయ్ ఆగటానికి పార్కింగ్ ప్లేస్ సిద్ధం చేశారు. అమరావతి పైలాన్ వెనుక హెచ్‌పీఎం రోడ్డును ఆనుకుని పీఎం కార్ల పార్కింగ్ ఉంటుంది. దీనికి కూతవేటు దూరంలో సీఎం గ్రీన్‌రూమ్, మంత్రుల గ్రీన్‌రూమ్స్, సీఎంవో రూమ్, డిప్యూటీ సీఎం రూమ్, ప్రభుత్వ అధికారుల రూమ్, ప్యాంట్రీ ఉంటాయి. వేదిక వెనుకభాగంలో మిగతా 6లో..

నిఘా నీడలో రాజధాని

రాజధానికి ప్రధానమంత్రి వస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం భద్రతను కట్టుదిట్టం చేసింది. పార్కింగ్ స్థలం మొదలు సభా ప్రాంగణానికి చేరుకునే వరకు అడుగడుగునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించింది. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించేందుకు పోలీసులతో పాటు ప్రత్యేక సాంకేతిక బృంద సభ్యులను కేటాయించారు. ఆధునిక టెక్నాలజీతో రూపుదిద్దుకున్న ఓఎల్ఈడీ స్క్రీన్లపై నిరంతరం డేగకన్నుతో నిఘా బృందాలు పరిశీలిస్తాయి. సభా ప్రాంగణాన్ని కేంద్ర బలగాలు పర్యవేక్షిస్తాయి.



దివి కల సాకారం

- నేడు గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని

8లో

అందుబాటులోకి విజయవాడ - కాజిపేట మూడోలైన్

- నేడు ప్రధానితో ప్రారంభోత్సవం

6లో

నేటి ఉదయం నుంచే

ట్రాఫిక్ ఆంక్షలు

ఉద్యోగాలకు బేరం

డీసీహెచ్ఎస్ పరిధిలోని ఆస్పత్రుల్లో 33 పోస్టుల భర్తీకి నెల కిందట నోటిఫికేషన్

- దరఖాస్తు చేసుకున్న 738 మంది నిరుద్యోగులు
- వెబ్‌సైట్‌లో సీనియారిటీ లిస్టు.. అభ్యంతరాల స్వీకరణ
- ఇదే అదనుగా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ దళారుల చేతివాటం
- ఒక్కో పోస్టుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు
- ఆకాశరామన్న ఉత్తరాల ద్వారా ఫిర్యాదు చేసిన మెరిట్ అభ్యర్థులు

డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ పరిధిలోని ఆస్పత్రుల్లో పోస్టుల భర్తీ వ్యవహారంలోకి రాజకీయ దళారులు రంగప్రవేశం చేశారు. డీసీహెచ్ఎస్ తమకు తెలుసనని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో సిఫార్సు లేఖలు ఇప్పిస్తామని ఒక్కో పోస్టుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బేరాలు మాట్లాడుతున్నారు. దళారుల తీరుతో తమకు అన్యాయం జరుగుతుందని భావించిన మెరిట్ అభ్యర్థులు ఆకాశరామన్న ఉత్తరాల పేరుతో డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం వెలుగుచూసింది.


(ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం టౌన్): డీసీహెచ్ఎస్ (డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్) పరిధిలో గుడివాడ ఏరియా ఆస్పత్రి, అవనిగడ్డ ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం, చల్లపల్లి, గూడూరు, పామర్రు, ఉయ్యూరు, కంకిపాడు, గన్నవరంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఖాళీగా ఉన్న 33 పోస్టులకు నెల కిందట నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పోస్టులకు 738 దరఖాస్తులు వచ్చాయి. ఒక బయోమెడికల్ ఇంజనీర్ పోస్టుకు 22 మంది, రెండు రేడియోగ్రాఫర్ పోస్టులకు 45 మంది, ఒక గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు 40 మంది, మూడు ఆడియో మెట్రికన్ పోస్టులకు తొమ్మిది మంది, ఒక గ్రేడ్-2 కౌన్సిలర్ పోస్టుకు 14 మంది, మూడు ఓటీ అసిస్టెంట్ పోస్టులకు 29 మంది, రెండు మెడికల్ రికార్డు అసిస్టెంట్ పోస్టులకు 124 మంది, 16 ఎంఎన్‌వో పోస్టులకు 317 మంది, రెండు ఆఫీసు సబార్డినేట్ పోస్టులకు 124 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఈ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రాజకీయ దళారీలు బయల్దేరారు. ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సు లేఖలను దరఖాస్తుదారులకు చూపిస్తూ డబ్బు గుంజుతున్నట్టు తెలిసింది. ఒక్కో పోస్టుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బేరాలు మాట్లాడుతున్నట్టు సమాచారం. బందరు మూడో డివిజన్‌కు చెందిన ఒక అధికార పార్టీ మిగతా 6లో..



దళారుల మాటలు నమ్మొద్దు

పలువురు అభ్యర్థుల నుంచి ఆకాశరామన్న ఉత్తరాలు వచ్చిన మాట వాస్తవమే. కొందరు అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు కూడా జత చేశారు. 33 పోస్టులకు 738 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం మెరిట్, అనుభవం, రోస్టర్‌ను పాటిస్తూ వెబ్‌సైట్‌లో సీనియారిటీ లిస్టు పొందుపరిచాం. ఏమైనా అభ్యంతరాలుంటే నేరుగా కార్యాలయానికి వచ్చి చెప్పుకోవచ్చు. దళారుల మాటలు నమ్మొద్దు. ఎవరైనా డబ్బు వసూలు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయండి.

- ఏ.వి.శేషుకుమార్, డీసీహెచ్ఎస్, మచిలీపట్నం



ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం

రూ.10 లక్షల వరకు ఆస్తినష్టం

ఆటోనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్ నాల్గో రోడ్డులో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం సంభవించిందని ఫైర్ సీఐ నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సయ్యద్ సాహెబ్ హుస్సేన్‌కు చెందిన ఖాళీస్థలంలో భారీగా పాత టైర్లను నిల్వ చేశారు. కాగా, బుధవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో చాలా టైర్లు కాలిపోయాయి. అగ్ని ప్రమాదం ఎలా సంభవించచ దనేది తెలియరాలేదు. 6 ఫైర్ ఇంజన్లు ఉపయోగించి మంటలను అదుపు చేశారు. సుమారు గంటకు పైగా శ్రమించి ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు.



మేడే నివాళి

మేడే సందర్భంగా నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో గురువారం టీడీపీ కార్మిక విభాగం టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మికుల అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని ఎన్టీఆర్ వి గ్రహానికి నివాళులర్పించారు.

8లో

నందిగామలో మహిళ హత్య

విచక్షణారహితంగా 20 సార్లు కత్తితో పొడిచిన నిందితుడు

నందిగామ, మే 1 (ఆంధ్రజ్యోతి) : నందిగామ పట్టణంలో మల్లెల దుర్గా స్రవంతి అనే మహిళ గురువారం సాయంత్రం హత్యకు గురైంది. ఆమెపై విచక్షణారహితంగా 20కి పైగా కత్తిపోట్లు పొడిచారు. ఎస్ఐ అభిమన్యు తెలిపిన సమాచారం ప్రకారం మండలంలోని రాఘవాపురానికి చెందిన మల్లెల దుర్గా స్రవంతి భర్తతో విడిపోయి కాకాని నగర్‌లో కుమారుడు ఆశిష్‌తో కలిసి ఉంటోంది. గురువారం ఉదయం ఇద్దరూ కోదాడ వెళ్లారు. సాయంత్రానికి ఇంటికి వచ్చారు. తల్లిని ఇంట్లో వదలి ఆశిష్ బయటకు వెళ్లగా, కొద్దిసేపటికే తల్లి ఫోన్‌చేసి త్వరగా ఇంటికి రావాలని ఆందోళనగా చెప్పింది. తల్లి ప్రమాదంలో ఉందని గమనించిన ఆశిష్ వెంటనే ఇంటికి వెళ్లగా పట్టణానికి చెందిన అచ్చి పెదబాబు అనే వ్యక్తి కత్తితో పొడుస్తూ కనిపించాడు. ఆశిష్ రాకను గమనించిన నిందితుడు అతడిపైకి కూడా కత్తి విసిరి పరారైనట్లు తెలిపారు. రక్తపుమడుగులో పడి ఉన్న తల్లిని ఆశిష్ హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. అయితే, చికిత్స పొందుతూ స్రవంతి మృతి చెందింది. పెదబాబుపై ఆశిష్ ఫిర్యాదు చేశాడు. దాడికి గల కారణాలు తెలియరాలేదు.

యూట్యూబర్ అనుమానాస్పద మృతి తెల్లదేవరపల్లిలో ఘటన 8లో





రాజధానిలో తుది మెరుగులు దిద్దుకుంటున్న ప్రధాని మోదీ సభా వేదిక ఏర్పాట్లు.., పరిశీలిస్తున్న మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్ (కింద)









కంట్రోల్ రూం వద్ద సూచిక బోర్డులు

ప్రధాని సభకు తరలిరండి

» హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే యార్లగడ్డ

గుణదల, మే 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీ రానున్న సందర్భంగా బహిరంగ సభకు గన్నవరం నియోజకవర్గం నుంచి లక్షలాదిగా తరలిరావాలని హోంమంత్రి వంగలపూడి అనిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ చిత్రంలో హోంమంత్రి అనిత

పిలుపునిచ్చారు. ప్రధాని సభ విజయవంతానికి కూటమి నేతలతో సమీక్షా సమావేశం నిడమానూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సభకు రాష్ట్ర నలుమూలల నుంచి 5లక్షలకు పైబడి తరలిరానున్నట్టు తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. అభివృద్ధికి పట్టంగడుతున్న చంద్రబాబును చూసి అందరి దృష్టి అమరావతిపైనే ఉందని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు, గొడ్డళ్ల చినరామారావు, ఆళ్ల గోపాలకృష్ణ, పొదిలి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి మెగా నగరం అవసరం

» ఏపీ చాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు

విజయవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక వృద్ధి, రాష్ట్ర ఆదాయం, వేగంగా అభివృద్ధి చెందాలంటే ఒక మెగా నగరం అవసరమని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని పనుల పునఃప్రారంభాన్ని ఆయన స్వాగతించారు. అమరావతి నిర్మాణానికి అంకితభావంతో కృషిచేసిన ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక లోటుకు ప్రధాన కారణం వ్యవసాయం, అనుబంధరంగాలపై అధిక శాతం ఆధారపడటమేనని, ఇవి ప్రత్యక్షంగా, పరోక్షంగా 62శాతం జనాభాకు ఉపాధి కల్పిస్తున్నాయని ఆయన వివరించారు. దేశంలో ప్రధాన నగరాల ద్వారా మాత్రమే మూడింట రెండొంతులు ఆర్థికవృద్ధిని చేకూర్చుతున్నాయని తెలిపారు. అమరావతి గ్రీన్‌ఫీల్డ్ కోసం యూకేకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్చర్ సంస్థ ఫోస్టర్ అండ్ పార్టనర్స్ ఇప్పటికే మాస్టర్ ప్లాన్ రూపొందించిందని, రాజధాని ప్రపంచంలోనే అత్యంత అందమైన నగరాల్లో ఒకటిగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్మికుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

» మంత్రి సవిత

ఇబ్రహీంపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం, కాంట్రాక్ట్ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మేడే వేడుకల్లో ఆమె మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో వారు పాల్గొన్నారు. అనంతరం టీఎన్‌వీఎస్‌కే, టీఎన్‌వీకేఎస్ నేతలు వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ, మేడే ఒక చారిత్రాత్మక చైతన్య దినోత్సవమన్నారు. రాజధాని నిర్మాణంతో ఎంతోమంది కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. శుక్రవారం అమరావతి పునర్నిర్మాణ సభకు కార్మికులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

అభద్రతాభావంతోనే చట్టం!

» రాజధాని విషయంలో వైసీపీ అరాచకాలు

» కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

విజయవాడ, మే1 (ఆంధ్రజ్యోతి) : అభద్రతా భావం వల్లే రాజధాని విషయంలో పార్లమెంటులో చట్టం చేయాలని రైతులు కోరుతున్నారని, దీనికి కారణం వైసీపీ దుర్మార్గాలేనని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆరోపించారు. గతంలో ఏ విభజిత రాష్ట్రానికి ఇలా రాజధాని విషయంలో పార్లమెంటులో చట్టం చేయలేదని స్పష్టం చేశారు. రాజధాని ఉద్యమంలో బీజేపీ కూడా భాగమేనని, అవసరమైతే రైతుల కోరికమేరకు పార్లమెంటులో చట్టం తెచ్చే ఆలోచన చేస్తామని ఆయన అన్నారు. బీజేపీ ఎప్పుడూ రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్రాభివృద్ధిలో భాగంగా సుమారు రూ.3 లక్షల కోట్లు నిధులు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. 2029 నాటికి ఎన్డీఏ కూటమి అమరావతికి ఒక రూపు తీసుకొస్తుందని, అందులో ఎలాటి అనుమానం లేదని ధీమా వ్యక్తం చేశారు.

కులగణనతో బలహీన వర్గాల అభ్యున్నతి

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జనగణనలో కులగణన కార్యక్రమం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదం చేస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. జనగణనలో కులగణన అంశాన్ని చేర్చాలని కేంద్ర మంత్రి వర్గం ఆమోదించడం పట్ల హర్షం ప్రకటించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కులగణన అంశాన్ని కేంద్ర మంత్రి వర్గం ఆమోదించడంతో ఎన్డీయే ప్రభుత్వానికి కులగణనపై ఉన్న చిత్తశుద్ధి రుజువైందన్నారు. కులగణనను కొన్ని పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నాయని, ఎన్డీయే ప్రభుత్వం మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడిందని, కులగణన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, ప్రభుత్వ పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. కులగణన నిర్ణయం గొప్ప మార్పుకు సంకేతంగా, సామాజిక అసమానతలను చెరిపివేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉద్యోగాలకు బేరం

(5వ పేజీ తరువాయి)

యువ నాయకుడు ఈ తరహాలో అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇతని ఆగడాలను ఇటీవల మంత్రి కొల్లు రవీంద్ర వద్దకు కొందరు తీసుకుని వెళ్లినట్టు సమాచారం.

డీసీహెచ్‌ఎస్‌కు ఆకాశరామన్న ఉత్తరాలు

రాజకీయ దళారుల బేరాలపై డీసీహెచ్ఎస్ ఏ.వి.శేషుకుమార్‌కు పలువురు అభ్యర్థులు ఆకాశరామన్న ఉత్తరాలు రాశారు. ఉద్యోగాలిప్పిస్తామంటూ దళారులు డబ్బులు వసూలు చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. డీసీహెచ్ఎస్ కార్యాలయంలో పనిచేసే గుమస్తాలు కూడా ఉద్యోగాలిప్పిస్తాం.. ఎంత డబ్బు ఇస్తారని అడుగుతున్నారని తెలిపారు. అర్హులైన తమకు న్యాయం చేయాలని కోరారు.

చారిత్రక ఘట్టానికి..

సర్వ సన్నద్ధం

» అధికారులు అప్రమత్తంగా ఉండాలి

» ఎక్కడికక్కడ మెడికల్ క్యాంపులు, తాగు నీరు, మజ్జిగ పాయింట్లు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్

గవర్నర్‌పేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నవ్య రాజధాని అమరావతి పునర్నిర్మాణం పనుల శంకుస్థాపన చారిత్రక ఘట్టానికి సర్వం సన్నద్ధమైన వేళ ప్రధాన ఘట్టంలో ప్రణాళికల సమర్థ అమలు ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూం నుంచి మండల, జిల్లా స్థాయి నోడల్ అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్‌లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా కలెక్టర్ వారధి, ప్రకాశం బ్యారేజి, వెస్ట్ బైపాస్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కార్యక్రమానికి హాజరుకానున్నారని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. వేసవి నేపథ్యంలో ఎక్కడికక్కడ మెడికల్ క్యాంపులు, తాగునీరు, మజ్జిగ పాయింట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి బస్సులోనూ మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు వంటివి అందుబాటులో ఉంటాయని తెలిపారు. అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం సిద్ధం చేసినట్టు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరే బస్సులు వేదిక వద్దకు సరైన సమయానికి చేరుకుని తిరిగి విజయవంతంగా గమ్యస్థానాలకు చేరుకునే విషయంలో రూట్ అధికారులు, జిల్లాస్థాయి, నోడల్ అధికారులు నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. బస్సు పాయింట్లు, రూట్లు, పార్కింగ్ తదితర వాటిపై పూర్తి అవగాహనతో ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.

రాష్ట్రం నలుమూలల నుంచి రాజధానికి..

» మూడువేల బస్సుల్లో తరలిరానున్న ప్రజలు



విజయవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి) : రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చే ప్రజల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3000 ఆర్టీసీ బస్సులను ప్రభుత్వం వినియోగిస్తోంది. వీటిలో సింహభాగం విజయవాడ మీదుగా అమరావతికి చేరుకుంటాయి. కూటమి కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో బస్సులను రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి సిద్ధం చేశారు. కృష్ణా జిల్లా నుంచి 150, ఎన్టీఆర్ జిల్లా నుంచి 150 బస్సులు అమరావతికి నడుపుతున్నారు. గుంటూరు డిపోనుంచి మొత్తం 190 బస్సులు వివిధ జిల్లాల ప్రజలను రాజధానికి తీసుకువస్తాయి. విజయవాడ మీదుగా అమరావతికి శ్రీకాకుళం నుంచి 40, పార్వతీపురం నుంచి 40, విజయనగరం 40, విశాఖపట్నం 120, అనకాపల్లి 60, కాకినాడ 80, తూర్పుగోదావరి 110, పశ్చిమ గోదావరి 115, ఏలూరు 105, ఎన్టీఆర్ 150, గుంటూరు 150, బాపట్ల 90, ప్రకాశం 90, తిరుపతి 120, చిత్తూరు 130, అన్నమయ్య 135, అనంతపురం 125, శ్రీ సత్యసాయిజిల్లాకి 105 బస్సులు వెళ్లనున్నాయి. పల్నాడు డిపో నుంచి పల్నాడు జిల్లాలో 180, ప్రకాశం 70, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు 230, వైఎస్సార్ 100, నంద్యాల 115, కర్నూలుకు 105 చొప్పున బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

1000 ప్రైవేటు బస్సులు

బస్‌స్టేషన్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు ఎన్టీఆర్ జిల్లా నుంచి మొత్తం 1100 బస్సులు వెళ్లనున్నట్టు జిల్లా ప్రజా రవాణ శాఖ అధికారి వై.ఏసుదానం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోల నుంచి 100 బస్సులు, జిల్లా వ్యాప్తంగా 1000 ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టారు. ప్రధాని సభకు వెళ్లే బస్సులపై ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

విజయవాడ - కాజీపేట మూడో లైన్ అందుబాటులోకి..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల మధ్యన అత్యంత ప్రధానమైన విజయవాడ-కాజీపేట సెక్షన్‌లో కీలకమైన న్యూవెస్ట్ బ్లాక్ హట్ క్యాబిన్ నుంచి విజయవాడ వరకు పూర్తయిన మూడో లైన్‌కు శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభోత్సవం చేయనున్నారు. ప్రధాని ప్రారంభోత్సవం చేస్తున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ గురువారం ఈ మార్గాన్ని పరిశీలించారు. 2012-13లో రూ.1,952 కోట్ల వ్యయంతో ప్రాజెక్టును చేపట్టారు. ఏపీలో 35 కిలోమీటర్లు, తెలంగాణాలో 184 కిలోమీటర్ల చొప్పున రైల్వేలైన్ ఉంటుంది. ఏపీ విషయానికి వస్తే 35 కిలోమీటర్లలో గంగినేని - న్యూ వెస్ట్‌బ్లాక్ హట్ క్యాబిన్ మధ్యన 30 కిలోమీటర్ల మేర మూడవ లైన్, విద్యుదీకరణ పనులు 2022- 23 సంవత్సరంలో పూర్తయింది. న్యూవెస్ట్ బ్లాక్ హట్ క్యాబిన్ నుంచి విజయవాడ వరకు రూ.70 కోట్ల వ్యయంతో 5 కిలోమీటర్ల మేర మూడో లైన్ పనులు పూర్తయ్యాయి.

కొన్ని ప్రత్యేక రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్ : నిర్వహణ కారణాల దృష్ట్యా గతంలో ప్రకటించిన వేసవి రైళ్లలో చర్లపల్లి-తిరుపతి, ఖాజీపేట -తిరుపతి రైళ్లను రద్దు చేస్తున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07257, 07258 తిరుపతి - చరపల్లి మధ్య నడిచే ఈ రైళ్లను తాజాగా రద్దు చేశారు. 07253, 07254 ఖాజీపేట-తిరుపతి మధ్య నడిచే రైళ్లను నిర్వహణ కారణాల దృష్ట్యారద్దు చేసినట్టు పేర్కొన్నారు.

● తెనాలి స్టేషన్ యార్డులో పనులు జరుగుతున్న సందర్భంగా పలు ప్యాసింజర్ రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. 67249 గుంటూరు - రేపల్లె, 67250 రేపల్లె - గుంటూరు, 67223 గుంటూరు రేపల్లె, 67224 రేపల్లె - తెనాలి, 67231 తెనాలి - రేపల్లె, 67232 రేపల్లె - తెనాలి, 67233 తెనాలి - రేపల్లె, 67234 రేపల్లె - గుంటూరు, 67221 విజయవాడ - తెనాలి పలు రైళ్లను ఈనెల 4వ తేదీ వరకు రద్దు చేశారు. ఇదే తేదీన 17645 సికింద్రాబాద్ - రేపల్లె రైలును 60 నిమిషాల మేరకు రీ షెడ్యూల్ చేశారు.

జయహో.. అమరావతి

» సాంస్కృతికోత్సవానికి రంగం సిద్ధం

» నలుమూలల నుంచి కళాకారులకు ఆహ్వానం

» ఆహూతులకు అపరిమిత సాంస్కృతికానందం





(ఆంధ్రజ్యోతి, కల్చరల్) : అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సభ సందర్భంగా సాంస్కృతికోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచే రాష్ట్రం నలుమూలల నుంచి అమరావతికి తరలివచ్చే అవకాశం ఉండటంతో.. ప్రజలకు మంచి సాసంస్కృతికానందాన్ని పంచేందుకు ఆ శాఖ సిద్ధమైంది. ఒళ్లు గగుర్పొడిపించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిజిల్లాల నుంచి ప్రముఖ కళాకారులు, నృత్య బృందాలు, గాయకులు, హాస్యనటులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు రావాల్సిందిగా సాంస్కృతిక శాఖ ఆహ్వానం పలికింది. సాంస్కృతికోత్సవంలో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శనల్లో శ్రీ పసుమర్తి శ్రీనివాస శర్మ బృందం 'శ్రీ విఘ్నరాజం భజే', 'చెక్కర కలిపిన', 'మయూర నృత్యం, శ్రీ ఆనంద్ బృందం నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. డాక్టర్ శ్రీ చింతా రవి బాలకృష్ణ బృందం 'జయహో అమరావతి' ప్రదర్శన, భగవతుల సౌమ్య బృందం 'అజరామరమైనది అమరావతి' నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారు. సాంస్కృతిక శాఖ మాజీ యువ రాయబారి అంబిక నృత్య బృందం ఆంధ్రప్రదేశ్ థీమ్ సాంగ్, 'వందేమాతరం', 'ఫ్యూజన్ తిల్లానా'లతో సంగిత నృత్య సమ్మేళనాన్ని సమర్పించనున్నారు. సంగిత విభాగంలో శ్రీ రాజేశ్, రమణ బృందం ప్రత్యేకంగా రూపొందించిన పాటలతో సందడి చేయనున్నారు. ఉత్సాహభరిత గితాలు అలపించనున్నారు. వీటితో పాటు జానపద నృత్య బృందాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా ఉండనున్నాయని సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.

ప్రధాని సభకు భారీ బందోబస్తు

గన్నవరం : ప్రధాని నరేంద్ర మోదీ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గన్నవరం విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో భద్రతా దళాలు గట్టి నిఘా పెట్టారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 1100 మంది కానిస్టేబుళ్లు, రెండు ఆక్టోపస్ టీమ్‌లు, రెండు గ్రేహౌండ్స్, 6 స్పెషల్ పార్టీలు, 8 మంది అడిషనల్ ఎస్పీలు, 20 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 80మంది ఎస్సైలు బందోబస్తులో పాల్గొంటున్నారు. ఐజీ అశోక్‌కుమార్ విమానాశ్రయంలో సమావేశం నిర్వహించి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ఐజీ రవిప్రకాష్, ఎస్పీలు ఆర్.గంగాధర్‌రావు, బిందు మాధవ్, అద్నాన్ నయీమ్ అస్మీ, డీఎస్పీలు చలసాని శ్రీనివాసరావు, మురళీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న ఐజీ రవి ప్రకాష్

నేటి ఉదయం నుంచే ట్రాఫిక్ ఆంక్షలు..

» ఇన్‌చార్జ్ కమిషనర్ సర్వశ్రేష్ట త్రిపాఠి

గుణదల, మే 1 (ఆంధ్రజ్యోతి) : వెలగపూడిలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ రానున్న సందర్భంగా శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ పోలీస్ కమిషనర్ సర్వశ్రేష్ట త్రిపాఠి తెలిపారు. ప్రధాని రాకను పురస్కరించుకుని నగరంలో వీఐపీలు, వీవీఐపీల తాకిడి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో పలు స్టార్ హోటళ్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. వీవీఐపీ, వీఐపీలు, ప్రముఖులు నోవాటల్ నుంచి మహానాడు జంక్షన్, రమేష్ హాస్పటల్ జంక్షన్ బెంజిసర్కిల్ నుంచి ఎంజీరోడ్డు, ప్రకాశం బ్యారేజీ మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

భారీ వాహనాలు, లారీల మళ్లింపు

శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు గుంటూరు నుంచి విశాఖపట్నం వైపునకు వెళ్లే భారీ,మధ్యతరహా వాహనాలు బుడంపాడు క్రాస్‌నుంచి తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, పెనుమూడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్‌జంక్షన్ మీదుగా వెళ్లాలి.

● విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలు హనుమాన్ జంక్షన్ నుంచి గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, రేపల్లె, బాపట్ల, చీరాల, త్రోవగుంట మీదుగా వెళ్లాలి.

● చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలు త్రోవగుంట నుంచి చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, ప్రామర్రు, గుడివాడ, హనుమాన్‌జంక్షన్ మీదుగా వెళ్లాలి.

● చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే భారీ వాహనాలు మేదరమెట్ల నుంచి అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, దామచర్ల, మిర్యాలగూడ, నార్కెట్‌పల్లి మీదుగా వెళ్లాలి.

● ఏలూరు వైపు నుంచి వచ్చే వాహనాలు చిన్న అవుటుపల్లి వద్ద పశ్చిమ బైపాస్ మీదుగా ముస్తాబాద, నున్న బైపాస్‌మీదుగా వచ్చి ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా కండ్రిక జంక్షన్, పైపులరోడ్డు, వై.వి. రావు ఎస్టేట్ పాముల కాలువ వద్ద వెస్ట్ బైపాస్ సర్వీస్ మీదుగా నల్లకుంట అండర్‌పాస్ బ్రిడ్జి, కృష్ణా నది ఐకానిక్ మీదుగా వెలగపూడి సభా ప్రాంగణానికి మళ్లించడం జరిగింది.

● కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి వైపు నుంచి వచ్చే బస్సులు వాహనాలు బందర్‌రోడ్డుపై బెంజిసర్కిల్, అక్కడ నుంచి స్క్రూబ్రిడ్జి, వారధి మీదుగా ఎన్ఆర్ఐ వరకు వెళ్లి ఎరుబాలెం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకుని వాహనాలను పార్కింగ్ -1లో పార్కింగ్ చేసుకోవాలి.

జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల నుంచి ఇబ్రహీంపట్నం రింగ్, వెస్ట్ బైపాస్ వంతెన మీదుగా కృష్ణానది ఐకానిక్ ఎక్కి వెలగపూడి సభావేదిక వద్దకు చేరుకోవాలి. వాహనాలను పార్కింగ్-6లో పార్క్ చేసుకోవాల్సి ఉంటుంది.

● ఎన్టీఆర్ జిల్లా అర్బన్ నుంచి వచ్చే వాహనాలు ప్రకారం బెంజిసర్కిల్, స్క్రూబ్రిడ్జి మీదుగా తేడేపల్లి మంగళగిరి, ఎన్ఆర్ఐ, ఎరుబాలెం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకుని పార్కింగ్-1లో వాహనాలు పార్క్ చేసుకోవాలి.

● విశాఖపట్నం నుంచి వచ్చే భారీ వాహనాలు పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద, హైదరాబాద్ నుంచి వచ్చే భారీ వాహనాలను ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద నిలిపివేయాల్సి ఉంటుంది.

పునఃసంకల్పం

(5వ పేజీ తరువాయి)

పోలీసుల కమాండ్ కంట్రోల్ రూమ్ ఉంటుంది.

భారీగా బారికేడ్లు

రాష్ట్ర నలుమూలల నుంచి కూటమి కార్యకర్తలు, ప్రజలు, అమరావతి రైతులు భారీ సంఖ్యలో అమరావతికి వచ్చే అవకాశం ఉండటంతో భద్రతా కారణాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలను సభా ప్రాంగణంలోకి ఓ పద్ధతి ప్రకారం పంపించేలా ఏర్పాట్లు చేశారు. దాదాపు 5 లక్షలకు పైగా ప్రజలు తరలివస్తారన్న అంచనాలు ఉండటంతో తొక్కిసలాట జరగకుండా ఉండేందుకు, ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు బారికేడ్లతో ప్రజలను మళ్లిస్తారు. ఏ గ్యాలరీలోకి వెళ్లాల్సిన వారు ఆ గ్యాలరీలోకి వెళ్లేలా చూస్తారు. ఎండల నేపథ్యంలో ఎవరికి ఏ ఇబ్బంది కలగకుండా ఓ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. సభాస్థలికి వచ్చే కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు పారిశ్రామిక ప్రముఖులు, అతిథులు, అధికారులు విశాంత్రి తీసుకోవడానికి ప్రత్యేక గదులు సిద్ధం చేశారు.

భోజనాలకు పక్కా ఏర్పాట్లు

సభకు వచ్చే కార్యకర్తలు, ప్రజలు, రాజధాని రైతులకు ఇబ్బంది లేకుండా మధ్యాహ్నం, సాయంత్ర భోజనం, తాగునీరు సిద్ధం చేస్తున్నారు. ఎక్కడికక్కడ ఈ-టాయిలెట్స్ కూడా అందుబాటులో ఉంచారు.

ప్రత్యామ్నాయ రోడ్లు.. పార్కింగ్ ప్రాంతాలు

వివిధ ప్రాంతాల నుంచి ప్రధాన రహదారికి చేరుకునే ముందు వరకు రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం వల్ల ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించారు. అన్ని జిల్లాల నుంచి కార్యకర్తలు వచ్చే అవకాశం ఉండటంతో రద్దీ, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సభా ప్రాంగణానికి, పార్కింగ్ స్థలానికి మధ్య సుమారు 300 మీటర్ల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనాలు పార్కింగ్ చేసి నేరుగా సభా ప్రాంగణానికి చేరుకునేలా అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యలో అక్కడక్కడ టెంట్లు వేశారు. మంచినీటి సదుపాయం కల్పించారు. పార్కింగ్ నుంచి సభకు రావడానికి మధ్యలో ఏ చిన్న పొరపాటు జరగకుండా రోడ్డుకు ఇరువైపులా అధికారులు, పోలీసులతో పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు.

సందడే సందడి

30కి పైగా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు గురువారం రాజధాని వచ్చారు. అలాగే, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తున్న వారితో అమరావతి కళకళలాడుతోంది. విజయవాడ నుంచి అమరావతికి వెళ్లే దారులన్నీ స్వాగత ఫ్లెక్సీలు, కూటమి జెండాలతో దర్శనమిస్తున్నాయి.

అద్వితీయం

(5వ పేజీ తరువాయి)

పడుతున్నాయి. దీనిని 14 వరసలుగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు వస్తే ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని కంకిపాడు, పెనమలూరు, గన్నవరం, ఆగిరిపల్లి, మైలవరం, నందిగామ వంటి ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయి.

వ్యాపార కార్యకలాపాలు విస్తృతం

అమరావతి పునర్నిర్మాణ పనులతో ఐదేళ్లుగా స్తబ్దుగా ఉన్న వ్యాపారకలాపాలు మళ్లీ ఊపందుకోనున్నాయి. నిర్మాణరంగం పతాక స్థాయిలో జరగటం వల్ల మెటీరియల్ కొనుగోళ్లు విస్తృతంగా జరుగుతున్నాయి.

విజయవాడ తూర్పు

దుర్గగుడిలో అన్నప్రసాద వితరణకు దాతల విరాళాలు

ఇంద్రకీలాద్రి, మే 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కి చెందిన జి.నాగ కుమారి కుటుంబ సభ్యులతో గురువారం అమ్మవారిని దర్శించుకుని అనంతరం అధికారులను కలిసి అన్నవితరణకు లక్ష రూపాయలు చెక్కు అందజేశారు. చెన్నైకు చెందిన డి.ఫణీంద్రరావు కుటుంబ సభ్యులతో దుర్గమ్మను దర్శించుకున్న తరువాత అధికారులను కలిసి రూ.1,00,116 చెక్కు అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు ఆశీస్సులు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రంతోపాటు అమ్మవారి చిత్రపటాలను అందజేశారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ముగిసిన శిక్షణ

బెంజిసర్కిల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మారిస్ స్టెల్లా కళాశాలలో ఫైనల్ ఇయర్ డిగ్రీ విద్యార్థినులకు గత మూడు రోజులుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధ)పై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ శిబిరంలో మొత్తం నాలుగు బ్యాచ్‌లుగా విద్యార్థినులు పాల్గొన్నారు. ఏఐతోపాటు పవర్ బీఐలో మూడు రోజుల శిక్షణ, ప్రాక్టికల్స్, పైథాన్ లాంగ్వేజ్‌లో ఆరు రోజుల పాటు మొత్తం 220 మందికి శిక్షణ ఇచ్చారు. ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) స్వంత నిధులతో స్కిల్‌షాప్ రిసోర్స్ పర్సన్స్ ఈ శిక్షణ నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింతా క్వాడ్రస్ అధ్యక్షత వహించారు. ఎంఎస్ఎంఈ జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎం. గురునాథం పాల్గొని ప్రసంగిస్తూ ఈ శిబిరం ఎంపీ శివనాథ్ సహకారంతో విజయవంతం అయిందన్నారు. కార్యక్ర మంలో నరసింహ చౌదరి, రామ్ కౌశిక్, తాజ్ మని తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాడాలి

సీఐటీయూ నేతలు నాగేశ్వరరావు, కాశీనాథ్

పటమట, మే 1 (ఆంధ్రజ్యోతి): మేడే స్ఫూర్తితో కార్మికవర్గ పోరాటాలను తీవ్రతరం చేయాలని సీఐటీయూ నాయకులు కేవీ నాగేశ్వరరావు, దోనేపూడి కాశీనాథ్‌లు పిలుపునిచ్చారు. మనిషి మనిషిగా బతకాలంటే 8 గంటల పని, 8 గంటల దినచర్య ఉండాలన్నారు. 139వ మే డే సందర్భంగా పటమట మీ-సేవ సెంటర్లో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్‌కాలం నుంచి పోరాడి సాధించుకున్న చట్టాలను హరించి వేశారని, కార్మికులను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలి వేశారని, కేంద్రంలోని మోదీ బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను కార్మికవర్గంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.కోటబాబు, వి.బి రాజు, పి.కృష్ణ, ఎస్.నాగేశ్వరావు, మస్తాన్, ఏడుకొండలు, ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.


పటమట ఈ-సేవ వద్ద మాట్లాడుతున్న దోనేపూడి కాశీనాథ్


ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ..


మాట్లాడుతున్న జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ

ఎన్టీఆర్ సర్కిల్‌లో... ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పరుచూరి అజయ్‌కుమార్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. సీపీఐ నగర కార్యదర్శి మేడే విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో బిట్రా ధనరాజు, బిట్రా సక్కుబాయ్, అరుణ్‌కుమార్, సూరిబాబు, రాము, లంక ప్రసాద్ పాల్గొన్నారు.

మొగ ల్రాజపురం: మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో నిర్వహించిన మేడే కార్యక్రమంలో సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం జరిగిన పోరాటాలు, సాధించిన నాయకులను స్మరించు కోవాలని అన్నారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ఎన్.సునీత మాట్లాడుతూ ప్రపంచీకరణకు అనుగుణంగా కార్మిక చట్టాలు మార్పులు చేసి వారి హక్కులకు భంగం కలగకుండా తయారు చేసి కార్మికులకు ప్రభుత్వాలు అండగా నిలవాలని చెప్పారు. సంస్థ ప్రోగ్రాం అధికారి డి.కోటేశ్వరరావు, సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయని ప్రభుత్వాలు: సాంబశివరావు

కార్పొరేషన్: అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను నేటి ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎం. సాంబశివరావు విమర్శించారు. మేడే సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద గురువారం ఏఐటీయూసీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం వెంటనే కనీస వేతనం రూ.26000లు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దే రాజా, నగర అధ్యక్షుడు ఎస్వీఎస్ చలం, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్, గౌరవ అధ్యక్షులు జక్కి జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.


వీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ..

అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు కృషి

విజయవాడ ఎంపీ శివనాథ్

వన్‌టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్మాణం కానున్న క్రీడా నగరంలో చెస్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ హామీ ఇచ్చారు. ఏప్రిల్ 23 నుంచి 27 వరకు ఆస్ట్రేలియాలో జరిగిన సిడ్నీ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన ఉమెన్ ఫిడే మాస్టర్ పొట్లూరి సుప్రీతను గురువారం ఎంపీ శివనాథ్ సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ చెస్ కోచ్ వి.ఆర్.బొబ్బ ఆధ్వర్యంలో సుప్రీత గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ చెస్ క్రీడాకారులకు అవసరమైన వనరులు సమకూరుస్తామని, గ్రాండ్ మాస్టర్ అయ్యేందుకు తన సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కోచ్ వి.ఆర్.బొబ్బ సుప్రీత సిడ్నీ టోర్నమెంట్‌లో సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంలోనే ఎన్టీఆర్, కృష్ణాజిల్లా చెస్ అండర్ 11, 13 బాలుర విభాగంలో విజేతలైన ఉప్పల పాటి హర్షిత సాయి, కె.శౌర్యలకు అభినందనలు తెలిపిన ఎంపీ వారికి బహుమతులు అంద జేశారు. చిన్నారులు హీర శేషసాయి కొమ్మినేని, ఈషా శేషసాయి కొమ్మినేనిలకు నగదు బహుమతి అందజేశారు. చెస్‌లో బాగా రాణిస్తూ పదో తరగతిలో కూడా 500 మార్కులు సాధిం చిన చెన్నూరి భానుశ్రీకి రూ.5,660 అందజేశారు.


పొట్లూరి సుప్రీతను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

దుర్గమ్మ ఆశీస్సులతో అమరావతి పునర్నిర్మాణ పనులు పూర్తి కావాలి


దుర్గమ్మను దర్శించుకున్న నందమూరి రామకృష్ణ

ఇంద్రకీలాద్రి, మే 1 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ ఆశీస్సులతో అమరావతి పునర్నిర్మాణ పనులు పూర్తి కావాలని, ప్రధాని మోదీ పర్యటన విజయవంతం కావాలని ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ ఆకాంక్షించారు. అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొనేందుకు ఆయన గురువారం విజయవాడ వచ్చి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాలు అందజేసి అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి పునర్నిర్మాణ పనులకు ప్రధాని మోదీ శుక్రవారం విచ్చేస్తున్నారని, ఆయన పర్యటన విజయవంతం కావాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలన్నారు. తన తండ్రి ఆశయ సాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో స్వర్ణాంధ్ర-2047 ద్వారా లక్ష్యాన్ని సాధించాలని ఆయన తెలిపారు. రామకృష్ణ వెంట గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, పార్టీ నాయకులు వీరమాచినేని శివ ప్రసాద్, వల్లూరి కిరణ్ తదితరులు ఉన్నారు.

3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్


టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ స్పోర్ట్స్, మే 1 (ఆంధ్రజ్యోతి): కానూరులోని స్కాట్‌స్పైన్ స్కూల్‌లో ఈనెల 3, 4తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ తెలిపారు. గురువారం స్కూల్ ఆవరణలో టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగే మొట్టమొదటి అఫిషియల్ రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌ను తమ స్కూల్‌లో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీల్లో మొదటి, రెండు స్థానాలు సాధించిన బాలబాలికలను జూన్‌లో జరిగే నేషనల్ టోర్నమెంట్‌కి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ శివ, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ఎం.ఫణి కుమార్, టోర్నమెంట్ డైరెక్టర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

మునగాల వద్ద ఏపీ ఆర్టీసీ బస్సులో ఏసీ ఫెయిల్యూర్

చాకచక్యంగా బస్సును రోడ్డు పక్కన ఆపిన డ్రైవర్

బస్‌స్టేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న ఆర్టీసీ ఏసీ బస్సులో మంటలు చెలరేగాయి. డ్రైవర్ బస్సును పక్కకు తీసి నిలపడంతో ప్రమాదం తప్పింది. ఏపీఎస్ఆర్టీసీ అమరావతి బస్సు ప్రయాణికులతో గురువారం 4గంటలకు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు సూర్యాపేట జిల్లా మునగాల వద్దకు వెళ్లేసరికి బస్సులో నుంచి మంటలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై రోడ్డు పక్కన నిలిపి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు స్పందించి వెంటనే సూర్యారావుపేట వద్ద అదనంగా ఏర్పాటు చేసిన ఏపీఎస్ఆర్టీసీ బస్సులో ప్రయాణికులను సురక్షితంగా హైదరాబాద్ పంపించారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సెల్‌ఫోన్‌ల దొంగ అరెస్ట్

రైల్వే స్టేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లను దొంగతనం చేయటమే వృత్తిగా చేసుకున్న కేరళలోని తిమ్మంచలకు చెందిన ఎం.ఎస్.దీపేష్ (37)ను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. తనిఖీల్లో సెల్‌ఫోన్ దొంగను గుర్తించి అరెస్టు చేశారు. అతనిని గురువారం కోర్టుకు హాజరుపరిచారు. రెండు ఐ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. విటి విలువ రూ.1.10లక్షల ఉంటుందని పోలీసులు తెలిపారు. కోర్టు అతనిని రిమాండ్‌కు పంపింది.

పెన్షన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే సహించం

నగర కమిషనర్ ధ్యానచంద్ర

మొగల్రాజపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే సహించేది లేదని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను హెచ్చరించారు. నగర కమిషనర్ ధ్యానచంద్ర గురువారం మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లో పించన్ల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఎర్ర మేడ సమీపంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారి ఆధార్ కార్డు, పరిశీలించి ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా చెక్ చేసి పించన్ అందించారు. ప్రతి నెలా సక్రమంగా పెన్షన్ ఇస్తున్నారా లేదా ఎంత ఇస్తున్నారు వంటి ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకు పించన్ల పంపిణీ ప్రారంభించాలని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల వరకు సర్కిల్ - 1 పరిధిలో 20,281కిగాను 18,988, సర్కిల్ -2 పరిధిలో 25,599కి గాను 23,790, సర్కిల్ 3 పరిధిలో 20314కి గాను 18873 పింఛన్‌లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్ కృష్ణనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


పింఛన్ పంపిణీ చేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర


పింఛన్లను అందిస్తున్న గద్దె రామ్మోహన్

పేదల జీవితాల్లో వెలుగులే కూటమి లక్ష్యం: ఎమ్మెల్యే గద్దె

పటమట: రాష్ట్రంలో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఒకే మాటగా, ఒకటే ఆలోచనగా ముందుకు సాగుతున్నారన్నారు. గురువారం 12వ డివిజన్‌లో కార్పొరేట్ పొట్లూరి సాయిబాబుతో కలిసి ఆయన లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో సీఎం చంద్రబాబు పారిశ్రామిక విప్లవం తెస్తున్నారన్నారు. శుక్రవారం ప్రధాని మోదీకి ప్రతి ఒక్కరూ ఘనంగా స్వాగతం పలకాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎంపీ

రాణిగారితోట: రాణిగారితోటలో 17,18 డివిజన్లలో ఎన్టీఆర్ భరోసా పించన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణలంక ప్రాంతంలోని డ్రెయినేజీలు, రోడ్లు, పార్కులు, స్కూల్‌గ్రౌండ్స్ ఆధునీకరించే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. స్థానికులు జాతీయ రహదారి దాటేందుకు అండర్ పాస్ నిర్మించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. రాబోయే రెండు మూడు నెలల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తో కలిసి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మేడే పురస్కరించుకుని కార్మిక సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమలో ఆ రెండు డివిజన్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమిషనర్ అన్న క్యాంటీన్ సందర్శన

పటమట, మే 1 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌కు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. బుధవారం రాత్రి ఆయన రైతుబజార్ వద్ద అన్న క్యాంటీన్‌ను స్వయంగా పరిశీలించి ఆహార నాణ్యతపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వేసవి కాలంలో క్యాంటీన్‌కు వచ్చే ప్రజలు భోజనం చేసే విధంగా షెడ్‌ను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

'దివి' కల సాకారం!



నేడు గుల్లలమోదలో క్షిపణి పరీక్షా కేంద్రానికి వర్చువల్‌గా ప్రధాని శంకుస్థాపన ● దివిలో హర్షాతిరేకాలు

దివి ప్రాంతవాసులు దాదాపు 15 ఏళ్లుగా ఎదురుచూస్తున్న డీఆర్‌డీవో క్షిపణి పరీక్షా కేంద్రం ఆశలు సాకారమయ్యే సమయం ఆసన్నమైంది. ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం అమరావతి నుంచి వర్చువల్‌గా గుల్లలమోదలో నిర్మించతలపెట్టిన క్షిపణి పరీక్షా కేంద్రం 2వ దశ పనులకు శంకుస్థాపన చేయనుండటంతో దివి ప్రాంతంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో దాదాపు రూ.25వేల కోట్లకుపైగా వెచ్చించి డీఆర్‌డీవో క్షిపణి పరీక్షా కేంద్రాన్ని అభివృద్ధి చేయనుండటంతో మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రారంభోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు దివి ప్రజలు సన్నద్ధమవుతున్నారు.

- అవనిగడ్డ, ఆంధ్రజ్యోతి

ఒడిశాలోని బాలశౌర్ కంటే దీర్ఘ శ్రేణి క్షిపణులు పరీక్షించగల సామర్థ్యంతో మరో పరీక్షా కేంద్రాన్ని నిర్మించాలని డీఆర్‌డీవో భావించింది. దీంతో గుల్లల మోద అనుకూలంగా ఉంటుదేమోనని 2009, 2010లోనే అధికారులు సర్వే చేశారు. క్షిపణి పరీక్షా కేంద్రం నిర్మించేందుకు మంచి ప్రాంతమని 2011లో నిర్ధారించుకున్నారు. తరువాత మళ్లీ ఇతర ప్రాంతాల్లోనూ సర్వే నిర్వహించారు. చివరికి 2012లో గుల్లలమోదే పరీక్షా కేంద్రానికి అనుకూలమని తేల్చారు. దీంతో 386 ఎకరాల భూమిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా కుదరలేదు. 2014లో టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే డీఆర్‌డీవో అధికారులు మరోమారు సంప్రదించగా 2017లో చంద్రబాబు ప్రభుత్వం రెవెన్యూ ఆధీనంలోని 321 ఎకరాలు, మరో 65 ఎకరాల అభయారణ్యం భూములను కేటాయించింది. అదే ఏడాది రక్షణ మంత్రిత్వ శాఖ ప్రాజెక్టుకు సంబంధించి తొలిదశ అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలో ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర రక్షణ శాఖ ఉమ్మడిగా కృషి చేసి 2018లో ఈ ప్రాంతాన్ని సీఆర్‌జెడ్ పరిధి నుంచి మినహాయిస్తూ గెజిట్ విడుదల చేయటంతో పనులు ప్రారంభమయ్యాయి. తొలిదశలో కాంపౌండ్ వాల్, పరిపాలన భవనాలను నిర్మించి మెరక పనులు పూర్తి చేసింది.



మొదటి దశలో గుల్లలమోదలో నిర్మించిన భవనాలు

అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో డీఆర్‌డీవోకు రాష్ట్ర ప్రభుత్వానికి సహృద్భావ పరిస్థితులు దెబ్బతినటంతో ప్రాజెక్టు పనులు నత్తనడకన కొనసాగాయి. 2022లో జరిగిన కేంద్ర రక్షణ రంగ బడ్జెట్‌లో డీఆర్‌డీవో ప్రాజెక్టుకు సంబంధించి కేటాయింపులు జరిగినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాకారం లేకపోవటంతో మరుగున పడిపోయింది.

మళ్లీ పట్టాలెక్కిన డీఆర్‌డీవో ప్రాజెక్టు

2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పనులు మళ్లీ పట్టాలెక్కాయి. సీఎం చంద్రబాబు, రక్షణ మంత్రిత్వ శాఖ, డీఆర్‌డీవో అధికారులతో పలుమార్లు సంప్రదింపులు జరిపి క్వార్టర్స్ నిర్మాణం, టౌన్‌షిప్‌ల నిర్మాణానికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వటంతో డీఆర్‌డీవో అధికారులు పనులను మొదలు పెట్టారు. జనవరిలోనే పనులు పునఃప్రారంభించాలని భావించినా అనుమతులు, కేటాయింపుల తర్వాతే ప్రాజెక్టు శంకుస్థాపనలు చేసి పనులను పూర్తిగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోవటంతో ఈ 4 నెలల్లో ఆ ప్రక్రియ పూర్తయినట్టు తెలుస్తోంది. దీంతో రాజధాని అమరావతి శంకుస్థాపనకు విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే డీఆర్‌డీవో ప్రాజెక్టు 2వ దశ పనులకు శంకుస్థాపన చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించడంతో రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. నేడు అమరావతికి రానున్న ప్రధాని మోదీ ఈ పనులను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.



ఆర్థిక పరిస్థితులు మెరుగవుతాయి: ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

డీఆర్‌డీవో క్షిపణి పరీక్షా కేంద్రం ద్వారా దివి ప్రాంతంలో ఆర్థిక పరిస్థితులు గణనీయంగా మెరుగవుతాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తుంది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రాజెక్టు కోసం కృషి చేసి సాధించారు. వారికి దివి ప్రాంత ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

నవ్యాంధ్ర ప్రదేశ్‌కు తలమానికం

బొబ్బా గోవర్ధన్, పారిశ్రామిక వేత్త

నాగాయలంక మండలం గుల్లలమోదలో డీఆర్‌డీవో నిర్మించనున్న క్షిపణి పరీక్షా కేంద్రం దివిసీమను నవ్యాంధ్ర ప్రదేశ్‌కు తలమానికంగా నిలబెట్టే ప్రాజెక్టు అవుతుందనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అణుశాస్త్రవేత్తగా ఎడ్లంక వాసి పద్మశ్రీ యైనేని హరి ప్రసాద్ దివిసీమ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తే ఇప్పుడు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో దివిసీమ ఖ్యాతి ప్రపంచ రక్షణ రంగంలో సుస్థిరం చేయగలదు.



మెయిన్స్‌కు పటిష్ఠ ఏర్పాట్లు

● గ్రూప్-1 పరీక్షకు హాజరవనున్న 1,801 మంది అభ్యర్థులు

● డీఆర్‌వో లక్ష్మీనరసింహం

వన్‌టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 3 నుంచి 9 వరకు 7 రోజుల పాటు నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు చేసిన ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై గురువారం డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కళాశాల ప్రిన్సిపాల్స్, ఏపీపీఎస్సీ అధికారులు, లైజనింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ లైజనింగ్ ఆఫీసర్లు, రెవెన్యూ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ ఏపీపీఎస్సీ మెయిన్స్ పరీక్షలకు నగరంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కేఎస్‌ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల, పటమటలంక, బీఎస్ ఆర్కే మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, బీఎస్‌ఆర్‌కే కాంప్లెక్స్, జమ్మిచెట్టు సెంటర్, మొగల్రాజపురం, గాంధీజీ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, పోలీస్ స్టేషన్ పార్క్ రోడ్ ఎదురుగా, వన్‌టౌన్, సీవీఆర్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, గవర్నర్‌పేట, బిషప్ అజరయ్య బాలికల జూనియర్ కళాశాల, రెడ్ సర్కిల్, కేవీఆర్ జూనియర్ కళాశాల, మసీదు స్ట్రీట్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు భవానీపురంలో నిర్వహిస్తున్నామన్నారు. 1,801 మంది అభ్యర్థులు హాజరు కానుండగా, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ గుర్తింపు కార్డులతో సహా పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకే చేరుకోవాలని, గ్రేస్ పీరియడ్‌తో కలుపుకుని 9.45 గంటల వరకు మాత్రమే అనుమతి ఇస్తారన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ముఖ్యంగా తాగునీరు, అవసరమైన మందులతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థుల హాల్ టిక్కెట్లలో నమోదు చేసిన పరీక్ష కేంద్రం పేరు అభ్యర్థి రాసే పరీక్ష కేంద్రం ఒకేలా ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చూసుకోవాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వీలుగా సదుపాయాలు కల్పించి సిద్ధంగా ఉంచాలని డీఆర్‌వో అధికారులను ఆదేశించారు.

చంద్రయ్య కాలువ రీడింగ్ పెంచాలి

● నందివాడ, ఉనికిలి డీసీ చైర్మన్లు ఏసుబాబు, నానారావు

నందివాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): శివారు గ్రామాల మంచినీటి చెరువులు నిండాలంటే చంద్రయ్య కాలువకు 120 వరకు రీడింగ్ ఉండేలా నీళ్లు వదలాలని ఇరిగేషన్ ఈఈ ఆంజనేయ ప్రసాద్‌కు నందివాడ మండల డీసీ చైర్మన్ బొమ్మనబోయిన ఏసుబాబు ఉనికిలి డీసీ చైర్మన్ పాలడుగు నానారావు కోరారు. గురువారం ఇరిగేషన్ ఈఈ ఆంజనేయ ప్రసాద్ గుడివాడ నుంచి పోలుకొండ చంద్రయ్య కాలువ లాకుల వద్దకు ఏరుకుని కాలువలో నీరు ఎలా ప్రవహిస్తున్నదీ పరిశీలించారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు అక్కడికి చేరుకుని చంద్రయ్య కాలువ 3 మండలాలకు, 30 గ్రామాలకు గుండెలాంటిదన్నారు. ఈ కాలువ నిండుగా వస్తేనే శివారు గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. దండిగానపూడి టీడీపీ నేత జగన్ మాట్లాడుతూ ఈ చంద్రయ్య కాలువపై సుమారు 50 మోటార్లు వరకు చేపల చెరువులకు నీళ్లు తోడుకుంటున్నారని, కరెంట్ ఫీజులు లాగేసినా కొత్తవి తెచ్చి ఆడిస్తున్నారన్నారు. 10 మోటార్లున్న వాళ్లు 3 మోటార్లు తోడుకోమని చెప్తున్నా వినటం లేదని ఈఈ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తమ్మారెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రయ్య కాలువ లాకులు పూర్తిగా పాడైపోయాయని, 4ఏళ్ల క్రితం రైతులంతా కలిసి బాగు చేయించుకున్నామన్నారు. ఇప్పుడన్నా బాగుచేయించాలని కోరారు. గతంలో కొన్ని డ్రాపులుండేవని, కానీ లాకుల తలుపులు పోవటంతో ఏ ఒక్క కాలువ కట్టే విధానం లేక చేపల చెరువుల రైతులు నీళ్లు వచ్చినప్పుడు రాత్రనక, పగలనక నీళ్లు తోడుతుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా డ్రాపులను బాగుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం డీఈ భరత్ మాట్లాడుతూ చంద్రయ్య కాలువ పక్కనున్న డ్రాపులకు ఎస్టిమేషన్లు వేసి అధికారులకు పంపించామన్నారు. ఉప్పల వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, వెంకట కృష్ణారావు, సుధాకర్, రాయుడు శ్రీనివాసరావు, ధర్మపాల్, ఇరిగేషన్ ఏఈ బేగ్, రైతులు పాల్గొన్నారు.



పోలుకొండలో చంద్రయ్య కాలువ వంతెనపై రైతులతో మాట్లాడుతున్న అధికారులు

వారం రోజులు నీరు వదలాలి: పిన్నమనేని

చంద్రయ్య కాలువకు ఇంకో వారం రోజులు తాగునీరు వదలాలని ఇరిగేషన్ ఈఈ ఆంజనేయ ప్రసాద్‌కు మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు కోరారు. చంద్రయ్య కాలువ పరిశీలించేందుకు వచ్చిన ఇరిగేషన్ అధికారులు పిన్నమనేనిని రుద్రపాకలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పిన్నమనేని మాట్లాడుతూ చంద్రయ్య కాలువ ఆయకట్టు అంతా చేపల చెరువులు కావటంతో చంద్రయ్య కాలువ ద్వారా నీళ్ల వస్తున్నాయంటే మోటారు విపరీతంగా బిగతించి కిందకు నీళ్ల రానియ్యకుండా తోడేస్తుంటున్నారన్నారు. అధికారులు చెప్పినా వినటం లేదన్నారు. శివారు గ్రామాలకు నీరందాలంటే ఇంకో వారం నీళ్లు ఇవ్వాలన్నారు. ఇప్పటికే నీళ్లు వచ్చి 10 రోజులయినా రుద్రపాక పంచాయతీ మంచినీటి చెరువు నిండలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఇరిగేషన్ డీఈ భరత్, ఏఈ బేగ్, పైడియ్య, కోటయ్య, ఉప్పల వెంకటేశ్వరరావు, వెంకట కృష్ణారావు (బుజ్జిబాబు), సుధాకరరావు, శ్రీనివాసరావు, నాయుడు నాగరాజు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

పెద్దాయనా బాగున్నారా... పెన్షన్ సమయానికి అందుతోందా!

● ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో కలెక్టర్ లక్ష్మీశ పలకరింపు



దివ్యాంగుడికి పెన్షన్‌ను అందిస్తున్న కలెక్టర్

బెంజిసర్కిల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పెద్దాయనా బాగున్నారా.. సమయానికి పెన్షన్ అందుతుందా.. ఆరోగ్య ఎలా ఉంది.. ఎవరైనా మిమ్మల్ని డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అంటూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పలకరించారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో గురువారం జరిగిన పెన్షన్ల పంపిణీలో కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేశారు. ఈసందర్భంగా లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో 2,28,388 పెన్షన్లకు రూ.98.14 కోట్లు మేర పంపిణీ జరుగుతోందన్నారు. డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, యూసీడీ పీవో వెంకట నారాయణ పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి జయలక్ష్మి

పటిష్ఠ పర్యవేక్షణతో పెన్షన్ల పంపిణీ

● ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జయలక్ష్మి

బెంజిసర్కిల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పేదల సామాజిక భద్రతకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎంతగానో ఉపయోగపడుతోందని రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి అన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా గురువారం జయలక్ష్మి అధికారులతో కలిసి తూర్పు నియోజకవర్గం, వార్డు సచివాలయం-82 పరిధిలోని పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పెన్షన్ల ప్రక్రియను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇంటివద్దనే అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. అధికారులతోపాటు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో మంత్రి సుభాష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, ఎంపీ చిన్ని

కార్మికుల తిరుగుబాటుతో వైసీపీకి 11 సీట్లు

● టీఎన్‌టీయూసీ మేడే సభలో మంత్రి సుభాష్

మొగల్రాజపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చి ఇసుకను బంగారంలా చేసి భవన నిర్మాణ కార్మికుల జీవితాలను నాశనం చేసిన వైసీపీ అదే ఒరవడితో 80 లక్షల అసంఘటితంగా ఉండే వివిధ రంగాల కార్మికుల ఫెడరేషన్‌లను రద్దు చేయడంతో వారి కుటుంబ సభ్యులతో కలిసి 3 కోట్ల 20లక్షల మంది తిరుబాటు చేసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని తెచ్చారని వైసీపీని 11 సీట్లకు పరివితం చేశారని మంత్రి వాసుపల్లి గణేష్ అన్నారు. మేడే సందర్భంగా విజయవాడ సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో టీడీపీ కార్మిక విభాగం టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు, భవన నిర్మాణ కార్మికుల అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రాఘురామరాజు ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ వైసీపీ హయాంలో కార్మికుల జీవితాలను ఊచకోత కోశారని వారికి సంబంధించి 12 పథకాలను రద్దుచేశారని జీవో నెంబరు 1214 తీసుకొచ్చారన్నారు. కేంద్రం నుంచి రూ.450 కోట్ల నిధులు కార్మికులకు వస్తే వాటిలో రూ.110 కోట్లను ఖర్చు చేసి మిగిలినవి వెనక్కు పంపారని విమర్శించారు. మరో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ చంద్రబాబు కార్మికుల పక్షపాతి అని రాష్ట్రంలో పరిశ్రమలు తీసుకొస్తున్నారని వాటి అవసరాలకు తగిన విధంగా ఉద్యోగాలు సాధించడం కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను తీసుకొచ్చారన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక సంఘాలనేవి కార్మికుల హక్కుల పరిరక్షణకు పనిచేయాలని అదే సమయంలో యాజమాన్యాలతో మాట్లాడి ఉద్యోగాల కల్పనకూ పనిచేయాలి అని సూచించారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి మనిషి 8 గంటలు పనిచేస్తుంటే సీఎం చంద్రబాబు రోజులో 18 గంటలు పని చేస్తారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, మాజీ ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధులు నాగుల్‌మీరా, సయ్యద్ రఫీ, టీఎన్‌టీయూసీ నేతలు పాల్గొన్నారు. తొలుత నేతలంతా ఎన్టీయార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి టీఎన్‌టీయూసి జెండాను ఆవిష్కరించారు.

యూట్యూబర్ అనుమానాస్పద మృతి





రోదిస్తున్న తల్లిదండ్రులు, వెంపాటి మధుమిత (ఫైల్‌ఫొటో)

విస్సన్నపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): తెల్లదేవరపల్లి దళితవాడలో యూట్యూబర్ వెంపాటి మధుమిత (24) ఉరేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. తిరువూరు నివాసి వెంపాటి పాపారావు-లావణ్యల కుమార్తె మధుమిత హైదరాబాద్‌లో ఉంటూ ఇటీవల అమ్మమ్మ ఊరైన తెల్లదేవరపల్లికి వచ్చింది. గురువారం ఇంట్లో ఉరివేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. తమ కుమార్తె మృతికి తెల్లదేవరపల్లి గ్రామానికి చెందిన బొల్లిపోగుప్రతాప్ అతడి కుటుంబసభ్యులే కారణమని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.ఒక్కగానొక్క కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నెట్టెం రఘురామ్‌ను సత్కరిస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు

కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెంకు సత్కారం

వన్‌టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌ను టీడీపీ నేతలు గురువారం సాదరంగా సత్కరించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, నేతలు గొల్లపూడి నాగేశ్వరరావు. జాస్తి సురేష్, యార్లగడ్డ రమేశ్ ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. రఘురామ్‌ను కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

బావిలో ట్రాక్టర్ పడి యువకుడి దుర్మరణం



ఎ.కొండూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పొలంలో దుక్కిదున్నడం కోసం వెళ్లిన ట్రాక్టర్ అదుపు తప్పి పొలం పక్కనే ఉన్న బావిలో పడటంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో జరిగింది. చల్లా హరిష్ (20) అనే యువకుడు ట్రాక్టర్‌తో దుక్కిదున్నడం కోసం గురువారం రాత్రి 8 గంటల సమయంలో వెళ్లాడు. పొలం దున్నుతుండగా పాత బావి చుట్టూ పొదలు, చెట్లు పెరిగి ఉండటంతో గమనించని హరీష్ ట్రాక్టర్ సహా అదుపుతప్పి ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో హరి అక్కడక్కడే మృతి చెందాడు. గత ఏడాది మృతుడి తండ్రి మరణించడంతో, ఆ కుటుంబానికి హరిష్ ఆధారం. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందటంతో ఆ కుటుంబం తీవ్రంగా రోధిస్తుంది.

వ్యవసాయ బావిలో పడి రైతు మృతి



వత్సవాయి, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఒక రైతు మృతి చెందిన సంఘటన గురువారం వత్సవాయిలో జరిగింది. గ్రామానికి చెందిన కర్నాటి నవీన్‌కుమార్ (45) పదెకరాలు వ్యవసాయం చేస్తుంటాడు. సుబాబుల్ తోటలో కలుపు పెరగకుండా మందు కొట్టేందుకు వెళ్లి నీళ్ల కోసం తోటలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లి అందులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. భర్త ఎంతసేపటికి రాకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లి చూడగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీసి ఇంటికి తరలించారు. భార్య లలిత కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. నవీన్‌కు ఒక కుమారుడు ఉన్నాడు. రైతు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్, రిమాండ్

జగ్గయ్యపేట రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి శివారులో యువకుడి హత్యకు పాల్పడిన ఘటనలో నిందితుడైన అవుడి రాఘవను గురువారం అదుపులోకి తీసుకుని విజయవాడ 6వ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించి జగ్గయ్యపేట సబ్‌జైలుకు తరలించినట్టు చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ తెలిపారు. ఏప్రిల్ 27న ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి సమాచారంతో సీఐ వెంకటేశ్వర్లు, పోలీసులు అక్కడకు చేరుకుని తెలంగాణ రాష్ట్రం కోదాడకు చెందిన షేక్ నాగుల్‌మీరా అలియాస్ ఫిరోజ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. గురువారం గరికపాడు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసింది తానేనని ఒప్పుకోవటంతో కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

ధనంబోడును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా!

● పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

జగ్గయ్యపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పురాతన, చరిత్రాత్మక ప్రదేశాలున్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం సూచనతో ఆయన జగ్గయ్యపేటలోని ధనంబోడు బౌద్ధరామాన్ని సందర్శించారు. గంట పాటు ఆ ప్రాంతంలోని బౌద్ధారామాన్ని, ధ్వంసమైన గోడలు, పురాతన శాసనాలను పరిశీలించారు. 2వేల ఏళ్ల నాటి బౌద్ధక్షేత్రాన్ని దర్శించేందుకు రవాణా సౌకర్యాలు లేకపోవటం, అక్కడ వచ్చిన వారికి సౌకర్యాలు కల్పించటం, శిథిలమైన ఫలకాలను పద్ధతిగా అమర్చటం వంటి పనులు చేయాల్సి ఉంటుందన్నారు. త్వరలో మరోసారి ప్రజాప్రతినిధులతో కలిసి మరోసారి ధనంబోడుతో పాటు, ముక్త్యాల ప్రాంతాలను సందర్శిస్తానని, జగ్గయ్యపేట శివార్లలో చారిత్రక అవశేషాలున్నాయన్నారు. జగ్గయ్యపేట సమీపంలోని అనేక పుణ్య క్షేత్రాలతో ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతుందన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, పురావస్తు శాఖ, పురపాలకసంఘం, రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారాలు తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు.

రైతుల ప్లాట్లలో మౌలిక సదుపాయాలకు రూ. 20 వేల కోట్లు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: గత వైసీపీ పాలనలో రాజధాని విధ్వంసానికి గురవటంతో నష్టపోయిన రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా(రైతుల ప్లాట్లలో మౌలిక సదుపాయాల) కింద రూ.20వేల కోట్లను ఖర్చు చేస్తోంది. దీం తో రెండేళ్లలోనే రైతులకు ప్లాట్లు అభివృద్ధి చెందనున్నాయి. రాజధానిలో మొత్తం 29,000 మంది రైతులు స్వచ్ఛందంగా 34,000 ఎకరాల కు పైగా భూమిని రాజధాని నగర నిర్మాణానికి ఇచ్చారు. భూములిచ్చిన రైతులకు పారదర్శకంగా 65,000కి పైగా ఈ-లాటరీ విధానం లో రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. రైతులకు ప్యాకేజీ కింద ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు కలిగిన లే అవుట్లను సకల సదుపాయాల తో అభివృద్ధి చేయాల్సి ఉండగా కొంత జాప్యం జరిగింది. ఆ తర్వాత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి వినాశనంతో అందరికంటే ఎక్కువగా రైతులు ఇబ్బందులు పడ్డారు. గత తప్పిదాలను పునరావృత్తం కానీయకుండా ఉండేందుకు ఈ సారి ప్రభుత్వం లే అవుట్ల, ప్లాట్ల అభివృద్ధికి రూ.20వేల కోట్లు ఖర్చు చేస్తోంది. దీంతో రెండేళ్లలో రైతులు ఇళ్లు నిర్మించుకోవడంతోపాటు ప్లాట్లు విక్రయించుకునేందుకు అవకాశాలు మెరుగుపడనున్నాయి.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిల గడువు పెంపు

అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ జిల్లాల్లోని 71 ప్రాథమిక సహకార సంఘాల(పీఏసీఎస్)కు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని అక్టోబరు 30 వరకు (ఆరు నెలలు) పొడిగించి, మరో ఐదు పీఏసీఎస్‌లకు కొత్తగా అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. నంద్యాల జిల్లాలో రెండు పీఏసీఎస్‌లకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలను మార్చారు. కాగా, రాష్ట్రంలో ప్రకృతి విపత్తులకు గురయ్యే ప్రాంతాల్లో ప్రపంచ ఆహార కార్యక్రమం కింద భారత్, శ్రీలంక ప్రభుత్వాలు ఐదేళ్ల పాటు నిర్వహించే అడాప్షన్ ఫర్ రెసిలియెన్స్ ప్రాజెక్ట్ (ఏడీఏపీటీ4ఆర్)ను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి ఏపీ రైతుసాధికార సంస్థకు అధికారం ఇస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆయుష్షు తీసిన ఐదు ఫుల్‌బాటిల్స్!

» పందెం కట్టిన స్నేహితులు

» రూ.10వేల కోసం తాగి ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి

» మృతునికి పెళ్లై ఏడాది...వారం కిందటే బిడ్డ జననం



మృతి చెందిన కార్తీక్

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి): పదివేల కోసం ఆశపడ్డాడో... పౌరుషానికి పోయాడో కానీ, పందెం కోసం ఏకబిగిన మద్యం తాగి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కర్ణాటకలోని కోలార్ జిల్లా పూజారహళ్లి గ్రామానికి చెందిన కార్తీక్(21), అతని స్నేహితుల మధ్య మద్యం సేవించే విషయమై సవాల్ జరిగింది. నీరు కలుపుకోకుండా ఐదు ఫుల్ బాటిళ్ల మద్యం తాగితే రూ.10వేలు ఇస్తానని వెంకటరెడ్డి అనే వ్యక్తి చాలెంజ్ చేశాడు. కార్తీక్ ఈ సవాల్ స్వీకరించాడు. ఏకంగా ఐదు బాటిళ్ల మద్యం తాగేశాడు. కాసేపటికే అస్వస్థతకు గురవ్వడంతో కోలార్ జిల్లా ముళబాగిలు ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ కార్తీక్ మృతి చెందాడు. వారం క్రితం జరిగిన ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. కార్తీక్‌కు ఏడాది కిందట వివాహమైంది. వారం కిందట కొడుకు పుట్టాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నంగిలి పోలీసులు వెంకటరెడ్డి, సుబ్రమణి సహా ఆరుగురిపై కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన వారికోసం గాలిస్తున్నారు.

నల్లమలలో పెద్దపులి అనుమానాస్పద మృతి

» 20 రోజుల తర్వాత గుర్తించిన అటవీ అధికారులు



పెద్దపులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

ఆత్మకూరు, మే 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో పెద్దపులి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం వెలుగు చూసింది. ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ వి.సాయిబాబా తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లి మండలంలోని ముసలిమడుగు సెక్షన్, గుమ్మడాపురం బీట్ పరిధిలోని దేవరసెల వద్ద ఓ పెద్దపులి కళేబరాన్ని టైగర్ ట్రాకర్స్ గుర్తించారు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేయడంతో వారు అటవీ జాగిలాలతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు 20 రోజుల క్రితమే పెద్దపులి మృతి చెందినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. ఎన్ఎస్‌టీఆర్ వైల్డ్‌లైఫ్ వెటర్నరీ డాక్టర్ ఆర్ఎన్.వెస్లీ, జుబేర్‌వలి అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిర్వహించారు. ముఖ్యమైన అవయవాల శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ల్యాబ్‌కు పంపించారు. అనంతరం దేవరసెల సమీపంలోనే పెద్దపులి కళేబరాన్ని దహనం చేశారు. మరణించిన పెద్దపులి వయస్సు సుమారు 4-5 ఏళ్ల వరకు ఉంటుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ (ఎన్‌టీసీఏ)కి సమాచారం ఇవ్వడంతో పులి మృతికి గల కారణాలపై ప్రాథమిక నివేదికను కోరినట్టు తెలిసింది.

శేషాచల అడవుల్లో అగ్నిప్రమాదం



తిరుమల, మే 1(ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పాపవినాశనంకు ఏడు కిలోమీటర్ల దూరంలోని తుంబుర తీర్థం, మొగిలిపెంట బీట్‌లో గురువారం సాయంత్రం మంటలు చెలరేగాయి. చీకటి పడేసరికి ఆ మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దట్టమైన అడవి కావడంతో సిబ్బంది అక్కడికి చేరుకోలేని పరిస్థితి. కుమారధారతీర్థం వరకు మంటలు వ్యాపించే అవకాశాలున్నాయని అటవీశాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. కుమారధార తీర్థం వైపు వస్తే తీసుకోవాల్సిన చర్యలకు సిద్ధమవుతున్నారు.

అడ్డగోలుగా కట్టేశారు!

(మొదటి పేజీ తరువాయి)

రాత్రికి రాత్రి పనులు చేపట్టి నాలుగు రోజుల్లో పూర్తిచేశారు. గోడ నిర్మాణం చేపట్టాలంటే నిబంధనల ప్రకారం మధ్యలో కనీసం రెండు సిమెంట్ స్తంభాలైనా నిర్మించాల్సి ఉంది. కానీ ఒక్క సిమెంట్ స్తంభం కూడా వేయకుండా, సిమెంట్ ఇటుకలు పేర్చేసి మమ అనిపించారు. ఆ గోడ పక్క నుంచే రూ.300 టికెట్ క్యూలైన్ ఏర్పాటుచేశారు. నాణ్యత లేకుండా నిర్మించిన ఆ గోడ వర్షానికి నాని కూలిపోయింది. అమాయకులైన భక్తులు బలి అయిపోయారు.

ప్రతిపాదనలను ఆమోదించకముందే..

ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని 'జోడుభద్రాలు'గా వ్యవహరిస్తారు. కొండ పైనుంచి స్వామివారిని ఊరేగింపుగా ఆ మార్గంలోనే కిందికి మెట్ల మార్గం ద్వారా తీసుకువస్తారు. ఉత్సవం నేపథ్యంలో అటు వైపు రాకపోకలు సాగించడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని వైదిక పెద్దలు కోరగా, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ఆ పనులను 'ప్రసాద్' పథకం కింద చేయాలని ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థను కోరారు. వీటి ఆమోదం కోసం ఈవో త్రినాథ్ (సెలవుపై అమెరికా వెళ్లారు) ఫైల్‌ను విజయవాడ దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌కు పంపించారు. దానిని వారు ఇంకా పరిశీలించలేదు. ఆమోదం తెలపలేదు. అయితే ఉత్సవం ఉన్నందున వెంటనే గోడ నిర్మాణం పూర్తిచేయాలని దేవస్థానం అధికారులు కోరడంతో ఏపీటీడీసీ అధికారులు కాంట్రాక్టర్‌తో చేయించారు. ఈ పనులను దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలి. కానీ వారు ఆ పని చేయలేదు. ఏపీటీడీసీ ఇంజనీర్లు కూడా చూసుకోవాలి. వారూ పరిశీలించలేదు. నిబంధనలు పాటించకుండా, నాణ్యత లేకుండా పూర్తిచేశారు. గత వారం రోజులుగా ఇక్కడే ఉన్న దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ కూడా తాను ఆమోదం ఇవ్వని పనులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించలేదు. ప్రస్తుతం ఆలయ ఇన్‌చార్జి ఈవోగా సుబ్బారావు ఉన్నారు. ఆయనను పక్కన పెట్టుకొని ఉత్సవాన్ని కొందరు పెద్దలే నిర్వహించారు. ఇప్పుడు తప్పు జరగడంతో నెపం ఎవరిపైకి నెట్టాలా? అని చూస్తున్నారు. కొందరు కలెక్టర్ వైపు వేలెత్తి చూపిస్తున్నారు. 'ప్రసాద్' పనులను గత ఆరు నెలల్లో నాలుగుసార్లు సమీక్షించిన కలెక్టర్‌కు ఈ విషయం తెలియదా?...అని వాదిస్తున్నారు. ఈ గోడ నిర్మాణం పని ఐదు రోజుల క్రితం చేపట్టారు. ఈ విషయం కలెక్టర్‌కు చెప్పలేదు. దేవస్థానం రోజువారీ వ్యవహారాలు, ఉత్సవం పనులు ఈవో, ఇంజనీరింగ్ అధికారులు చూసుకుంటారు. క్యూలైన్లు, వసతులు వంటి ఏర్పాట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్షించారు. అందులో ఈ గోడ విషయం ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. చందనోత్సవం బుధవారం జరుగుతుందనగా, కలెక్టర్ మంగళవారం కూడా కొండపైకి వెళ్లి ఏర్పాట్లు పరిశీలించారు. అప్పుడు అక్కడకు ఈవో గానీ, దేవదాయ శాఖ కమిషనర్ గాని రాలేదు. ఎక్కడున్నారో ఎవరికీ తెలియలేదు. ఇది కూడా ఆ రోజు చర్చనీయాంశంగా మారింది.

కాంక్రీట్ పిల్లర్లు లేకుండా గోడ ఎలా కట్టారు?

అనుమతులు తీసుకున్నారా?.. నాణ్యతకు సంబంధించిన పరీక్షలు చేయించారా?



ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న విచారణ కమిటీ సభ్యులు ఎస్.సురేష్‌కుమార్, ఆకే రవికృష్ణ, వెంకటేశ్వరరావు

» అధికారులను ప్రశ్నించిన త్రిసభ్య కమిటీ

» బదులివ్వలేకపోయిన పర్యాటక, దేవదాయ శాఖల ఇంజనీర్లు

సింహాచలం, మే 1(ఆంధ్రజ్యోతి): సింహగిరిపై గోడకూలిన ఘటనపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ గురువారం విచారణను ప్రారంభించింది. మునిసిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ చైర్మన్‌గా, ఐజీ ఆకే రవికృష్ణ, నీటి పారుదల శాఖ సలహాదారు, ఇంజనీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు సభ్యులుగా ఈ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి 72 గంటల్లోగా నివేదిక అందజేయాలని ఆదేశించింది. దీంతో గురువారం ఉదయం విచారణ కమిటీ సింహగిరికి చేరుకుని తొలుత వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంది. అనంతరం ఘటనా స్థలికి చేరుకుని దేవదాయ శాఖ, పర్యాటక శాఖ ఇంజనీరింగ్ అధికారులను విచారించింది. గోడ నిర్మాణం ఎప్పుడు ప్రారంభించారు?, ఎన్ని రోజుల్లో పూర్తిచేశారు? ప్రణాళికలో అందుకు సంబంధించిన ప్లాన్ ఉందా? గోడ నిర్మాణానికి దేవదాయ శాఖ లేదా పర్యాటక శాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు ఉన్నాయా? గోడ నిర్మాణాన్ని పర్యవేక్షించిన ఇంజనీర్లు ఎవరు? నాణ్యతకు సంబంధించిన పరీక్షలు చేయించారా? అందుకు సంబంధించిన సర్టిఫికెట్ ఉందా? అంటూ ప్రశ్నించారు. గోడ నిర్మాణంలో కనీస నిబంధనలుగా చెప్పబడే కాంక్రీట్ పిల్లర్లు లేకపోవడం గురించి కమిటీ చైర్మన్ ప్రశ్నించగా, పనులు పర్యవేక్షించిన పర్యాటక శాఖ డీఈఈ స్వామి సరైన బదులివ్వలేక నీళ్లు నమిలారు. దేవదాయ శాఖ అధికారులను ఇదే విషయం ప్రశ్నించగా, ప్రతిపాదనలు కమిషనర్‌కు పంపామని, ఉత్సవం సందర్భంగా తాత్కాలిక గోడ నిర్మించాల్సి వచ్చిందని బదులిచ్చారు. అసలు ఎటువంటి ప్లాన్ లేకుండా అనుమతులు లేకుండా నిర్మాణం ఎలా చేపట్టారని కమిటీ చైర్మన్ నిలదీశారు. ఉత్సవం పేరుతో తొందర పెట్టడంతో నిర్మాణం చేపట్టానని, దానికి అధికారుల మౌఖిక ఆదేశాలు మినహా ఎటువంటి ప్లాన్ కానీ ఉన్నతాధికారుల అనుమతులు కానీ లేవని కాంట్రాక్టర్ బదులిచ్చారు. అనంతరం కాటేజీకి వెళ్లి అధికారులతో కమిటీ విచారణ కొనసాగించింది.

ప్లాన్ మార్చారు..

ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా చేపట్టిన నిర్మాణాల ప్లాన్‌ను దేవదాయ శాఖ అధికారులు పూర్తిగా మార్చేశారు. కాంట్రాక్టర్‌కు ముందు ఇచ్చిన ప్లాన్‌కు ఇప్పుడు నిర్మాణాలు చేస్తున్న ప్లాన్‌కు సంబంధం లేదు. గురువారం ఘటనాస్థలిని పరిశీలించిన విచారణ కమిటీ ఈ విషయం గుర్తించింది. ఎక్కడైతే గోడ కూలిందో అక్కడ స్వామివారి ఉత్సవ మూర్తిని ఆలయంలోకి తీసుకువెళ్లేందుకు మెట్ల మార్గం ఉంది. ఈ మార్గాన్ని రెండు చేయాలని దేవదాయ శాఖ అధికారులు కాంట్రాక్టర్‌కు చెప్పారు. అప్పుడు ప్లాన్‌లో గోడ నిర్మాణం లేదు. అయితే, మెట్ల విషయంలో మార్పును అర్చకులు, వైదిక కమిటీ అంగీకరించలేదు. అయినా, కుడి, ఎడమ వైపు మెట్ల నిర్మాణం చేశారు. వాటి మధ్య ఖాళీలో హడావిడిగా గోడ కట్టారు. ఆ గోడే భక్తులపై కూలిందని విచారణ కమిటీ ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. ఇవే వివరాలను నిఘా వర్గాలు కూడా ప్రభుత్వానికి నివేదించాయి.

చేయనంటే ఒత్తిడి పెట్టారు: కాంట్రాక్టర్

'చందనోత్సవం సందర్భంగా జోడుభద్రాలు వద్ద గోడ నిర్మించాలని అధికారులు కోరారు. ఇంత తక్కువ సమయంలో నేను కట్టలేనని, చేయనని చెప్పాను. కానీ దేవస్థానం, పర్యాటక శాఖల అధికారులు ఒత్తిడి పెట్టడం వల్లే చేశాను.' అంటూ ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ లక్ష్మణరావు గురువారం త్రిసభ్య కమిటీ ముందు వెల్లడించారు. ఘటన జరిగిన స్థలంలోనే త్రిసభ్య కమిటీ గురువారం విచారణ చేపట్టింది. ఎవరు ఒత్తిడి పెట్టారని అధికారులు గుచ్చి గుచ్చి అడిగితే.. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏపీటీడీసీ ఈఈ రమణ వైపు ఆయన చూపించారు.

ఆ గోడలో దమ్ము లేదు

» టెంట్ వేయడానికి మేకులు

» దీంతో మరింతగా బలహీనం

» సబ్ కాంట్రాక్టర్‌తో హడావిడిగా పనులు

» ప్రభుత్వానికి నివేదించిన నిఘా వర్గాలు

విశాఖపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): సింహగిరిపై జరిగిన దుర్ఘటనలో భక్తులు ప్రాణాలు కోల్పోవడానికి గోడ నిర్మాణంలో నాణ్యత లేకపోవడమే కారణమని నిఘా వర్గాలు తేల్చినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ మేరకు నివేదిక పంపినట్టు ప్రచారం జరుగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం నిఘా వర్గాలు పంపిన నివేదికలో వివరాలిలా ఉన్నాయి. కొండ పైనుంచి వర్షం నీరు రాకుండా ఉండేందుకు మెట్లకు ఆనుకుని గోడ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. గోడ నిర్మాణం పనిని కాంట్రాక్టర్ ఆగమేఘాల మీద పూర్తిచేసి గత నెల 28న దేవస్థానం అధికారులకు అప్పగించారు. చందనోత్సవం రోజు రూ.300 టిక్కెట్ల క్యూలో వేచి ఉండే భక్తులకు ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు టెంట్‌లను ఏర్పాటుచేశారు. టెంట్ ఏర్పాటుకోసం కొత్తగా కట్టిన గోడకు మేకులు కొట్టి కర్రలు పెట్టారు. అప్పుడే కట్టిన గోడ కావడంతో అది కొంత బలహీనపడింది. అదే సమయంలో వర్షం కురవడం, గాలి కూడా వీయడంతో క్యూలైన్‌పై ఏర్పాటుచేసిన టెంట్ గాలికి పైకి లేచిపోవడంతో గోడకు మేకులు కొట్టి వేసిన కర్రలు ఊగసాగాయి. మరోవైపు గోడ అడ్డుగా ఉండడంతో కొండపై నుంచి వచ్చే వర్షం నీరు గోడ పునాదుల నుంచి కిందకు ప్రవహించింది. దీనివల్ల గోడ మరింత బలహీనమై ఒక్కసారిగా క్యూలైన్‌లో ఉన్న వారిపై కూలిపోయింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను మరొకరికి సబ్ కాంట్రాక్టు ఇచ్చారని కూడా నిఘా అధికారులు నివేదికలో పేర్కొన్నట్టు తెలిపింది.

నేడు సీమ, ఉత్తర కోస్తాలో వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి మధ్యప్రదేశ్, విదర్భ, మరట్వాడా, కర్ణాటక మీదుగా కేరళ వరకూ ఉపరితలద్రోణి విస్తరించింది. ఇదే సమయంలో బంగాళాఖాతం నుంచి భూ ఉపరితలంపైకి తేమగాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా గురువారం వర్షాలు కురిశాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరులో 54, కడప జిల్లా అట్లూరులో 36.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లా దరిమడుగులో 42.4, కడప జిల్లా ఖాజీపేటలో 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక, రాష్ట్రంలో భిన్నవాతావరణం నెలకున్న నేపథ్యంలో శుక్రవారం కొన్ని చోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రాయలసీమ, ఉత్తరకోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, పగటి ఉష్ణోగ్రతలు 41-42.5 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

డోలీలో గర్భిణి.. అడవిదారిలో ప్రసవం

నిధులు మంజూరైనా రోడ్డు పూర్తికాక గిరిజనుల అవస్థలు



డోలీలో గర్భిణిని తరలిస్తున్న కుటుంబ సభ్యులు, మార్గమధ్యలో ప్రసవించిన సీతమ్మ

శృంగవరపుకోట, మే 1(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా శృంగవరపుకోట పంచాయతీ కొండశిఖర గ్రామం రేగపుణ్యగిరి నుంచి ఆస్పత్రిలో ప్రసవం కోసం డోలీలో ఓ గిరిజన మహిళను తరలిస్తుండగా, మార్గమధ్యంలో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. గర్భిణి పంగి సీతమ్మకు నెలలు నిండడంతో గురువారం ఉదయం 10గంటల సమయంలో పురిటి నొప్పులు మొదలయ్యాయి. భర్త నర్సింగరావు స్థానిక గిరిజనులతో కలసి గ్రామం నుంచి కొండ దిగేందుకు డోలీ కట్టాడు. ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువెళ్లాలనుకున్నారు. ఇంతలో నొప్పులు అధికమై మార్గమధ్యలో ఆమె ప్రసవించింది. పండంటి ఆడబిడ్డ జన్మించింది. రేగ గ్రామానికి రోడ్డు వేసేందుకు కలెక్టర్ నిధులు మంజూరు చేసినప్పటికీ నిర్మాణం జరగలేదని, దీంతో గిరిజనులకు అవస్థలు తప్పడం లేదని గ్రామస్థులు వాపోయారు.

టీడీపీ జెండాలోనే కార్మిక శక్తి: పంచుమర్తి

» తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మేడే వేడుకలు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీ జెండాలోనే కార్మికుల చిహ్నం ఉంది. పార్టీకి కార్మికుల పట్ల ఉన్న నిబద్ధతకు ఇదే నిదర్శనం' అని మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ.. '2017లోనే కోటి మంది కార్మికులకు బీమా ఇప్పించిన ఘనత చంద్రబాబుది. ఉచిత ఇసుక విధానం ద్వారా 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఊతమిస్తున్నారు' అని అన్నారు. ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ.. కార్మికులకు చెందాల్సిన రూ.వేల కోట్లను వైసీపీ హయాంలో దారి మళ్లించారని విమర్శించారు. బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలతో రాజధాని పనులు ప్రారంభం కావడంతో కార్మికులు రాష్ట్రం నుంచి వలస పోయే పరిస్థితి నుంచి రాష్ట్రానికే కార్మికులు వలస వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు పర్చూరి అశోక్‌బాబు, దువ్వారపు రామారావు, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.3,354 కోట్లు

» రాష్ట్రంలో 2017 నుంచి ఇదే అత్యధికం

» మొత్తం పన్నుల రాబడి రూ.4,946 కోట్లు

అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సాధిస్తున్న ఆర్థిక ప్రగతికి అనుగుణంగా జీఎస్టీ వసూళ్లు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. 2024 నవంబరు, డిసెంబరుల్లో నమోదైన క్షీణత నుంచి బయటపడ్డామని, ఈ ఏడాది ఏప్రిల్ నికర జీఎస్టీ వసూళ్లు రూ.3,354 కోట్లకు చేరాయని రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ ఎ.బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇవే అత్యధిక వసూళ్లుగా పేర్కొన్నారు. పెట్రోలియం, మద్యంపై పన్నులు, వృత్తి పన్ను.. ఇలా అన్ని రకాల పన్నుల రాబడి ఏప్రిల్‌లో రూ.4,946.21 కోట్లు వచ్చిందన్నారు. గత ఆరు నెలల్లో ఇదే అత్యధికమని తెలిపారు. రాష్ట్రంలో ఊపందుకున్న ఆర్థిక వృద్ధికి, అభివృద్ధి కార్యకలాపాలకు ఇది సంకేతమన్నారు. ఏప్రిల్‌లో రూ.1,943 కోట్ల ఐజీఎస్టీ సెటిల్మెంట్ వచ్చిందని, జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇదే అత్యధికమని పేర్కొన్నారు. 2024 జనవరిలో రూ.1,930.95 కోట్లు వచ్చాయని తెలిపారు.

ఐదేళ్ల జగన్ పాలనలో అమరావతి అస్తవ్యస్తం: సాదినేని

విజయవాడ, మే 1(ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల జగన్ పాలనలో అమరావతి అస్తవ్యస్తమైంది. రాష్ట్రాన్ని ముక్కలుగా చేసి రాజధాని లేకుండా చేశారు' అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ విమర్శించారు. వికసిత భారత్- వికసిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా రూ.58 వేల కోట్లకు పైగా విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేస్తారని సాదినేని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని నెలల్లోనే రూ.3 లక్షల కోట్లు విలువైన ప్రాజెక్టులను ప్రధాని మంజూరు చేశారని, శుక్రవారం పర్యటనలో భాగంగా వాటికి శంకుస్థాప చేస్తారని ఆమె వివరించారు.

మోదీ సభకు వచ్చి జగన్ తప్పు దిద్దుకోవాలి

» అమరావతి అవకాశాల గని: అశోక్‌బాబు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): 'అమరావతి పునఃప్రారంభం వైసీపీకి చెంపపెట్టు. జగన్‌కి ధైర్యం ఉంటే ప్రధాని మోదీ సభకు వచ్చి రాజధాని విషయంలో తాను చేసిన తప్పును సరిదిద్దుకోవాలి' అని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మూడు రాజధానుల పేరుతో జగన్ రెడ్డి రాష్ట్ర ప్రజలను వంచించారు. రాజధాని రైతుల పోరాటం ఫలించి ఎట్టకేలకు అమరావతిని పునర్నిర్మించుకుంటున్నాం.' అని అశోక్‌బాబు అన్నారు.



పాంబన్ వంతెన దాటుతున్న నౌక

పాంబన్ కొత్త వంతెన దాటిన తొలి నౌక ఏపీదే!

చెన్నై, మే 1(ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపంలోని పాంబన్ కొత్త రైలు వంతెనను తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సరకుల నౌక దాటింది. విశాఖపట్టణం నుంచి ఏప్రిల్ 16వ తేదీన బయల్దేరిన '4 స్టార్' అనే సరకుల నౌక పాంబన్ రైల్వే వంతెన దాటి కర్ణాటక రాష్ట్రం కార్వార్ హార్బర్‌కు వెళ్లాల్సి ఉంది. ఈ నౌక 57.5 మీటర్ల పొడవు, 11 మీటర్ల వెడల్పు, 833 టన్నుల బరువు కలిగి ఉంది. ఈ నౌక గంటకు 6 నాటికల్ మైళ్లు (11 కి.మీ) వేగంతో ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉండగా, బయల్దేరిన రోజు నుంచి బంగాళాఖాతంలో బలమైన ఈదురుగాలుల కారణంగా గంటకు 2 నాటికల్ మైళ్లు (3.68 కి.మీ) చొప్పున ప్రయాణించింది. అందువల్ల ఏప్రిల్ 23వ తేది పాంబన్ వంతెన దాటి వెళ్లాల్సిన నౌక 28వ తేదీకి పాంబన్ తీరానికి వచ్చింది. బుధవారం మధ్యాహ్నం తొలిసారిగా వాణిజ్యపరంగా పాంబన్ కొత్త రైలు వంతెన, పాత రైలు వంతెన తెరవడంతో సరకుల నౌక దానిని దాటింది.

రేపటి నుంచి గ్రూప్-1 మెయిన్స్

» 13 పరీక్ష కేంద్రాలు... 4,496 మంది అభ్యర్థులు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 3న తెలుగు, 4న ఇంగ్లిష్ అర్హత పరీక్షలు జరుగుతాయి. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు మెయిన్స్‌లో ప్రధాన పరీక్షలు జరుగుతాయి. విశాఖపట్నంలో రెండు, విజయవాడలో ఆరు, తిరుపతిలో మూడు, అనంతపురంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఏపీపీఎస్సీ వివరించింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు జరుగుతాయని, 9.45 గంటల వరకు అభ్యర్థులను అనుమతిస్తారని తెలిపింది.

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో చోరీ

» మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

బిట్రగుంట, మే 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా బిట్రగుంట రైల్వేసెక్షన్ పరిధిలోని శ్రీవేంకటేశ్వరపాలెం రైల్వే స్టేషన్ ఔటర్ సిగ్నల్ వద్ద నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. విషయం తెలుసుకున్న నెల్లూరు జీఆర్పీ డీఎస్పీ మురళీధర్, సీఐ సుధాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ లైన్ క్లియర్ కాకపోవడంతో శ్రీవేంకటేశ్వరపాలెం ఉత్తర ఔటర్ సిగ్నల్ పోస్టు వద్ద నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఆగిందని చెప్పారు. ఎస్-2 బోగీలో హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న మౌనిక అనే మహిళ మెడలో బంగారు గొలుసును దుండగుడు లాక్కొని పరారయ్యాడని తెలిపారు. బోగిలో కిటికీ పక్కన కూర్చొని ఉండగా చోరీ జరిగినట్టు బాధితురాలు ఫిర్యాదు చేశారన్నారు.

గీతాసారం

మనస్సును లొంగదీసుకుందాం

పెంపకం వల్ల, సమాజం వల్ల మనం కులం, జాతి, మతం వర్గం లాంటి అనేక కృత్రిమమైన విభజనలకు లోనవుతాం. ఈ విభజనలన్నిటినీ అధిగమించి అందరినీ సమానంగా చూడడమే సమత్వం వైపు తొలి అడుగు. ఇది బాహ్య ప్రవర్తన కన్నా చాలా లోతైన విషయం.



సమత్వం లేదా సమానత్వం అనేది భగవద్గీతలో అనేక చోట్ల కనిపించే కీలకమైన అంశం. సమత్వ భావన, సమత్వ దృష్టి, సమత్వ బుద్ధి గురించి శ్రీకృష్ణుడు అనేక చోట్ల ప్రస్తావించాడు. బాధను, సంతోషాన్ని, లాభాన్ని నష్టాన్ని జ్ఞాని సమానంగా చూస్తాడంటూ అనేక ఉదాహరణలు కూడా ఇచ్చాడు.

సమత్వాన్ని అర్థం చేసుకోవడం సులభం. కానీ దాన్ని ఆచరణలో పెట్టడం కష్టం. ఒక మాటలో చెప్పాలంటే... మనలోని సమత్వం స్థాయి ఆధ్యాత్మిక ప్రయాణంలో మనం సాధించే పురోగతికి సూచిక. 'పౌరులందరూ చట్టం ముందు సమానమే' అంటూ సమత్వాన్ని ఆధునిక సమాజాలు అంగీకరించాయి. సమత్వం వైపు మన పురోగతిలో తదుపరి స్థాయి... దగ్గరగా ఉన్న ఇద్దరు వ్యక్తులను సమత్వ దృష్టితో/ భావనతో చూడడం. ఇందుకు ఉదాహరణ... మన పిల్లలు అంతగా రాణించని సందర్భాలలో మన మిత్రుల పిల్లలు రాణిస్తూ ఉంటే చూసి సంతోషించగలగడం. అత్తను, తల్లిని సమానంగా చూడడం, కూతురును, కోడలును ఒకే విధంగా ఆదరించడం. ఇతరులను మనతో సమానంగా చూసే సామర్థ్యం... సమానత్వానికి పతాకస్థాయి. ఇతరులకు పదోన్నతి, కీర్తి, ప్రతిష్ఠలు, ఆస్తులు దక్కినప్పుడు... సమత్వభావనతో వ్యవహరించగలిగే సామర్థ్యం ఇది. ఇతరుల బలహీనతలను మనలో, మనలోని సామర్థ్యాలను ఇతరులలో చూడగలిగితేనే ఇది సాధ్యపడుతుంది.

అందుకే మనల్ని ఇతరులలో, ఇతరుల్ని మనలో చూడాలని శ్రీకృష్ణుడు సలహా ఇచ్చాడు. చివరికి తనను (శ్రీకృష్ణుణ్ణి) అందరిలో, అన్నిటిలో చూడమని చెప్పాడు. ప్రతిదాన్ని విభజించి చూసేలా సామాజికంగా శిక్షణ పొందిన మనస్సు... అత్యున్నత స్థాయి సమత్వాన్ని పొందడానికి పెద్ద అవరోధం. మన మీద మనస్సు అధిపత్యం చెలాయించేలా అనుమతించడానికి బదులు మనమే మనస్సును లొంగదీసుకోవాలి. అప్పుడే సమత్వ భావనను సాధించడం సాధ్యపడుతుంది.


కె. శివప్రసాద్

ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతాలను 'త్రిమతాలు'గా వ్యవహరిస్తారు. వాటిని ప్రవచించినవారు శ్రీమధ్వాచార్యులు, శ్రీఆదిశంకరులు, శ్రీమద్రామానుజాచార్యులు. వారిలో ఆదిశంకరులు, రామానుజాచార్యుల మధ్య సుమారు 400 ఏళ్ళ కాల వ్యవధి ఉన్నప్పటికీ... వారిద్దరి జన్మ తిథి వైశాఖ శుద్ధ పంచమి (నేడు) కావడం విశేషం. వారు స్థిరపరచిన సంప్రదాయాలు ఈనాటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ... భక్తి, ఆధ్యాత్మికతలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

అద్వైత దీప్తి

ధర్మ సంస్థాపనకోసం ప్రతి యుగంలోనూ జన్మిస్తానన్నాడు శ్రీకృష్ణుడు. హిందూ ధర్మం శాఖోపశాఖలుగా చీలిపోయి, ఛాందసత్వం పెరిగిపోయి ధర్మానికి హాని కలిగినప్పుడు... దాన్ని చక్కదిద్ది, సన్మార్గాన్ని చూపించడానికి సాక్షాత్తూ శంకరుడే ఆదిశంకరునిగా అవతరించారంటారు పెద్దలు. జీవుడు, దేవుడు ఒకటేననే అద్వైతాన్ని ప్రబోధించడంతో పాటు అపారమైన ఆధ్యాత్మిక జ్ఞాన సంపదను గ్రంథరూపంలో అందించిన మహనీయుడు ఆదిశంకరాచార్యులు.

భారతీయ తత్త్వ చింతనపై ఎన్ని తరాలైనా చెరగని ముద్రవేసిన ఆచార్యులలో ప్రథముడు, జగద్గురువు ఆది శంకరులు. బౌద్ధ, జైన మతాలను నాటి పాలకులు అవలంబించి, వాటి వ్యాప్తికి దోహదం చేయడంతో ప్రమాదంలో పడిన హిందూ ధర్మాన్ని పునరుద్ధరించడానికి ఆయన ఎనలేని కృషి చేశారు. ఆసేతు హిమాచలం పర్యటించారు. వైదిక మతాన్ని, అద్వైత సిద్ధాంతాన్ని వ్యాప్తి చేయడం కోసం దేశం నాలుగు దిక్కుల్లో పీఠాలు స్థాపించారు. వందల ఏళ్ళ తరువాత కూడా ఆ మఠాలు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నాయి. ఇది శ్రీశంకరుల సంకల్ప శుద్ధికి తార్కాణం.

శ్రీ శంకరులు కేరళలోని కాలడి అనే గ్రామంలో జన్మించారు. ఆయన తల్లితండ్రులు ఆర్యాంబ, శివగురు. అయిదేళ్ళ వయసులో... తల్లి అనుమతితో ఆపత్సన్యాసాన్ని స్వీకరించిన శంకరులకు క్రమ సన్యాసాన్ని గోవింద భగవత్పాదులు అనుగ్రహించారు. తదనంతరం వారణాసి నగరంలో వ్యాసుని ఆదేశం మేరకు రచనా వ్యాసంగాన్ని చేపట్టారు. వ్యాస విరచిత ప్రస్థాన త్రయమైన భగవద్గీతకు, ఉపనిషత్తులకు, బ్రహ్మ సూత్రాలకు భాష్యాలు రాశారు. అలాగే, దేవతలను స్తుతిస్తూ ఆయన రచించిన శ్లోకాలు నేటికీ ప్రాచుర్యంలో ఉన్నాయి. శ్రీ శంకరులు పుట్టినప్పుడు ఆయనకు నిర్దేశితమైన ఆయుష్షు ఎనిమిదేళ్ళే. సన్యాసంతో మరో ఎనిమిదేళ్ళు, వ్యాసుడి అనుగ్రహంతో మరో పదహారేళ్ళు... మొత్తం ముప్ఫై రెండేళ్ళపాటు ఆయన ఈ భూమిపై జీవించారు. ఆ కాలంలోనే ఆయన అనన్య సామాన్యమైన అద్భుతాలెన్నో చేశారు. హిందూ ధర్మంలోని వివిధ శాఖలలో ఉన్న ఛాందస భావాలను, మూఢ విశ్వాసాలను శ్రీ శంకరులు తొలగించారు. దైవం అనే గమ్యాన్ని చేరడానికి ప్రయాణించే మార్గాలు వేరైనంత మాత్రాన... తమ మార్గమే గొప్పది అనే పిడివాదం తగదని బోధించారు. షణ్మత స్థాపనాచార్యునిగా వినుతికెక్కారు. ఆ మత మార్గాల్లోని సాత్వికతను వెలికి తీసి, వారి వారి సంప్రదాయాలకు అనుగుణంగా తమ దేవతలను ఆరాధించడానికి వీలుగా... పంచాయతన పూజను ఏర్పాటు చేశారు. దేశంలో ఆలయ వ్యవస్థను పటిష్టం చేసి, పూజావిధానాలను నిర్దేశించారు.



ఏం చెప్పారు?

శ్రీ శంకరులు ప్రతిపాదించిన సిద్ధాంతం అద్వైతం. అంటే రెండు కానిది. అంటే ఆత్మ, పరమాత్మ (బ్రహ్మం) వేరు కావు. ఇది అద్వైత సిద్ధాంతానికి పునాది. 'బ్రహ్మ సత్యం జగన్మిధ్య, జీవో బ్రహ్మైవ న పరః...' అంటే బ్రహ్మమే సత్యం. మనకు కనిపించే ఈ ప్రపంచం సమస్తం మిధ్య. జీవుడికి, దేవుడికి (బ్రహ్మనికి) భేదం లేదు. ఇదే బ్రహ్మ జ్ఞానం. ఈ జ్ఞానాన్ని పొందినవారు జీవన్ముక్తులు అవుతారు. శ్రీ ఆదిశంకరుల అద్వైతం భారతీయ తత్త్వ సిద్ధాంతాల్లో అత్యున్నతమైనది అనేది పండితుల అభిప్రాయం. దీన్నే 'మాయావాదం' అని కూడా అంటారు.

"జ్ఞానం అందరిదీ. అది రహస్యం కాకూడదు. దాన్ని పొందడానికి ఎలాంటి అంక్షలు, నిషేధాలు ఉండకూడదు" అని నినదించడమే కాదు, గురువు ఆదేశాన్ని ధిక్కరించి, లోకానికి అష్టాక్షరీ మంత్రాన్ని ఎలుగెత్తి ప్రకటించిన ఆధ్యాత్మిక విప్లవకారుడు శ్రీమద్రామానుజాచార్యులు. అచంచలమైన భక్తితో ఆరాధిస్తే ఎవరైనా ఆ భగవంతుడి అనుగ్రహాన్ని అందుకోవచ్చని స్పష్టం చేసిన శ్రీరామానుజులు... శ్రీవైష్ణవ ధర్మాన్ని కుల, లింగ భేదాలకు అతీతంగా రూపుదిద్దారు. "సకల జగత్తుకు కారకుడు భగవంతుడైన ఆ శ్రీమన్నారాయణుడు. ఆయన పట్ల భక్తిప్రపత్తులను కలిగి ఉండాలి. అప్పుడే పూర్వ, ప్రస్తుత కర్మల వల్ల కలిగిన సుఖదుఃఖాల నుంచి విముక్తి పొందగలం. దీనికి వైష్ణవ ధర్మానుసరణ దోహదం చేస్తుంది" అని ప్రవచించిన శ్రీమద్రామానుజాచార్యులది విశ్వమానవ సిద్ధాంతం. సమతను, మానవతను చాటిచెప్పిన ఆయన వెయ్యేళ్ళ క్రితమే కులమతాలకు అతీతంగా సహపంక్తి భోజనాలను ప్రోత్సహించారు. అతి గోప్యమైన తిరుమంత్రాన్ని సామాన్య ప్రజానీకానికి వెల్లడి చేశారు. ఎన్నో గ్రంథాలు రచించి, శ్రీ భాష్యకారులుగా ప్రసిద్ధి చెందారు.

సమతా స్ఫూర్తి

త్రిమతాచార్యుల్లో ముఖ్యుడైన శ్రీమద్రామానుజులు... కేశవాచార్యులు, కాంతిమతి దంపతులకు తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో జన్మించారు. చిన్న వయసులోనే జ్ఞానం కోసం అన్వేషించారు. తనకు తగిన గురువు తిరుగోష్టియూరులో ఉన్నారని తెలుసుకొని అక్కడికి చేరుకున్నారు. కానీ గురువు పదే పదే ఆయనకు పరీక్షలు పెట్టారు. కాలినడకన శ్రీరంగం నుంచి పద్దెనిమిది సార్లు తిరుగుతూనే ఉన్నారు. చివరకు గురువు ఆయనకు అష్టాక్షరీ మంత్రాన్ని బోధించి, దాని రహస్యాలను వెల్లడించారు. వేరే ప్రాంతం నుంచి వచ్చి... ఉపదేశం పొందిన శ్రీరామానుజుల గురించి ప్రజలకు తెలిసింది. "మాలాంటి వారి పరిస్థితి ఏమిటి? మాకు ముక్తి ఎలా లభిస్తుంది? అని వారు ఆయనను అడిగారు. 'దేవుడికి మానవులందరూ సమానమైనప్పుడు, అందరూ ఆ దేవదేవుణ్ణి ఆరాధిస్తున్నప్పుడు... తిరుమంత్రం రహస్యంగా ఎందుకు ఉండాలి?' అనే అంతర్మథనానికి రామానుజులు గురయ్యారు. వెంటనే అక్కడ ఉన్న ఆలయ గోపురాన్ని ఎక్కి, ప్రజలందరినీ పిలిచి... 'ఓం నమో నారాయణాయ' అనే ఆ మంత్రాన్ని ప్రకటించారు. దీనివల్ల గురువు ఆగ్రహానికి గురైనా లెక్క చేయలేదు. ఆ తరువాత ఆయన ప్రముఖ వైష్ణవ ఆలయాలను సందర్శించారు. జీర్ణస్థితిలో ఉన్నవాటిని పునరుద్ధరించారు. బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తులకు భాష్యాలు రాశారు. వాటితోపాటు ఆయన రాసిన గద్యాలు, ఇతర వేదాంత రచనలు శ్రీరామానుజ నవరత్నాలుగా ప్రఖ్యాతి చెందాయి. నూట ఇరవయ్యేళ్ళ పాటు పరిపూర్ణంగా జీవించిన ఆయన కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ పర్యటించి, వైష్ణవ సంప్రదాయానికి, తన విశిష్టాద్వైత సిద్ధాంతానికి ప్రాచుర్యం కల్పించారు.



ఏం చెప్పారు?


"ఆత్మ, పరమాత్మ వేరు వేరు. దేని స్వభావం దానిదే. కానీ ఆ రెండిటికీ విడదీయలేని సంబంధం ఉంది" అని శ్రీమద్రామానుజులు ప్రవచించారు. ఈ సిద్ధాంతమే విశిష్టాద్వైతంగా ప్రాచుర్యం పొందింది. "ప్రపంచం అనేది భ్రమ కాదు, ఆ పరమాత్ముడి సృష్టి. మోక్షాన్ని పొందడానికి భగవద్భక్తే ప్రధాన మార్గం. ఇది కేవలం ఉన్నతవర్గాలవారికో, పండితులకో పరిమితమైనది కాదు, కాకూడదు. అది అందరిదీ. విష్ణువుపై చిత్తాన్ని ఉంచి, నిర్మలమైన మనస్సుతో ఆరాధించేవారు ఎవరైనా వైష్ణవులే"నని శ్రీరామానుజ ఉవాచ.

ఈ యోగం గురించి ఆనాడే...

"ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు మాత్రమే మానవులు అత్యున్నతమైన ఆనంద స్థితికి చేరుకోగలరు. దీనికోసం తపస్సులు చేయనక్కరలేదు. ఉపవాసాలు ఉండనక్కర్లేదు. ఏ కులం, మతం, ప్రాంతం వారైనా, పురుషులైనా, స్త్రీలైనా దాన్ని సాధించవచ్చు" అని ప్రబోధించడమే కాదు... సహజయోగ ద్వారా దాన్ని ఆచరణాత్మకంగా నిరూపించారు శ్రీమాతాజీ నిర్మలాదేవి. కాగా, ఇటువంటి మార్గాన్ని మానవాళికి చూపించడానికి ఒక యోగి రాక గురించి, ఆ యోగం తాలూకు లక్షణాల గురించి పూర్వ గ్రంథాలలో ప్రస్తావన ఉండడం విశేషం. సప్త ఋషులలో ఒకరైన భృగు మహర్షిని జ్యోతిష శాస్త్రానికి ఆద్యుడిగా భావిస్తారు. ఆయన 'భృగు సంహిత' కన్నా ముందే గొప్ప నాడీ గ్రంథాన్ని (భృగు నాడి) రచించారు. పురాతన జ్యోతిష గ్రంథాల్లో నేటికీ దాన్ని ప్రామాణికమైనదిగా పరిగణిస్తారు. దీనిలో భవిష్యత్తులో జరగబోయే గొప్ప ఆధ్యాత్మిక సంఘటనలను కూడా అందులో వివరించారు. ఆ గ్రంథాన్ని మూడు వందల ఏళ్ళ క్రితం ఆచార్య శ్రీభుజేందర్ మరాఠీ భాషలో తర్జుమా చేశారు. అందులో ప్రస్తావితమైన భవిష్య వాణి ప్రకారం:

ఇప్పుడు అందరికీ సాధ్యమే...

బృహస్పతి మీనరాశిలో ఉన్నప్పుడు... పరబ్రహ్మ స్వరూపమైన ఒక గొప్ప యోగి భూమిపై అవతరిస్తారు. కొన్నేళ్ళ తరువాత... ఒక కొత్త యుగం ప్రారంభం అవుతున్నట్టు చాలామందికి స్పష్టంగా తెలుస్తుంది. మానవుడి జీవితం సంపూర్ణ పరివర్తనకు లోనవుతుంది. అలాంటి సమయం ఆసన్నమయ్యేవరకు... ఒక యోగి లేదా భక్తుడు మోక్షం ద్వారా లభించే ఆనందం పొందాలన్నా, జీవిత పరమార్థం తెలుసుకోవాలన్నా కేవలం భక్తి, జ్ఞానం, ప్రాచీన యోగమార్గాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే సాధ్యం. కానీ దానికోసం అతను తన సూక్ష్మ శరీరంలో నిద్రాణ స్థితిలో ఉన్న వివిధ చక్రాల శక్తులను మేలుకొలపడం కోసం, కుండలినీ శక్తి ఉద్దీపన కోసం తీవ్రమైన తపస్సు చేయవలసి ఉంటుంది. కానీ ఆ గొప్ప యోగి రూపొందించే సరికొత్త యోగ పద్ధతి ద్వారా మానవులు తమ జీవితకాలంలోనే మోక్షం తాలూకు ఆనందాన్ని పొందగలుగుతారు. దేనినీ త్యాగం చేయవలసిన అవసరం ఉండదు. అప్పటిదాకా గొప్ప గొప్ప యోగులు మాత్రమే... అదికూడా వారు సమాధి స్థితికి చేరుకొని, మరణించడానికి ముందు మాత్రమే ఈ బ్రహ్మానందాన్ని అనుభవించగలుగుతారు. కానీ ఈ కొత్త తరహా యోగం ద్వారా సమాధి స్థితిలోకి చేరకుండానే అది సాధ్యం అవుతుంది. ప్రారంభంలో ఈ యోగాన్ని, తద్వారా మోక్షాన్ని పొందడం లక్షల్లో ఒకరికి మాత్రమే సాధ్యం అవుతుంది. ఆ తరువాతి కాలంలో మానవ జాతి మొత్తానికి అది వ్యాప్తి చెందుతుంది. అప్పుడు ప్రజలు నిత్యావసరాలకు ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. వారు సాధారణ జీవితాలను గడుపుతూనే... ఈ యోగ పద్ధతి ద్వారా భగవంతుడితో ఐక్యతను అనుభూతి చెందుతారు. అజ్ఞానం, మాయ ముసుగులు తొలగిపోతాయి. గతంలో యోగులు చాలా కష్టపడి, తీవ్ర తపస్సు ఫలితంగా సాధించిన అనంతమైన ఆనందం, మోక్షం ఎంతోమంది మానవులకు సులభంగా అందుబాటులోకి వస్తుంది.


సహజయోగ

కొత్తదేం కాదు...

ఆ గ్రంథంలో పేర్కొన్న సమయం... నిర్మలాదేవి సహజయోగ పద్ధతిని ఆవిష్కరించిన సమయం దాదాపుగా సరిపోతున్నాయి. ఆమె భౌగోళికంగా భారతదేశానికి మధ్యలో ఉన్న చింద్వారా ప్రాంతంలో... పగలు, రాత్రి సమానంగా ఉండే విషువత్తు రోజున... 1923 మార్చి 21 మధ్యాహ్నం పన్నెండు గంటలకు జన్మించారు. 1970 మే 5వ తేదీన సహజ యోగ మార్గాన్ని ఆవిష్కరించారు. ఎలాంటి తపస్సులు, బాధలు, ఉపవాసాలు లేకుండా, అన్ని కోరికలను త్యజించాల్సిన అవసరం లేకుండా... దీని ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందవచ్చునని స్పష్టం చేశారు. కుండలినీ శక్తిని ఆమె ఉత్థానం చేయడాన్ని, ఆ శక్తి ఉత్థానం చెందినప్పుడు వివిధ చక్రాల వద్ద కలిగే ప్రతిస్పందించడాన్ని వేలాది మంది తిలకించారు. తరువాత ఎందరో ఈ మార్గంలోకి ప్రవేశించి, సహజయోగను ఆచరించడం మొదలుపెట్టారు. ఒకప్పుడు ఋషులు కఠోరమైన తపస్సు చేస్తే కాని సాధ్యం కాని కుండలినీ శక్తి జాగృతి... నేడు సాధారణ గృహస్థ జీవితం గడుపుతున్న సామాన్యులకు ఎలా సాధ్యమయిందనే ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ... "మానవాళి తమ పరిణామక్రమంలో అత్యున్నత స్థాయికి చేరుకొనే సమయం ఇప్పుడు ఆసన్నమయింది కాబట్టి. వారిలోపల ఉన్నదాన్నే నేను పరిచయం చేశాను. కొత్తగా ఏదీ వారికి ఇవ్వడం లేదు" అని చెప్పారు. ఈనాడు ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో సహజయోగులు ఉన్నారు. సహజయోగాపై పరిశోధనలు చేసినవారు పలు విశ్వవిద్యాలయాలు డాక్టరేట్లు ప్రదానం చేశాయి. ఢిల్లీ విశ్వవిద్యాలయం సహజయోగను ప్రత్యామ్నాయ వైద్యంగా గుర్తించింది. సహజయోగ సాధనలో ఉద్భవించే చైతన్య తరంగాల ద్వారా వ్యాధులను ముందే గుర్తించి, నయం చేసే పద్ధతులు కూడా అభివృద్ధి చెందుతున్నాయి.


డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సద్బోధ

నిజంగానే చిత్రం



ఒక మహారాజుకు తన పడకగది గోడపైన హిమాలయ శిఖరాల దృశ్యం ఉంటే బాగుంటుందని అనిపించింది. తక్షణం తన రాజ్యంలోని ప్రముఖ చిత్రకారుణ్ణి పిలిపించాడు. "నా పడక గది గోడ మీద హిమాలయ శిఖరాల ఆకృతిని చూడముచ్చటగా, రంగులతో తీర్చిదిద్దాలని కోరాడు. స్వయంగా తీసుకువెళ్ళి ఆ గోడను చూపించాడు. అప్పుడు ఆ చిత్రకారుడు మహారాజా! మీ ఆజ్ఞను శిరసావహిస్తాను. కానీ నాకు కొంత గడువు ఇవ్వండి. మా ఇంటి గోడ మీద ఆ చిత్రాన్ని సిద్ధం చేస్తాను. మీరు దాన్ని చూసి మార్పులు, చేర్పులు ఏవైనా సూచించండి. ఆ ప్రకారం మీ పడక గది గోడ మీద... సరైన రంగులను వినియోగించి ఆ దృశ్యాన్ని తీర్చిదిద్దుతాను" అన్నాడు. అందుకు రాజు అంగీకరించాడు. చిత్రకారుడికి కొంత డబ్బు ఇచ్చి పంపించాడు.

ఆ తరువాత రెండేళ్ళు దాటాయి, మూడేళ్ళు గడిచాయి. చిత్రకారుడి జాడ లేదు. ఆ చిత్రాన్ని గురించి ఆలోచనలు రాజును వెంటాడుతున్నాయి. ఒక రోజు చిత్రకారుడు రాజ భవనానికి వచ్చాడు. "మహారాజా! చిత్రాన్ని సిద్ధం చేశాను. తమరు మా ఇంటికి వచ్చి, ఆ చిత్రాన్ని చూడాలని విన్నవించుకుంటున్నాను" అన్నాడు. వెంటనే రాజు అతనితో బయలుదేరి వెళ్ళాడు. చిత్రకారుడి ఇంటి గోడ మీద ఉన్న చిత్రాన్ని పరిశీలించాడు. అద్భుతం! తను ఊహించినదానికన్నా ఎన్నో రెట్లు ఎక్కువ ఆకర్షణీయంగా ఉంది. గతంలో రాజు అనేకసార్లు హిమాలయాలకు వెళ్ళాడు. ఆ అందమైన పర్వత శిఖరాలను ప్రత్యక్షంగా చూసి పరవశించిపోయాడు. చిత్రకారుడు తీర్చిదిద్దిన ఆ చిత్రంలోని శిఖరాల అందం అతణ్ణి ఏకంగా ఉన్నత లోకాల్లోకి తీసుకుపోతోంది. రాజుకు నోట మాట రాలేదు. కొయ్యబొమ్మలా అలాగే నిలబడిపోయాడు. కొద్దిసేపటి తరువాత తేరుకొని, ఆ చిత్రకారుడితో "నేను ఎన్నోసార్లు హిమాలయాలకు వెళ్ళి వచ్చాను. కానీ ఆ పర్వతం చుట్టూ తిరుగుతూ, తిరుగుతూ పైకి వెళ్ళే ఈ బాట ఎక్కడా కనబడలేదే? ఈ ఆలోచన నీకు ఎలా తట్టింది? ఈ బాట ఎక్కడినుంచి ఎక్కడకు వెళుతుంది?" అని అడిగాడు.


అప్పుడు చిత్రకారుడు "ఏమో మహారాజా! నాకూ తెలీదు. చూసి వచ్చి చెబుతాను, ఉండండి" అని ఆ చిత్రపటంలోని బాట ఎక్కి నడిచి, పర్వత శిఖరానికి వెనుకగా వెళ్ళి అదృశ్యమైపోయాడు.

తావో మత గ్రంథాల్లో ఉన్న ఈ కథను ఓషో వివరిస్తూ "ఇది నమ్మశక్యం కాని వింతైన కథ. మార్మికమైన కథ. ఒక చిత్రపటంలోకి చిత్రకారుడు నడిచి వెళ్ళడం ఏమిటి? అదృశ్యుడై, తిరిగి రాకపోవడం ఏమిటి? ఇది కల్పిత కథే. కానీ నిగూఢమైన సత్యాన్ని తెలిపే కథ. ఒక చిత్రకారుడు తాను గీస్తున్న చిత్రంలో నిమగ్నమైతే... ఆ చిత్రానికి అందం వస్తుంది. ఒక కవి తను రాస్తున్న కవిత్వంలో పూర్తిగా లీనమైతే అది దివ్య గీతంగా భాసిస్తుంది. అప్పుడు వారికి తమ సృష్టి విషయంలో ఎలాంటి సందేహాలు ఉండవు. భక్తి విషయం కూడా అంతే. దేవుడి విషయం కూడా అంతే. భగవంతుడి భక్తిలో పూర్తిగా నిమగ్నమైనవారు, దేవుడికి సాధ్యం కానిది ఏదీ లేదని భావించేవారు... ఆ సర్వాంతర్యామితో అనుసంధానం అవుతారు. వారికి దేవుడి ఉనికి పట్ల ఎలాంటి అనుమానం ఉండదు. 'నేను' అనే భావన తొలగిపోతుంది. వారిలో దైవం ప్రకాశిస్తుంది" అని చెప్పారు.

- రాచమడుగు శ్రీనివాసులు

సుభాషితం

వివేకం కోల్పోతే...



ఆకాశంబుననుండి శంభుని శిరం
బందుండి శీతాద్రి సు
శ్లోకంబైన హిమాద్రినుండి భువి
భూలోకంబునందుండి య
స్తోకాంభోధి బయోధినుండి
పవనాంధోలోకముం జేరె గం
గాకూలంకష పెక్కుభంగులు వి
వేకభ్రష్ట సంపాతముల్

భర్తృహరి 'నీతి శతకం'లోని 'శిరః శార్వం స్వర్గాత్పశుపతి శిరస్తః క్షితిధరం...' అనే అనే శ్లోకాన్ని ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి పై పద్య రూపంలో అందించారు.


భావం: స్వర్గ లోకంలో ఉండే గంగానది ఆకాశం నుంచి పరమశివుడి శిరస్సుపైకి ఉరికింది. అక్కడి నుంచి హిమాలయాల మీదకు దూకింది. ఆ తరువాత భూమిపైకి చేరింది. సముద్రంలో కలిసింది. చివరకు పాతాళ లోకానికి జారింది. వివేకాన్ని కోల్పోయినవారి తీరు పలు విధాలుగా ఉంటుంది. వారికి ఇటువంటి ఇక్కట్లు తప్పవు. వారు అధఃపాతాళానికి దిగజారిపోతారు.

దైవమార్గం

ఆ నలుగురు

దైవ పుత్రుడైన ఏసు క్రీస్తు మానవుడిగా ఈ భూమిపై జన్మించాడు. మానవులతో మమేకమయ్యాడు. సామాన్యులకు అర్థమయ్యే భాషలో, ఉపమానాలతో కూడిన కథలతో వారికి బోధ చేశాడు. శిలువపై మరణించిన క్రీస్తు పునరుత్థానం చెందిన తరువాత... నలభై రోజుల పాటు భూమిపై ఉన్నాడు. తదుపరి కర్తవ్యంపై తన శిష్యులకు దిశా నిర్దేశం చేశాడు. తాను చెప్పినవాటిలో వారు నమ్మిన వాటిని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించాడు. క్షమాగుణంతో, ప్రేమతో మసలుకోవాలన్నాడు. తన బోధలు ప్రజలకు సువార్తలుగా చేరుకోవాలని, అవి దుఃఖంతో కలత చెందిన హృదయాలతో ఉన్న ప్రజలను మేలుకొలిపేలా, కష్ట సమయాల్లో తగినంత ఓదార్పు ఇచ్చేలా ఉండాలని సూచించాడు.

ఆ విధంగా ఆయన చెప్పిన సూక్తులను, బోధలను సువార్తలుగా గ్రంథస్థం చేసి, ప్రజలకు అందించిన మహనీయులు నలుగురు... మత్తయి, మార్కు, లూకా, యోహాన్. వారిని 'సౌవార్తికులు' అంటారు. వారు రాసిన సువార్తలు వారి పేరిటే (మత్తయి సువార్త, మార్కు సువార్త, లూకా సువార్త, యోహాను సువార్త) ప్రాచుర్యం పొందాయి. నూతన నిబంధన గ్రంథానికి ఆయువుపట్టు అయిన గ్రంథాలివి. క్రీస్తు జీవితాన్ని ఉన్నది ఉన్నట్టుగా వారు చిత్రీకరించారు. ఈ అదృష్టం దాదాపుగా క్రీస్తు శిష్యులకే దక్కడం విశేషం. కాగా. వీరితో పాటు పౌలు తదితరులు రాసిన లేఖలు, ఇతర శిష్యులు (అపోస్తలులు) చేసిన కార్యాలు కూడా ప్రముఖంగా కనిపిస్తాయి. ఏసు బోధలు, వాటిని అక్షరబద్ధం చేసిన గ్రంథాలు, ఏసు శిష్యులు సాగించిన సువార్తయాత్రలు ప్రజలకు దిక్సూచులు అయ్యాయి. ఆనాటి మూఢ నమ్మకాలు, మూఢాచారాలు తొలగి పోవడానికి సాయపడ్డాయి. వెలుగును చూడాలని తపనపడిన నాటి ప్రజలకు నాయకత్వం వహించాయి. వెన్నంటి తోడుగా నిలిచాయి.



- డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

అక్రమ నిర్మాణాలపై కఠినంగా ఉండండి

- రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఇవ్వొద్దు
- న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ, మే 1: అనుమతుల్లేని నిర్మాణాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు అన్ని న్యాయస్థానాలకు సూచించింది. అక్రమ కట్టడాలకు చట్టపరంగా రెగ్యులరైజ్ చేసే అవకాశం కల్పించవద్దని తెలిపింది. కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థిస్తూ బుధవారం జస్టిస్ జె.బి.పార్డీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం అక్రమ కట్టడాల విషయంలో కీలక వ్యాఖ్యలు చేసింది. అక్రమ కట్టడాలను రక్షించుకుంటూపోతే ఎలాంటి శిక్షలు పడవులే అన్న ధోరణి పెరిగిపోతుందని తెలిపింది. అందువల్ల తగిన అధికారి నుంచి సరైన అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టారా, లేదా అని చూడాల్సిన తప్పనిసరి బాధ్యత కోర్టులపై ఉందని పేర్కొంది. ఆ విధంగా చట్టబద్ధపాలనను బలపరచాల్సి ఉంటుందని తెలిపింది. చట్టమంటే గౌరవం లేని వారికి రెగ్యులరైజేషన్ చేయాలని కోరే హక్కు ఉండదని పేర్కొంది. అక్రమంగా నిర్మించిన రెండు అంతస్తులను కూల్చివేయాలని కోల్‌కతా మునిసిపాలిటీ నోటీసులు పంపించగా దాన్ని సవాలు చేస్తూ యజమానులు తొలుత హైకోర్టును ఆశ్రయించారు. అందుకు హైకోర్టు నిరాకరించడంతో సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. హైకోర్టు నిర్ణయాన్ని ధర్మాసనం సమర్థించడంతోపాటు 'ధైర్యం, నిబద్ధత'తో వ్యవహరించిందని ప్రశంసించింది. రెగ్యులరైజ్ చేయాలన్న వినతిని తిరస్కరించింది. కోర్టులు కూడా చట్టం ప్రకారమే వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపింది. అతిక్రమించే వారిపై ఎలాంటి సానుభూతి చూపాల్సిన పనిలేదని, క్షమించాల్సిన అవసరం లేదని పేర్కొంది. అక్రమ కట్టడాలను కూల్చి వేయాల్సిందేనని స్పష్టం చేసింది.



బెంచ్‌ల తీరు ఆందోళనకరం

- పొంతన లేని తీర్పులతో జూదరి క్రీడలా మారిన వ్యాజ్యాలు
- ఓ కేసులో కర్ణాటక హైకోర్టు తీరుపై సుప్రీం ఫైర్

న్యూఢిల్లీ, మే 1: ధర్మాసనాలు ఇస్తున్న పొంతనలేని, పరస్పర విరుద్ధ తీర్పులు న్యాయవ్యవస్థ పట్ల ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వాటి తీరుతో జూదరి క్రీడలా వ్యాజ్యం తయారైందని ఆందోళన వ్యక్తంచేసింది. నిర్ణయాల్లో బెంచ్‌ల అస్థిర వైఖరి కక్షదారులు తమకు అనుకూలంగా ఉండే కోర్టును ఎంచుకునే పరిస్థితిని (ఫోరమ్ షాపింగ్) తెచ్చిందని ఆక్షేపించింది. భర్తపై నమోదైన గృహహింస అభియోగాలను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు వెలువరించిన తీర్పుపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఘాటైన వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు తీర్పును రద్దు చేసింది. ఈ వ్యాజ్యాన్ని బాధిత భార్య సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. భర్త, అత్తామామలు తనపై గృహహింసకు పాల్పడ్డారంటూ ఆమె కేసు పెట్టగా, ఆకేసును రద్దు చేయాలంటూ నిందితులు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఒక బెంచ్ అత్తామామల పిటిషన్‌ను కొట్టివేయగా.. మరో బెంచ్ ఆమె భర్తకు ఊరట కల్పించింది. పూర్వ బెంచ్ తీర్పును పరిశీలించకుండానే అతనిపై మోపిన అభియోగాలను రద్దుచేసింది. దీనిపై భార్య సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల బెంచ్ విచారించింది. ఒకే కేసులో రెండు బెంచ్‌లు వేర్వేరు తీర్పులు, పొంతనలేని నిర్ణయాలు ఎలా వెలువరించాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తాజా ఘటనలో ఒక బెంచ్ తీర్పును మరో బెంచ్ కనీసం పరిశీలించలేదని, నిందితుడికి ఊరటను కల్పించడానికి కారణాలను తీర్పులో ప్రస్తావించలేదని జస్టిస్ బాగ్చీ తెలిపారు. బాధిత భార్య పిటిషన్‌ను అనుమతిస్తూ నిందితుడిపై తిరిగి క్రిమినల్ అభియోగాలు మోపి కేసు దర్యాప్తును కొనసాగించాలన్నారు.


ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్

- క్రియేట్ ఇన్ ఇండియా.. క్రియేట్ ఫర్ వరల్డ్
- వేవ్స్ సదస్సులో ప్రధాని మోదీ ఆకాంక్ష
- ముంబైలో అట్టహాసంగా వేవ్స్ ప్రారంభం
- వేవ్స్‌తో 'ఆరెంజ్ ఎకానమీ'కి నాంది: మోదీ
- భానుమతి, గురుదత్, సలీల్ స్టాంపుల విడుదల
- 400 కోట్లతో క్రియేటివ్ టెక్నాలజీ: అశ్వినీ వైష్ణవ్



ముంబై, మే 1: ప్రపంచ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్ మారనుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ముంబైలో నాలుగు రోజుల పాటు జరగనున్న వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్(వేవ్స్)ను ఆయన గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. సినీ నిర్మాణం, డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, సంగీతం, ప్రత్యక్ష సంగీత కచేరీలకు వేవ్స్ వేదికకానుంది. 100కు పైగా దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. వినోదరంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ సదస్సును ఏర్పాటు చేయగా.. బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ దిగ్గజాలు షారుఖ్‌ఖాన్, ఆమీర్‌ఖాన్, అక్షయ్‌కుమార్, హేమమాలిని, దీపిక పదుకొనే, అలియా భట్, రణ్‌బీర్ కపూర్, చిరంజీవి, నాగార్జున, రాజమౌళి, ఎంఎం కీరవాణి, శ్రీలీల, రజనీకాంత్, మోహన్‌లాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కీరవాణి స్వరకల్పనలో రుగ్వేదంలోని శ్లోకాలతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ గీతాన్ని శ్రేయాఘోషల్, చిత్ర, మంగ్లి, లిక్సిక ఆలపించారు. భానుమతి, గురుదత్, సలీల్ చౌదరిల శత జయంతి సందర్భంగా ఇదే వేదికపై వారి స్టాంపులను ప్రధాని ఆవిష్కరించారు. భానుమతి మనవరాలు మీనాక్షి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. భారత్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మారుతోందని, వేవ్స్ వల్ల ఆరెంజ్ ఎకానమీకి నాంది పడుతుందన్నారు. "సృజనాత్మకతకు కేంద్రంగా వేవ్స్ తయారై.. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి. 1913లో రాజా హరిశ్చంద్ర సినిమాతో మన దేశ ఘనత నలుదిశలకు వ్యాపించింది. ఇటీవల 50 దేశాల గాయకులు 'వైష్ణవ జనతో' గీతాన్ని ఆలపించారు. సృజన ఉన్న యువత దేశానికి అసలుసిసలు ఆస్తి. కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహిస్తాం. క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ వరల్డ్" అని పేర్కొన్నారు. "వేవ్స్ అనేది సంస్కృతి, సృజనల అనుసంధానం. సృజనను ప్రోత్సహించేందుకు త్వరలో 'వేవ్స్ అవార్డు'లను ప్రవేశపెడతాం" అన్నారు. ప్రధాని మోదీ పోరాటయోధుడని ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రశంసించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో వేవ్స్ కార్యక్రమాన్ని వాయిదా వేస్తారని కొందరు భావించారని చెప్పారు. కానీ ఈ కార్యక్రమం వాయిదా పడదని తాను గాఢంగా నమ్మానన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో వినోద రంగంలో భారత్ అగ్రగామిగా నిలుస్తుందని బాలీవుడ్ నటుడు షారుఖ్ అభిప్రాయపడ్డారు. కాగా ఐఐఎం,ఐఐటీల తరహాలో క్రియేటర్ల కోసం రూ.400 కోట్లతో ముంబైలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీని ప్రారంభిస్తామని కేంద్ర ఐటీ, సమాచారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. మహారాష్ట్ర ప్రభుత్వం దీనికి భూమిని ఇవ్వటానికి అంగీకరించిందన్నారు.





చిత్రజ్యోతి
SINCE 1965

ప్రపంచ ఆడియో వీడియో ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను గురువారం ప్రధాని మోదీ ముంబైలో ప్రారంభించారు. 100కు పైగా దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశాలు నాలుగో తేదీ వరకు జరుగుతాయి. వినోద రంగంలో మన దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు వేవ్స్‌ను ఒక వేదికగా ప్రభుత్వం తయారుచేసింది. ఈ కార్యక్రమంలో షారూక్‌ఖాన్, ఆమీర్‌ఖాన్, రజనీకాంత్, చిరంజీవి, మోహన్‌లాల్, నాగార్జున, అల్లు అర్జున్, అక్షయ్‌కుమార్, హేమమాలిని, దీపిక పదుకోణ్, ఆలియా భట్, రణ్‌బీర్ కపూర్, రాజమౌళి, కార్తీక్ ఆర్యన్, శ్రీలీల, రాజ్‌కుమార్‌రావు, కబీర్ బేడీ సహా అనేక మంది సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆస్కార్ విజేత కీరవాణి ప్రత్యేకంగా రూపొందించిన గీతంతో ప్రారంభమైంది. శ్రేయోఘోషల్, చిత్ర, మంగ్లీ, లిక్సిక ఆలపించారు. ఆ తరువాత ఈ ఏడాది శతజయంతి జరుపుకొంటున్న-గురుదత్, భానుమతి, సలీల్ చౌదరీ ల స్టాంపులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రధాని ఆవిష్కరించారు. భానుమతి మనమరాలు మీనాక్షి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోట్ల కథలు మనకున్నాయి

రాజమౌళి



వినోద రంగంలో ప్రపంచంలో అగ్రగామిగా ఎదిగే సామర్థ్యం మన దేశానికి ఉందని దర్శకుడు రాజమౌళి అభిప్రాయపడ్డారు. "మన దగ్గర కొన్ని కోట్ల కథలు ఉన్నాయి. వేల కళారూపాలు ఉన్నాయి. సంస్కృతి వైభవానికి సంబంధించిన విషయంలో ప్రపంచంలో ఏ దేశం మనతో పోటీ పడలేదు. అయినా అంతర్జాతీయంగా మనం అమెరికా, చైనా, ఉత్తర కొరియా, వంటి దేశాలతో పోటీ పడలేకపోతున్నాం. మన శక్తిపై నాకు ఎటువంటి అనుమానం లేదు. మనకు ఒక లాంచ్ ప్యాడ్ కావాలి. అది వేవ్స్ రూపంలో మనకు లభించింది" అని పేర్కొన్నారు.

కమల్‌హాసన్ నుంచి స్ఫూర్తిపొందా

-చిరంజీవి



అమితాబ్ బచ్చన్, మిథున్ చక్రవర్తి, కమల్ హాసన్ వంటి నటుల నుంచి తాను స్ఫూర్తి పొందానని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. గురువారం ముంబైలో జరిగిన వేవ్స్ కార్యక్రమం సందర్భంగా జరిగిన చర్చలో ఆయన మోహన్‌లాల్, హేమమాలినితో కలిసి పాల్గొన్నారు. దీనిని బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ నిర్వహించారు. "నేను సినిమా రంగంలోకి వచ్చే సరికి ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు వంటి అనేక మంది నటులు అగ్రస్థానాల్లో ఉన్నారు. 'నేను వాళ్లంతటి స్టార్‌ని అవుతానా?' అని అనుకుంటూ ఉండేవాడిని, వాళ్లను చూసి భయపడటం కన్నా- నేను వాళ్ల కన్నా అదనంగా ప్రేక్షకులకు 'ఏం అందించగలను?' అని ఆలోచించేవాడిని. 1977లో నేను ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకుంటున్నప్పుడు మిథున్ చక్రవర్తి నటించిన 'మృగయా' సినిమా విడుదలయింది. అందులో ఆయనకు ఎటువంటి మేకప్ లేదు. చాలా సహజమైన పాత్ర అది. ఆ సినిమా నాపై ప్రభావం చూపించింది. ఆ తర్వాత నేను ఎక్కువ మేకప్ వేసుకోవటం మానేశాను. మన చుట్టూ పక్కల ఉండే యువకుడిలా కనిపించాలనుకొనేవాడిని. అమితాబ్ బచ్చన్ వల్ల కూడా నేను స్ఫూర్తి పొందాను. ఆ సమయంలో ఫైట్స్ చిత్రీకరణలో డూప్‌లను పెట్టుకొనేవారు. కానీ షోలే సినిమా చూసిన తర్వాత - ఎంత కష్టమయినా నా ఫైట్స్ నేనే స్వయంగా చేయాలని నిర్ణయించుకున్నా. ఇక డ్యాన్స్ విషయానికి వస్తే- కమల్‌హాసన్ నా కన్నా కొద్దిగా సీనియర్. తనలా డ్యాన్స్ చేయాలని అనుకొనేవాడిని. ఇతరుల నుంచి స్ఫూర్తి పొందటం.. కష్టపడి పనిచేయటం.. కొత్తగా చేయాలనే తపనతోనే నా ప్రస్థానం సాగింది" అన్నారు.

చిరంజీవి ప్రభావం నాపై చాలా ఉంది

అల్లు అర్జున్



"'వేవ్స్' నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. చిన్నప్పటినుంచి నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. సినీ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు అధిగమించాను. నాకు సినిమా తప్ప మరో ప్రపంచం లేదు. ఎంతోమంది ఆదరాభిమాణాలతో ఈ స్థాయికి చేరుకున్నా. సాధించాల్సింది ఇంకా చాలా ఉంది" అని అల్లు అర్జున్ అన్నారు. వేవ్స్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "చిరంజీవిగారే నాకు స్ఫూర్తి. ఆయన ప్రభావం నాపై చాలా ఉంది. అట్లీతో నేను చేస్తున్న చిత్రం ఎంతో ప్రత్యేకంగా ఉండబోతోంది. ఆయన చెప్పిన కథ అద్భుతంగా ఉంది. భారీ హంగులతో ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచబోతోంది" అని తెలిపారు.

నిర్మాతగా ఈ సక్సెస్ నాకు ప్రత్యేకం

నాని



'నేనూ ప్రేక్షకుల్లో ఒకణ్ణే అని నమ్మిన ప్రతిసారీ మీరు మంచి విజయాలను అందించారు. 'హిట్ 3' అద్భుత విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ సినిమా పెద్ద హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. ఇది తెలుగు సినిమా విజయం. ఒక నిర్మాతగా కూడా ఈ సక్సెస్ నాకు చాలా ప్రత్యేకం. ఈ విజయం శైలేష్ విజన్‌కి టీజర్, ట్రైలర్ లాంటిది మాత్రమే. అతను మున్ముందు మరిన్ని గొప్ప సినిమాలు చేయగలడు' అని నాని అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'హిట్ 3' చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. మంచి టాక్‌తో కొనసాగుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. దర్శకుడు శైలేష్ కొలను మాట్లాడుతూ "హిట్ 3', సినిమాకు వచ్చిన స్పందన చాలా ఆనందాన్నిచ్చింది. నాని గారి నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను. యూనిట్ కష్టం వల్లే సినిమా ఇంత గొప్పగా వచ్చింది. ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "సూపర్ హిట్ లేకుండానే వేసవి సీజన్ ముగుస్తుందేమో అనుకున్నాను. ఇప్పుడు 'హిట్ 3' విజయంతో తెలుగు సినీ పరిశ్రమ మళ్లీ ఊపిరి తీసుకుంది' అని చెప్పారు.

ప్రేక్షకులను మెప్పించే కథతో



'దక్ష, మిస్టరీ, ఎందరో మహానుభావులు' లాంటి చిత్రాలతో పేరు తెచ్చుకున్న దర్శకుడు తల్లాడ సాయి కృష్ణ. ఆయన దర్శకత్వంలో మరో చిత్రం తెరకెక్కుతోంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ శ్రీ అన్నపూర్ణ క్రియేషన్స్ ప్రకటించింది. తల్లాడ సాయికృష్ణ మాట్లాడుతూ 'నిత్యజీవితంలో తారసిల్లే జీవితాల్ని, వాటి తాలూకు భావోద్వేగాల్ని ఆవిష్కరిస్తుందీ సినిమా. ప్రేక్షకులు కోరుకుంటున్న అంశాలతో కథను సిద్ధం చేసేందుకు చాలా సమయం పట్టింది. అగ్రతారలతో ఈ సినిమా ఉండబోతోంది' అని చెప్పారు.




ఈసారి దేత్తడి

రౌడీ బాయ్స్, లవ్ మీ చిత్రాలతో హీరోగా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు ఆశిష్. ఆదిత్యరావు గంగసాని దర్శకత్వంలో ఆయన హీరోగా ఓ చిత్రం (ఎస్‌వీసీ 60-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రుతమ్ స్టోరీ ల్యాబ్‌తో కలసి దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. గురువారం ఆశిష్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. 'దేత్తడి' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. హైదరాబాద్ నేపథ్యంలో కథ సాగుతుంది. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో డప్పు వాద్యకారుడి గెటప్‌లో ఆశిష్ కనిపించారు.

అప్పులు తీర్చడానికే నటుడినయ్యా

అజిత్‌కుమార్



తమిళ హీరో అజిత్‌కుమార్ ఇటీవలే న్యూఢిల్లీలో పద్మభూషణ్ పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో.. సినిమాల్లోకి యాక్టర్‌గా రావడం వెనుకున్న పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. "అసలు నాకు సినిమాల్లోకి రావాలనే ఉద్దేశం ఏనాడూ లేదు. అనుకోకుండా యాక్టర్ అయ్యా. మొదట్లో నా నటన ఘోరంగా ఉండేది. కెరీర్ తొలినాళ్లలో నేను చేసిన సినిమాలకు వేరేవారు డబ్బింగ్ చెప్పేవారు. ఆ తర్వాత కఠోర సాధనతో నన్ను నేను చాలా మెరుగుపరుచుకున్నా. ఇప్పటికీ కొందరు మిమిక్రీ ఆర్టిస్టులు మొదట్లో నేను చేసిన పేలవ నటన ఆధారంగా మిమిక్రీ చేస్తుంటారు. నిజానికి నాకు రేసర్ కావాలనే ఆశ ఉండేది. రేసింగ్ కోసం డబ్బులు సమకూర్చుకునే పనిలో మోడలింగ్ అవకాశం వచ్చింది. ఆ క్రమంలోనే సినిమా అవకాశాలూ వచ్చాయి. ఎవరైనా ఏదైనా అడిగితే నిజాయితీగా సమాధానం చెప్పేవాడ్ని. అప్పట్లో ఓ విలేకరి 'మీరు యాక్టింగ్‌ను ఎందుకు ఎంచుకున్నారు' అని అడిగారు. 'వ్యాపారంలో నష్టం వచ్చింది. నాకున్న అప్పులు తీర్చడానికి ఇండస్ట్రీలోకి వచ్చా' అని తడుముకోకుండా చెప్పేశా".

వారికి ఎస్సీ హోదా వర్తించదు

- క్రైస్తవంలోకి మారగానే దానిని కోల్పోతారు
- ఫిర్యాదుదారు పాస్టరు.. ఆయన ఫిర్యాదు చెల్లదు
- స్పష్టం చేసిన హైకోర్టు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీలు క్రైస్తవంలోకి మారిన తక్షణమే ఆ హోదా కోల్పోతారని, వారు ఎస్సీ,ఎస్టీ చట్టంలోని నిబంధనల కింద రక్షణ పొందలేరని హైకోర్టు స్పష్టం చేసింది. క్రైస్తవ మతానికి కుల వ్యవస్థ దూరమని పేర్కొంది. చర్చిలో పాస్టర్‌గా సేవలు అందిస్తున్న వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పిటిషనర్లపై పోలీసులు ఎస్సీ ఎస్టీ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేయడాన్ని తప్పుపట్టింది. ప్రస్తుత కేసులో ఫిర్యాదుదారు క్రైస్తవ మతంలోకి మారి గత పదేళ్లుగా తాను పాస్టర్‌గా సేవలు అందిస్తున్నట్లు స్వయంగా పేర్కొన్నారని గుర్తు చేసింది. అధికారులు కులధ్రువీకరణపత్రం ఇచ్చారనే కారణం చూపి మతం మారిన ఫిర్యాదుదారు ఆ చట్టం కింద రక్షణ పొందలేరని తెలిపింది. ఫిర్యాదుదారు చట్టాన్ని దుర్వినియోగం చేశారని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో పిటిషనర్ల పై ఎస్సీఎస్టీ చట్టంలోని నిబంధనల కింద కేసు నమోదు చేయడం చట్టవిరుద్ధమని ప్రకటించింది. గుంటూరు ఎస్సీ ఎస్టీ కోర్టులో వారిపై ఉన్న కేసును కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఇటీవల తీర్పు ఇచ్చారు. తనను కులం పేరుతో దూషించారని పేర్కొంటూ ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం మండలం కొత్త పాలేనికి చెందిన పాస్టర్ చింతాడ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అదే గ్రామానికి చెందిన అక్కల రామిరెడ్డి సహా ఆరుగురిపై చందోలు పోలీసులు 2021 జనవరి 26న ఎస్సీఎస్టీచట్టంతో పాటు పలు ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తి చేసి సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. దీంతో రామిరెడ్డి, ఇతర నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకురాగా, పిటిషనర్ల తరఫున న్యాయవాది జేవీ ఫణిదత్ వాదనలు వినిపించారు. రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ కాస్ట్ ఆర్డర్ 1950 ప్రకారం హిందూమతాన్ని పక్కనపెట్టి ఇతర మతాలను స్వీకరించినవారికి ఎస్సీ హోదా వర్తించదని పేర్కొన్నారు.

రెండో ఉచిత సిలిండర్ సబ్సిడీ విడుదల

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): 'దీపం-2' పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రెండో ఉచిత గ్యాస్ సిలిండరును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.867 కోట్ల నిధులను విడుదల చేసింది. ఏప్రిల్ నుంచి జూలై మధ్యకాలంలో అందించే ఈ రెండో ఉచిత సిలిండర్‌కు సంబంధించిన సబ్సిడీ నిధులను రాష్ట్ర ఆర్థిక శాఖ సంబంధిత సంక్షేమ శాఖల (కార్పొరేషన్లు)కు కేటాయించింది. ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.16,330 లక్షలు, ఎస్టీ కార్పొరేషన్‌కు రూ.3,870 లక్షలు, బీసీ సంక్షేమ శాఖకు రూ.46,522 లక్షలు, ఈడబ్ల్యూఎస్ విభాగానికి 14,582 లక్షలు, మైనారిటీ సంక్షేమ శాఖకు 5,396 లక్షలు చొప్పున కేటాయించింది. ఈ బడ్జెట్ వినియోగంపై తగిన మార్గదర్శకాలను సూచిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

చీఫ్ విజిలెన్స్ అధికారిగా రంగకుమారి

పౌరసరఫరాల శాఖ చీఫ్ విజిలెన్స్ అధికారిగా కె.రంగకుమారిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె చాలాకాలంగా కమిషన్ కార్యాలయంలో అదనపు డైరెక్టరుగా సేవలందిస్తున్నారు.

పారిశ్రామికీకరణతోనే రాష్ట్రాభివృద్ధి



ఆత్మకూరులోని నెల్లూరుపాళెం వద్ద కార్మికులతో మాట్లాడుతూ పార పట్టుకుని కంకర రాళ్లు ఎత్తుతున్న చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కోసమే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని, పార్టీ జెండాలోని గుర్తులు కూడా వారినే సూచిస్తాయని వివరించారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో గురువారం ఆయన పర్యటించారు. 'పేదల సేవలో ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నెల్లూరుపాలెం గిరిజన కాలనీలో సామాజిక పింఛన్లను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. అక్కడి గిరిజనులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నారంపేట వద్ద ఇండస్ట్రియల్ పార్కును ప్రారంభించారు. అక్కడినుంచే రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకున్న 11 ఎంఎస్ఎంఈ పార్కులకు ప్రారంభోత్సవాలతోపాటు మరో 39 పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. ప్రజా వేదిక సాక్షిగా ఒక మార్గదర్శిని, ఒక బంగారు కుటుంబాన్ని అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ, ముందుగా కార్మిక లోకానికి 'మే డే' శుభాకాంక్షలు తెలిపారు. 'రాష్ట్రంలో 88శాతం మంది అసంఘటిత కార్మికులు ఉన్నారు. వారిలో 67శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వచ్చేదారిలో భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడాను. వీరందరినీ ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిది' అని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఇసుక దొరక్క కార్మికులు ఉపాధి కోల్పోయారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి ఆదాయం కంటే కార్మికుల సంక్షేమమే ముఖ్యమని, అందుకే ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చామని స్పష్టం చేశారు. కార్మికుల కోసం గుంటూరు, శ్రీసిటీల్లో 100 పడకల ఆసుపత్రి, కర్నూలులో 30 పడకల ఆసుపత్రులను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఇంకా ఏం చెప్పారంటే..

175 నియోజకవర్గాల్లోనూ...

పారిశ్రామికీకరణతోనే రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే మా లక్ష్యం. అందుకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఎంస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఒక్క నారంపేట పార్కులోనే రూ.250కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయి. తద్వారా 2,500 మంది ఉపాధి లభిస్తుంది. మొత్తం 20లక్షల మందికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో సాగుతున్నాం. ప్రభుత్వంపై విశ్వాసంతో పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. భవిష్యత్ ఏఐ రంగానిది. టాటా సంస్థ సహకారంతో విశాఖ, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురం ప్రాంతాల్లో డేటా హబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. యువత ఆలోచనల్లో మార్పు రావాలి. పరిశ్రమలు పెట్టి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్లగ్ అండ్ ప్లే విధానం తీసుకొస్తున్నాం. ఇక్కడ షెడ్లు, విద్యుత్, నీటి వసతి కల్పిస్తాం. మార్కెటింగ్ కూడా ప్రభుత్వమే గైడ్ చేస్తుంది. ఆసక్తి ఉన్నవారు నేరుగా వచ్చి పరిశ్రమ స్థాపించుకోవచ్చు. పరిశ్రమల స్థాపనకు స్థానిక ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి. అప్పుడే ప్రజలు మళ్లీ ఓట్లు వేస్తారు. రైతులను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే మా లక్ష్యం. రైతులే వారి భూములను ఇండస్ట్రియల్ పార్కులుగా మార్చుకోవచ్చు. పదెకరాల్లోపు అయితే నానో పార్కు, 10-100 ఎకరాల్లోపు అయితే ఎంఎస్ఎంఈ పార్కు, 100 ఎకరాలపైన అయితే మేజర్ పార్కు ఏర్పాటు చేసుకోవచ్చు. అందుకు అవసరమైన అన్ని సహకారాలతో పాటు నిధులు కూడా అందిస్తాం. తద్వారా వచ్చే ఆదాయాన్ని మాత్రం రైతులే తీసుకోవచ్చు. అభివృద్ధిని సహించలేని వ్యక్తులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలంతా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఏ రాష్ట్రంలోనూ లేనంతగా 84లక్షల పింఛన్లు ఇస్తున్నాం. ఏటా రూ.33,100 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ప్రతిపక్షాలైనా సరే ఇది నిజం కాదని చెబుతాయా..? సవాల్ విసురుతున్నా. జూన్ నుంచి కొత్త పింఛన్లు ఇస్తాం. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం. రైతులకు కేంద్రం ఏటా మూడు విడతల్లో రూ.6 వేలు ఇస్తోంది. మేము మిగిలిన రూ.14 వేలను మూడు విడతల్లో అందిస్తాం. తల్లికి వందనం మీద అపోహలొద్దు. ప్రతీ బిడ్డకూ రూ.15వేల చొప్పున తల్లులకు అందిస్తాం. కోత ఉండదు. మెగా డీఎస్సీ పూర్తిచేసి బడులు తెరిచేలోపు టీచర్ల భర్తీ పూర్తి చేస్తాం.

మార్గదర్శులు ముందుకు రావాలి

పేదలను వృద్ధిలోకి తెచ్చేందుకు 'మార్గదర్శి-బంగారు కుటుంబం' అనే ఉన్నత ఆలోచనను అమల్లోకి తీసుకొచ్చాం. గతంలో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా పిలుపునిచ్చినప్పుడు అనేక మంది ముందుకొచ్చారు. ఇప్పుడు కూడా మార్గదర్శులు ముందుకు రావాలి. రాష్ట్రంలో 35 లక్షల బంగారు కుటుంబాలను ఎంపిక చేశాం. వారికి మార్గదర్శులుగా ఉండేందుకు 5-10 లక్షల కుటుంబాలను ఎంపిక చేస్తున్నాం.

ఏ ఆధారమూ లేదు: జ్ఞానమ్మ

నా పేరు జ్ఞానమ్మ. మాది మర్రిపాడు మండలం. మేము యానాదులం. నాకు నలుగురు పిల్లలు. నా భర్త పనికి వెళ్తేనే మా కుటుంబానికి తిండి ఉంటుంది. లేకపోతే ఇంటింటికి వెళ్లి అడుక్కోవాలి. మాకు సొంత ఇల్లు లేదు. ఏ ఆధారమూ లేదు. ఎవరైనా అప్పు అడిగితే తిరిగి ఎలా కడతారని ప్రశ్నిస్తున్నారు. చాలాకాలం నుంచి ఊరిని కనిపెట్టుకొని ఉన్నాం. నా బిడ్డలను బాగా చదివించుకోవాలని ఉంది.



ఆత్మకూరులోని గిరిజనకాలనీలో సుశ్మిత అనే యువతికి వితంతు పెన్షన్ ఇస్తున్న సీఎం

స్థలం ఇప్పించి.. ఇల్లు కట్టిస్తా..: సీఎం చంద్రబాబు

ఈ కుటుంబాన్ని చూస్తే బాధేస్తోంది. ఈ నలుగురు పిల్లలను ఆస్తిగా భావించి వారిని చదివిస్తే ఆ కుటుంబం పేదరికం నుంచి బయటపడుతుంది. జ్ఞానమ్మ కుటుంబానికి స్థలం ఇప్పించి ఇల్లు కట్టిస్తా. కరెంటు, గ్యాస్ కూడా ఇస్తా. నలుగురు పిల్లలపై రూ.లక్ష చొప్పున డిపాజిట్ చేస్తా. జ్ఞానమ్మ, ఆమె భర్తకు పని కల్పిస్తాం. మార్గదర్శి కూడా వారి పిల్లల మాదిరిగానే ఈ నలుగురు పిల్లలనూ పైకి తీసుకురావాలి.

ఈ కుటుంబానికి మార్గదర్శిగా ఉంటా: నాగేశ్వరరావు

నా పేరు నాగేశ్వరరావు. మాది మర్రిపాడు. చంద్రబాబు విజనరీ ఆలోచనలతో ఎదిగిన నేను.. జ్ఞానమ్మ కుటుంబానికి మార్గదర్శిగా నిలుస్తాను. ఆ కుటుంబానికి ప్రస్తుతం భరోసా కావాలి. ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చేస్తా. ఆ కుటుంబంలోని నలుగురు పిల్లలను చదివిస్తా. ఇంకా వారికి ఏమేం అవసరమో అన్నీ చేస్తా.



మే డే సందర్భంగా రిక్షా కార్మికులతో కలిసి రిక్షా తొక్కుతున్న మంత్రి నిమ్మల

నియోజకవర్గానికి నేనే పెద్ద కూలీని!

- పాలకొల్లులో మేడే వేడుకల్లో రిక్షా తొక్కిన మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, మే1(ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవం సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో గురువారం కార్మిక సంఘాలు, పలు పార్టీలు మేడే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాయి. టీఎన్‌టీయూసీ కార్యక్రమంలో కార్మికులతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు సుమారు 4 కిమీ రిక్షా తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి పెద్ద కూలీని తానేనన్నారు. గాంధీ బొమ్మల సెంటర్‌లో సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తన కార్యాలయం వద్ద కార్మికులు, జట్టు, మిల్లు, హమాలీలు, రిక్షా కార్మికులకు నూతన వస్త్రాలు అందజేసి, భోజనాలు ఏర్పాటు చేశారు.

కులగణన చారిత్రక అవసరం: జస్టిస్ ఎన్‌వీ రమణ

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చారిత్రక అవసరమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ పేర్కొన్నారు. కులగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై గురువారం ఒక ప్రకటనలో ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. కులం, కులం ఆధారిత వివక్ష ఒక కఠినమైన వాస్తవమని, చాలా కాలంపాటు మనం ఈ వాస్తవాన్ని అంగీకరించకుండా విస్మరించడానికే ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఇప్పుడు చైతన్యంతో ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. కులాన్ని ఒక గుర్తింపుగా తీసుకొని జనగణనలో కులగణన నిర్వహించడం సరైన దిశలో వేసిన సాహసోపేతమైన అడుగు అని అభివర్ణించారు. సమాజంలోని అన్ని వర్గాలకు అధికారంలో, ఆర్థికాభివృద్ధిలో తగిన వాటా లభించేలా చేయడంలో కులగణన తోడ్పడుతుందన్నారు. జనగణనలో ప్రతి సామాజిక సూచికను పరిగణనలోకి తీసుకోవాలని, ఇది సామూహిక ప్రయోజనాన్ని లక్ష్యంగా చేసుకున్న సమగ్ర వినియోగ ప్రక్రియగా మారాలని ఆకాంక్షించారు.

పన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో సీఆర్‌యూ నోటిఫై

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించే రిజిస్ట్రేషన్ ప్రక్రియను కేంద్రీకృతం చేస్తూ ఏర్పాటు చేసిన సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ (సీఆర్‌యూ)ను నోటిఫై చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. గుంటూరు జిల్లా కుంచనపల్లిలోని వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ కార్యాలయంలో రాష్ట్రస్థాయిలో సీఆర్‌యూను ఏర్పాటు చేసింది. దీని కార్యకలాపాలు గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యాయి. పన్ను నిర్వహణలో సమర్థత, ప్రభావవంతమైన పనితీరు కనిపిస్తుండటంతో ఈ సీఆర్‌యూను కొనసాగించే అంశాన్ని పరిశీలించాలని ప్రధాన కమిషనర్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. నిశితంగా పరిశీలించిన సర్కారు దానిని నోటిఫై చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

కసిరెడ్డికి 'సిట్' కస్టడీ

విజయవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (రాజ్ కసిరెడ్డి)కి న్యాయస్థానం షాక్ ఇచ్చింది. ఆయన్ను వారం రోజులపాటు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కస్టడీకి ఇస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారణకు అనుమతించింది. సిట్ అధికారులు శుక్రవారం ఉదయం రాజ్ కసిరెడ్డిని జైలు నుంచి కస్టడీకి తీసుకుంటారు. ఏడు రోజులు ప్రశ్నించనున్నారు. మరోవైపు.. లిక్కర్ కేసులో అరెస్టయి విజయవాడ జిల్లా జైలులో ఉన్న కసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి తమకు 'బి' క్లాస్ సెల్ ఇవ్వాలని గురువారం కోర్టులో మెమో దాఖలు చేశారు. అదేవిధంగా ఇంటి నుంచి భోజనాన్ని కూడా అనుమతించాలని కోరారు. దీనిపై విచారణను న్యాయాధికారి పి.భాస్కరరావు శుక్రవారానికి వాయిదా వేశారు.

యానిమేషన్ సంస్థ నిర్వాహకుడి ఐపీ

- బాధితుల్లో అత్యధికులు నరసరావుపేటవాసులే

నరసరావుపేట, మే 1(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీల ఆశచూపి భారీగా పెట్టుబడులు సేకరించిన యూపిక్స్ క్రియేషన్స్ యానిమేషన్ సంస్థ నిర్వాహకుడు నిడుమోలు వెంకట సత్య లక్ష్మీకిరణ్ కోర్టులో దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశారు. బాధితుల్లో ఎక్కువమంది పల్నాడు జిల్లా నరసరావుపేట వాసులే ఉన్నారు. విజయవాడకు చెందిన లక్ష్మీకిరణ్.. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ కోర్టులో ఐపీ దాఖలు చేశారు. 2014లో యూపిక్స్ క్రియేషన్స్‌ను ఏర్పాటు చేసి రూ.155.95 కోట్ల పెట్టుబడులు సేకరించినట్లు ఐపీలో పేర్కొన్నారు. 102 మంది బాధితుల జాబితాను కూడా కోర్టుకు సమర్పించారు. రూ.2.72 కోట్లు మాత్రమే ఆస్తులు ఉన్నట్లుగా పేర్కొన్నారు. అయితే రూ.400 కోట్లకుపైగా వసూలు చేసి, ఐపీలో రూ.155.95 కోట్లు మాత్రమే చూపుతున్నాడని బాధితులు వాపోతున్నారు. ఇదే సంస్థలో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తి ఇటీవల మృతి చెందారు. విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల వారు కూడా బాధితులుగా ఉన్నారు. నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తి రూ.15 కోట్లు, వ్యాపారి రూ.15.50 కోట్లు, ఇంకో వ్యక్తి రూ.5 కోట్లు, మరొకరు రూ.18 కోట్లు, ఇంకొకరు రూ.12 కోట్లు, మరికొందరు కోటి నుంచి 4 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారు. లక్ష్మీకిరణ్ ఓ పథకం ప్రకారం మూడేళ్లలో రూ.400 కోట్ల పెట్టుబడులు సేకరించాడని, ఐపీలో మాత్రం రూ.155.95 కోట్ల అప్పులే చూపాడని, మిగతా సొమ్మును ప్రస్తావించలేదని బాధితులు అంటున్నారు. ఇటీవల లక్ష్మీకిరణ్ బోర్డు తిప్పేయడంతో కొంతైనా సొమ్ము తిరిగి వస్తుందని ఇప్పటి వరకు ఆశతో ఉన్నారు. ఇప్పుడు ఐపీ వేయడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. అప్పులు చేసి ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టిన ఇద్దరు వ్యాపారులు తమ ఆస్తులను విక్రయించి ఆ బాకీలు తీరుస్తున్నట్లు తెలిసింది.

వదిన చెబితేనే చేశా..

(మొదటి పేజీ తరువాయి)

విడదల వేణుగోపీనాథ్ అలియాస్ గోపి వెల్లడించినట్లు తెలిసింది. ఇబ్బంది లేకుండా వ్యాపారం చేసుకోవాలంటే అడిగింది ఇవ్వండి.. లేదంటే భారీ జరిమానా చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించినట్లు కూడా తెలిపారు. భారీ ఫైన్ వేస్తామని తనను బెదిరించి రూ.2.2 కోట్లు వసూలు చేశారని విడదల రజని, ఆమె మరిది విడదల గోపి, పీఏ రామకృష్ణ, ఐపీఎస్ అధికారి పల్లె జాషువాపై చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడు మండలం విశ్వనాథుని కండ్రిగలో ఉన్న లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమాని నల్లపనేని చలపతిరావు ఫిర్యాదుతో వారిపై ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ బాగోతంలో కీలక పాత్ర పోషించిన గోపి(ఏ-3)ని ఏసీబీ అధికారులు ఇటీవల హైదరాబాద్‌లో అరెస్టు చేయగా.. విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్‌కు పంపింది. అనంతరం మూడ్రోజులు కస్టడీలో విచారించేందుకు అనుమతించింది ఏసీబీ అధికారులు గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. ఉదయం తనకేమీ తెలియదన్న గోపి.. అధికారులు ఆధారాలు ముందుపెట్టడంతో నోరు విప్పారు. వదిన చెప్పడంతోనే స్టోన్ క్రషర్ యజమానికి ఫోను చేసినట్లు అంగీకరించారని తెలిసింది. మరో రెండ్రోజులు ఆయన్ను ప్రశ్నించనున్నారు.

రాజ్ సహాయకుడు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

సహాయకుల్లో ఒకరైన పైలా దిలీప్‌ను గురువారం చెన్నై విమానాశ్రయంలో సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. డిస్టిలరీస్ యజమానుల నుంచి నగదు తీసుకుని రాజ్ కసిరెడ్డి చెప్పిన చోటుకు చేర్చిన క్యాష్ హ్యాండ్లర్స్‌లో దిలీప్ కీలంగా వ్యవహరించినట్లు గుర్తించారు. ఇటీవలే కసిరెడ్డిని అరెస్టు చేసి విజయవాడ జైలుకు పంపిన సంగతి తెలిసిందే. రాజ్ కసిరెడ్డి రిమాండ్ రిపోర్టులో మద్యం పాలసీ రూపకల్పన మొదలు వసూళ్ల వరకూ ఎవరెవరి పాత్ర ఏమిటో కోర్టుకు వివరించింది. రాజ్ తోడల్లుడు ముప్పిడి అవినాశ్‌రెడ్డి అలియాస్ సుమిత్, మరో సన్నిహితుడు చాణక్య, దిలీప్ పేరు కూడా అందులో ప్రస్తావించింది. రాజ్ కూడా చెన్నై నుంచి విదేశాలకు పారిపోయేందుకు పథకం రూపొందించుకున్న విషయం బయట పడింది. ఆయనను హైదరాబాద్‌లోనే పోలీసులు పట్టేసుకున్నారు. ఈ క్రమంలో చెన్నైలో రాజ్ కోసం పనిచేస్తున్న వ్యక్తుల గురించి ఆరా తీయగా ఆయన వ్యక్తిగత సహాయకుడు దిలీప్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి ఆయన మొబైల్ ఫోన్లపై నిఘా పెట్టిన సిట్ అధికారులు లుక్ ఔట్ సర్క్యులర్ సైతం జారీ చేశారు. విచారణకు రావాలని నోటీసు ఇచ్చారు. దీంతో తనను సిట్ అధికారులు అరెస్టు చేస్తారని ఆయన భయపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో నిఘా ఉంటుందని.. చెన్నై నుంచి టికెట్ బుక్ చేసుకుని దుబాయ్ చెక్కేసేందుకు యత్నించారు. కానీ లుక్ ఔట్ సర్క్యులర్ జారీ అయిందని తెలియక... నేరుగా బోనులో పడ్డారు.

దిలీప్ పాత్ర ఏంటి?

దేశంలోనే అతిపెద్ద లిక్కర్ కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ రాజ్ అయితే ఆయన ఏర్పాటు చేసుకున్న ఏడంచెల వ్యవస్థలో దిలీప్ ఒకరు. మద్యం కంపెనీల నుంచి నగదు వసూలు చేసేందుకు చాణక్య, ఖురేషి, సైఫ్, దిలీప్, సందీప్, చిష్టిలను సహాయకులుగా నియవించుకున్నారు! వీరు ప్రధాన క్యాష్ హ్యాండ్లర్లుగా వ్యవహరించారు. కసిరెడ్డి ఇచ్చిన ఫోన్లు, నంబర్లు వాడుతూ డిస్టిలరీస్ యజమానులకు ఫోన్లు చేసి... ప్రతిసారీ ఒక కొత్త చోటుకు రమ్మని చెప్పేవారు. డబ్బులు చేతికి అందగానే ఫోన్ నంబరు కూడా మార్చేవారు. దిలీప్ ఎక్కువసార్లు హైదరాబాద్‌లోని నానక్‌రామ్ గూడ, జూబ్లీ హిల్స్ ప్రాంతాల్లోనే నగదు తీసుకుని చాణక్య చెప్పిన చోటుకు చేర్చి ఆ విషయాన్ని రాజ్ కసిరెడ్డికి వివరించే వారు. స్కామ్‌లో అరెస్టయిన వారి సంఖ్య ఇప్పటికి నాలుగుకు చేరింది. కీలక నిందితుడైన రాజ్ కసిరెడ్డి(ఏ1), సజ్జల శ్రీధర్ రెడ్డి(ఏ6), చాణక్య(ఏ8) ఇప్పటికే విజయవాడ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. తాజాగా అరెస్టైన దిలీప్‌ను శుక్రవారం సిట్ అధికారులు కోర్టులో ప్రవేశపెట్టబోతున్నారు. ఇప్పటి వరకూ 27మంది నిందితుల జాబితా బయట పెట్టిన దర్యాప్తు బృందం దిలీప్ పేరు నిందితుల జాబితాలో చూపించలేదు. అయితే విచారణకు రావాల్సిందిగా నోటీసు ఇచ్చినప్పటి నుంచి ఆయన ఫోన్ స్విచ్చాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయనను కస్టడీకి తీసుకుని కమీషన్ల వివరాలు రాబట్టే అవకాశముంది.

రిమాండ్ ఉత్తర్వులు కొట్టేయండి

- హైకోర్టులో ఐపీఎస్ పీఎస్సార్ పిటిషన్
- కౌంటర్‌కు సమయం కోరిన ప్రాసిక్యూషన్



అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో తనపై సీఐడీ కోర్టు ఇచ్చిన రిమాండ్ ఉత్తర్వులను కొట్టివేయాలని సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు హైకోర్టును కోరారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. ఆయన తరపున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసు పెండింగ్‌లో ఉండగా.. జెత్వానీ ఫిర్యాదుతో కేసు పెట్టడానికి వీల్లేదన్నారు. విచారణకు రావాలని పోలీసులిచ్చిన నోటీసులకు స్పందించలేదనే కారణంతో పిటిషనర్‌కు ట్రయల్ కోర్టు రిమాండ్ విధించిందని.. వ్యక్తిగత స్వేచ్ఛతో ముడిపడి ఉన్నందున వ్యాజ్యంపై సాధ్యమైనంత త్వరగా విచారణ జరపాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని.. అందుకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్.. విచారణను ఈ నెల ఆరో తేదీకి వాయిదా వేశారు.

ఐపీఎస్‌ల క్వాష్ పిటిషన్లపై విచారణ 8కి వాయిదా

నటి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, విశాల్ గున్ని, అప్పటి ఏసీపీ కె.హనుమంతరావు, దర్యాప్తు అధికారి కె.సత్యనారాయణ వేసిన క్వాష్ పిటిషన్లపై విచారణను హైకోర్టు 8కి వాయిదా వేసింది. గురువారం ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు రాగా ప్రాసిక్యూషన్ తరఫున ఏజీ వాదనలు వినిపించారు. పిటిషనర్లు ఇప్పటికే ముందస్తు బెయిల్ పొందారని.. ప్రస్తుత కేసులో నోటీసులిచ్చి విచారణకు పిలువబోమని, తుది చార్జిషీటు దాఖలు చేయబోమని గతంలోనే హామీ ఇచ్చామని గుర్తుచేశారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు స్పందిస్తూ.. మరో కేసులో (కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసు) నోటీసులిచ్చి విచారణకు పిలుస్తున్నారని.. తదుపరి చర్యలపై స్టే విధించాలని కోరారు. ఏజీ జోక్యం చేసుకుంటూ.. ప్రస్తుత కేసులో పిటిషనర్లకు ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని.. ఇచ్చి ఉంటే వాటిని కోర్టు ముందుంచాలన్నారు. మరో కేసులో విచారణకు రమ్మని కోరితే తప్పేమందని ప్రశ్నించారు. వ్యాజ్యాలపై కౌంటర్ వేస్తామని, విచారణను 8వ తేదీకి వాయిదా వేయాలని కోరారు. దీంతో న్యాయమూర్తి హరినాథ్ అప్పటికి వాయిదావేస్తూ ఉత్తర్వులిచ్చారు.

జెత్వానీపై నేనెవరికీ ఆదేశాలివ్వలేదు

- జైలులో సదుపాయాలు కల్పించండి: పీఎస్సార్

విజయవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీపై కేసు వ్యవహారంలో తాను ఏ అధికారికీ ఎలాంటి సూచనలు, ఆదేశాలూ ఇవ్వలేదని అప్పటి నిఘా విభాగం చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు స్పష్టంచేశారు. బెయిల్ కోసం, జైల్లో సదుపాయాల కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విజయవాడ మూడో అదనపు చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. ఆయన తరఫున న్యాయవాది విష్ణువర్ధన్ వాదనలు వినిపించారు. ఈ కేసులో పీఎస్సార్‌కు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంబంధమూ లేదన్నారు. ఈ కేసు విషయంలోనే ఆయన అప్పటి సీఎం వోకు వెళ్లారన్న ఆరోపణల్లో కూడా వాస్తవం లేదని తెలిపారు. ఆయన డీజీ స్థాయి అధికారి అయినందున జైలులో తగు సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫు వాదనల కోసం కోర్టు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

హెలిప్యాడ్ కేసులో.. అజ్ఞాతంలోకి తోపుదుర్తి

- రామగిరి పోలీసుల గాలింపు.. మొబైల్ ఫోన్ స్విచాఫ్
- ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే




పుట్టపర్తి/అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గత నెల 8వ తేదీన మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద వైసీపీ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతిందంటూ.. జగన్‌ను తిరిగి తీసుకెళ్లకుండానే హెలికాప్టర్ బెంగళూరు వెళ్లిపోవడం వివాదాస్పదమైంది. విండ్‌షీల్డ్ దెబ్బతిన్నా హెలికాప్టర్ ఎలా ఎగరగలిగిందన్నది సందేహంగా మారింది. నాటి వైసీపీ శ్రేణుల అరాచకంలో గాయపడిన పుట్టపర్తి రూరల్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ నరేంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామగిరి పోలీసులు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, మరికొందరిపై గత నెల 10వ తేదీన కేసు నమోదు చేశారు. దానికి సంబంధించి ఆయనకు నోటీసులిచ్చేందుకు సీఐ శ్రీధర్ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి తోపుదుర్తి ఇంటికి వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులను ఆరా తీశారు. తమకు తెలియదని వారు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఆయన మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచాఫ్ రావడంతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు నిర్ధారించుకున్నారు. ఆయన కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టారు. హెలిప్యాడ్ ఘటనపై ఇప్పటికే కో-పైలట్‌ను విచారించారు. పైలట్ అనిల్‌కుమార్‌కు రెండో నోటీసు ఇచ్చి శుక్రవారం రావాలని సూచించారు. అయితే మరికొంత సమయం కావాలని ఆయన కోరినట్లు తెలిసింది.

హైకోర్టుకు తోపుదుర్తి

ఇంకోవైపు.. అజ్ఞాతంలో ఉన్న తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి.. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆదేశించారు. ఆయనపై నమోదు చేసిన కేసు పూర్తి వివరాలు తమ ముందుంచాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారాని(5వ తేదీ)కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులిచ్చారు. తోపుదుర్తి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కేసులోని ఇతర నిందితులకు 41ఏ కింద నోటీసులు ఇస్తామని ప్రాసిక్యూషన్ కోర్టుకు నివేదించిందని.. అయితే పోలీసులు తోపుదుర్తిని అరెస్టు చేసేందుకు నివాసానికి వెళ్లారని తెలిపారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాక్షస పాలన

- రాష్ట్రంలో విచ్చలవిడిగా స్కాములు: మాజీ సీఎం జగన్



అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనకు, 12 నెలల చంద్రబాబు పాలనకూ తేడా స్పష్టంగా కనిపిస్తోంది. రెడ్‌బుక్ రాక్షస పాలనలో ఉన్నాం. రాష్ట్రంలోని ప్రజలందరికీ ఇది అర్థమవుతోంది' అని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో గురువారం కాకినాడ జిల్లా పిఠాపురం మునిసిపాలిటీ, ప్రకాశం జిల్లా మార్కాపురం, శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం వైసీపీ నేతలనుద్దేశించి మాట్లాడారు. 'మునిసిపాలిటీ, మండల స్థాయి నేతలు నిబద్ధతతో నిలబడి, విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేస్తున్నారు. తెగువ చూపిస్తూ పాలనాధికారం చేజిక్కించుకుంటున్నారు. చంద్రబాబులాంటి నీచ రాజకీయాలు మావి కావంటూ తెగేసి చెప్తున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలపైనా తమను చూసి నేర్చుకోవాలంటూ బాబుకు గట్టి గుణపాఠం చెప్పారు. ప్రజలు అధికారం ఇస్తేనే తీసుకున్నాం. దొడ్డిదారిన పదవులు పొందలేదు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన చంద్రబాబే పదవుల కోసం తప్పులు చేస్తున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా స్కామ్‌లు జరుగుతున్నాయి. మన పాలనలో పార్టీ కార్యకర్తలకు అనుకున్న విధంగా చేయలేకపోయా. మళ్లీ అధికారంలోకి వచ్చాక కార్యకర్తలకు పూర్తి అండగా ఉంటా' అని చెప్పారు.





అమరావతిలో శుక్రవారం నిర్వహించనున్న ప్రధాని మోదీ సభా వేదిక, ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, పయ్యావుల కేశవ్ తదితరులు

అమరావతి 2.0 సర్వం సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం కేరళలోని తిరువనంతపురం నుంచి ప్రత్యేక విమానంలో ప్రధాని మోదీ గన్నవరం రానున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో వెలగపూడి చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సభా వేదిక వద్దకు చేరుకుంటారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొంటారు. ప్రధాన వేదికపై పరిమితంగా 14 మంది వీఐపీలు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తరలి వస్తున్నారు. వారి కోసం 8 వేల బస్సులు ఏర్పాటు చేశారు. రాజధాని చుట్టుపక్కల ఉన్న 8 జిల్లాలకే మొత్తం 6,600 బస్సులు కేటాయించారు.

మంత్రుల బృందం పర్యవేక్షణ

ప్రధాని సభ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రుల బృందం నిరంతరాయంగా పర్యవేక్షిస్తోంది. ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని వెల్లడించింది. పర్యవేక్షణకు నియమితులైన పయ్యావుల కేశవ్, పి.నారాయణ, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్‌తో కూడిన మంత్రుల బృందం గురువారం సభావేదిక ప్రాంగణంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లను సమీక్షించింది. అనంతరం ప్రధాన సభా వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని పర్యటనకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలు తరలి రానున్నారని, వేసవి దృష్ట్యా సభకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు విస్తృతమైన ఏర్పాట్లు చేశామని వివరించారు. ప్రతి బస్సుకు ఒక ప్రభుత్వ అధికారిని ఇన్‌చార్జిగా పెట్టడంతో పాటు 25 బస్సులకు ఒక ప్రత్యేక ఇన్‌చార్జి అధికారిని నియమించినట్టు చెప్పారు. ఎక్కడా ఆటంకాలు కలగకుండా సభాస్థలికి చేర్చే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. బస్సులు బయలుదేరే సమయంలోనే అల్పాహారం, తాగునీరు ఇవ్వడంతో పాటు దారి మధ్యలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ పార్కింగ్ ప్రాంతాల్లో కూడా భోజన వసతి కల్పించామని, సభానంతరం తిరిగి గమ్యస్థానాలకు బయలుదేరే ముందు రాత్రి భోజనం కూడా అందిస్తామని అన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతి రాజధాని నిర్మాణానికి 29 గ్రామాల ప్రజలు సుమారు 34 వేల ఎకరాలను ఇచ్చారని, వారందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఇప్పటికే సీఎం ఆదేశాల మేరకు రాజధాని రైతులకు ఆహ్వానాలను అందించామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. అమరావతి పనుల పునఃప్రారంభానికి వస్తున్న ప్రధాని కార్యక్రమానికి గతంలో ఎన్నడూ లేని రీతిలో అద్భుతమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడి అమరావతి రాజధానిని నాశనం చేసిందన్నారు. తిరిగి అమరావతి పనులను ప్రారంభించుకోవడం రాష్ట్రమంతా గర్వించదగ్గ పరిణామమన్నారు.

రెండున్నర గంటల పాటు మోదీ పర్యటన

గన్నవరం, మే1(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను పురస్కరించుకుని అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక విమానంలో శుక్రవారం మధ్యాహ్నం 2.55 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి రానున్న మోదీ.. రాజధాని అమరావతి కార్యక్రమంలో పాల్గొని తిరిగి సాయంత్రం 5.20కి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళతారు. మొత్తంగా మోదీ రెండున్నర గంటలు రాష్ట్ర పర్యటనలో ఉంటారు.

రూ.57,962 కోట్ల ప్రాజెక్టులు

- రాజధాని అమరావతిలో రూ.49,040 కోట్ల వ్యయంతో 74 ప్రాజెక్టుల పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారు. అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు భవనాలతో పాటు ఇతర ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తారు.
- రాజధాని పనులతో పాటు మరో రూ.8 వేల కోట్ల ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రూ.1,459 కోట్లతో కృష్ణా జిల్లా నాగాయలంకలో డీఆర్‌డీవో చేపట్టే క్షిపణి ప్రయోగ కేంద్రానికి, రూ.100 కోట్లతో విశాఖలో డీపీఐఐటీ చేపట్టే యూనిటీ మాల్‌కు, రూ.293 కోట్లతో గుంతకల్లు వెస్ట్-మల్లప్ప గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి, రూ.3,176 కోట్లతో ఎన్‌హెచ్ఏఐ చేపట్టే 6 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు.
- రూ.3,680 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 8 జాతీయ రహదారులను ప్రధాని ప్రారంభిస్తారు.
- రూ.254 కోట్లతో నిర్మించిన 3 రైల్వే ట్రిప్లింగ్, డబ్లింగ్ ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తారు.

దేశంలో ఆయుష్ వైద్యానికి నవశకం

- 2014 నుంచి ఆ రంగానికి ప్రోత్సాహం
- వైసీపీ సర్కార్ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో కుదేలు
- తిరిగి జీవం పోసేందుకు కృషి చేస్తున్నాం
- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): దేశంలో ఆయుష్ వైద్య సేవల విస్తరణలో 2014 నుంచి నవశకం ప్రారంభమైందని, ఈ రంగంలో ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో అందిపుచ్చుకునేందుకు రాష్ట్రాలు ప్రయత్నాలు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ మహారాష్ట్రలోని పూణెలో గురువారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాచీన భారతీయ వైద్య విధానాల విశిష్టతపై అవగాహన ఉన్న ప్రధాని మోదీ.. ఆయుష్ వైద్య విధానాల్ని ప్రోత్సహించేందుకు 2014 నుంచి నడుంకట్టారని, దీని వల్ల సత్ఫలితాలు వస్తున్నాయని మంత్రి అన్నారు. భారతీయ, అల్లోపతి వైద్య విధానాల మేళవింపుతో, సమీకృత ఆస్పత్రుల ఏర్పాటుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ రెండింటి మేళవింపుతో ఏపీలో ఆస్పత్రుల స్థాపనకు పెట్టుబడుల సమీకరణతో పాటు మెడికల్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాల దృష్ట్యా దీనిపై దృష్టి కేంద్రీకరిస్తున్నామని చెప్పారు. భారతీయ వైద్య విధానానికి కేరళలో లభిస్తున్న ఆదరణ, ప్రయోజనాలను ఆయన ప్రస్తావించారు. కేంద్రం మద్దతుతో ఏపీలో ఆయుష్ వైద్య సేవలను విస్తృతం చేసి, ప్రజలకు పెద్దయెత్తున అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉన్నా.. గత ప్రభుత్వం 2019-24 మధ్య ఈ రంగాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని అన్నారు. నిరాసక్తత కారణంగా రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు రాలేదని, ఇతర రాష్ట్రాలు బాగా లబ్ధి పొందాయని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మొదటి రెండేళ్లలో ఆయుష్ రంగంలో నామమాత్రంగా నిధులు ఖర్చు చేశారని, తర్వాతి మూడేళ్లలో అయితే ఒక్క రూపాయి వెచ్చించలేదని తెలిపారు. ఆయుష్ వైద్యులు, ఇతర పోస్టుల్లో భారీగా ఖాళీలు ఉండడం వల్ల పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నామన్నారు. రాష్ట్రంలో కుదేలైన ఆయుష్ రంగానికి తమ ప్రభుత్వం జీవం పోయడానికి కృషి చేస్తోందని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సమాచార కమిషన్ కార్యదర్శిగా ఆంజనేయులు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ కార్యదర్శిగా వి.ఆంజనేయులును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఐఆర్‌టీఎస్ అధికారి అయిన ఆంజనేయులు ప్రస్తుతం ఈఎస్ఐ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఏపీ సమాచార కమిషన్ కార్యదర్శిగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

భారత్‌కు రూ.1100 కోట్ల సైనిక సామగ్రి సరఫరాకు అమెరికా ఆమోదం

న్యూఢిల్లీ, మే 1: భారత్‌కు 131 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.1109 కోట్లు) విలువైన సైనిక సామగ్రి (మిలటరీ హార్డ్‌వేర్) సరఫరాకు అమెరికా ఆమోదం తెలిపింది. అమెరికా ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే డిఫెన్స్ సెక్యూరిటీ కార్పొరేషన్ ఏజెన్సీ(డీఎస్‌సీఏ) ఈ మేరకు అమెరికా కాంగ్రెస్‌కు సమాచారం అందజేసింది. ఇండో-పసిఫిక్ మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ కింద ఈ విక్రయం జరగనుంది. లాజిస్టిక్స్ అవసరాలకు వాడే సామగ్రి, సీ(సముద్రం) విజన్ డాక్యుమెంటేషన్‌తోపాటు సీ-విజన్ సాఫ్ట్‌వేర్, రిమోట్ సాఫ్ట్‌వేర్ కొనుగోలుకు భారత్ ప్రతిపాదనలు పంపినట్టు డీఎస్‌సీఏ పేర్కొంది. ఈ మేరకు అమెరికా మీడియాలో కథనాలు వెలువడగా.. దీనిపై భారత ప్రభుత్వం స్పందించలేదు. అమెరికా ఆయుధాలు, ఆయుధ సామగ్రి వినియోగం దిశగా భారత్‌ను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వేళ ఈ ఆమోదం లభించింది.

ప్రధాని వస్తుంటే జగన్ జంప్!

- ఒకరోజు ముందే బెంగళూరుకు చెక్కేసిన మాజీ సీఎం
- అమరావతి పనుల శ్రీకారానికి ప్రత్యేకంగా ఆహ్వానించిన ప్రభుత్వం
- రాజధాని పనుల పురోగతి ఓర్వలేకనే డుమ్మా



అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): మూడు ముక్కలాటతో తాను విధ్వంసం చేసిన నవ్యాంధ్ర రాజధాని అమరావతి.. ఇప్పుడు పునర్నిర్మాణం దిశగా పరుగులు పెట్టడం చూసి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఓర్వలేకపోతున్నారు. పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు స్వయంగా ప్రధాని మోదీ వస్తుంటే.. ఆయన సభకు హాజరుకాకుండా బెంగళూరు యలహంక ప్యాలెస్‌కు వెళ్లిపోయారు. ప్రధాని పాల్గొనే బహిరంగ సభకు రావాలని రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా జగన్‌కు ఆహ్వానం అందజేసింది. తాను ఐదేళ్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించినప్పుడు మోదీ అందించిన సహకారానికి కృతజ్ఞతగానైనా.. ఈ సభకు జగన్ హాజరు కావాలని కోరింది. దేశ ప్రధాని హోదాలో రాష్ట్రానికి వస్తున్న మోదీని మర్యాదపూర్వకంగానైనా కలిసి స్వాగతం పలకాల్సి ఉండగా.. జగన్ ముఖం చాటేసి ఒక రోజు ముందే బెంగళూరు వెళ్లిపోవడంపై రాజకీయ వర్గాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయం అనంతరం జగన్ ప్రతి శుక్రవారం యలహంక ప్యాలెస్‌కు వెళ్లిపోతున్నారు. సోమవారం రాత్రి గానీ, లేదంటే మంగళవారం గానీ వస్తున్నారు. అయితే అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి ప్రధాని వస్తుండడం.. రాష్ట్ర ప్రజలంతా భారీ సంఖ్యలో సభకు హాజరు కానుండడం.. వారికి ముఖం చూపించలేక పర్యటనను బహిష్కరించి.. ఒకరోజు ముందే బెంగళూరుకు వెళ్లిపోయారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ప్రధాని సభకు హాజరుకండి

- సచివాలయ ఉద్యోగులు, అధికారులకు సర్క్యులర్

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతి రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు, అధికారులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సర్క్యులర్ జారీ చేశారు. అమరావతి రాజధాని పనుల పునః ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతున్న సభకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను కొనసాగించాలి

- ఛత్తీస్‌గఢ్ సీఎంకు మావోయిస్టు బాధితుల వినతిపత్రం
- కర్రె గుట్టల్లో కొనసాగుతున్న కూంబింగ్

చర్ల, మే 1(ఆంధ్రజ్యోతి): కర్రె గుట్టల్లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను కొనసాగించాలని మావోయిస్టు బాధిత కుటుంబ సభ్యులు బుధవారం ఛత్తీసగఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, డిప్యూటీ సీఎం విజయశర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. బస్తర్‌ను మావోయిస్టు రహిత ప్రాంతంగా మార్చాలని కోరారు. నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టుల వల్ల అనేక మంది ఇబ్బందులు పడ్డారని, కొంత మంది కుటుంబాలను కోల్పోయారని పేర్కొన్నారు. రోడ్లు లేక అభివృద్ధికి దూరమయ్యామన్నారు. తాము ఇబ్బందుల్లో ఉన్నప్పుడు బయటకు రాని సంఘాలు ఆపరేషన్ కగార్‌ని విమర్శించడం, లేఖలు విడుదల చేయడం, మీడియాతో మాట్లాడటం సరికాదన్నారు. ఒకవైపు ఛత్తీసగఢ్ అడవుల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతుండగా మరో వైపు జార్ఖండ్‌లోని మహుదాండ అడవుల్లోని ఓ ప్రాంతంలో రోడ్డు పనులు నిర్వహిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను మావోయిస్టులు తగల బెట్టారు. కొద్ది రోజుల క్రితం ఇదే ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందిన ఘటనకు నిరసనగానే వారు ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని కర్రె గుట్టల్లో పదో రోజు కూం బింగ్ కొనసాగింది. మావోయిస్టుల కోసం కేంద్ర బలగాలు అణువణువూ గాలిస్తున్నాయి. గురువారం కూడా కర్రెగుట్టల్లో డ్రోన్‌లు, హెలికాప్టర్లు చక్కర్లు కొట్టాయి. మావోయిస్టు అనుమానిత ప్రాంతాల్లో బాంబులు వేశాయి.

శ్రామికులతోనే దేశ ప్రగతి

- ఉపాధి కూలీలు ఇకపై ఉపాధి శ్రామికులు
- కండలు కరిగించేవారుంటేనే కట్టడాలు
- ఉపాధి శ్రామికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- శిథిల ఆర్థిక వ్యవస్థకు ఊపిరిగా పంచాయతీరాజ్ నిధులు
- గత ఏడాది 10,669 కోట్లు ఖర్చు చేశాం
- 24.23 కోట్ల పనిదినాలు కల్పించాం
- ఉపాధి శ్రామికులతో ఆత్మీయ సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో శిథిలమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పంచాయతీరాజ్ నిధులే ప్రాణ వాయువులా మారాయని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకలా నిలుస్తోందని చెప్పారు. గురువారం మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో మేడే సందర్భంగా ఏర్పాటు చేసిన ఉపాధి శ్రామికుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ శ్రామికుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శ్రామికులు లేకపోతే దేశ ప్రగతి ముందుకు సాగదని చెప్పారు. దేశ అభివృద్ధిలో భాగమవుతున్న ప్రతి శ్రామికుడికి అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. మేడే సందర్భంగా నేటి నుంచి ఉపాధి హామీ పథకం కూలీలు అనే పేరును, ఉపాధి హామీ శ్రామికులుగా మారుస్తున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రూ. 10,669 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. అందులో రూ. 6,194 కోట్లు వేతనాలకే ఖర్చు చేశామని, రూ. 4,023 కోట్లు మెటీరియల్ కోసం ఖర్చు చేశామని పేర్కొన్నారు. 75.23 లక్షల కార్మికులకు సొంత గ్రామాల్లోనే ఉపాధి కల్పించామని వెల్లడించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 24.23 కోట్ల పనిదినాలు కల్పించామని, 5.10 లక్షల కుటుంబాలకు వందరోజుల పాటు పని కల్పించామని చెప్పారు. లంచాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం వల్ల గతంలో రూ. 150లు మించని వేతనాలు ఇప్పుడు రూ. 307కి పెంచి ఇవ్వగలుగుతున్నామని తెలిపారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. "ఇంజనీర్లు, సైంటిస్టులు, డాక్టర్లు ఎంత గొప్పో పనిచేసే ప్రతి శ్రామికుడు కూడా అంతే గొప్ప. మీకు ఉపాధి కల్పించడం సంతోషంగా ఉంది. పంచాయతీరాజ్ శాఖ తీసుకోవడం వెనుక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మినహా ఇతర కారణాలు లేవు. ఐదేళ్లలో మీకు ఎంత వరకు మద్దతుగా నిలవగలం అనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నాం. విష్ణుమూర్తి గజేంద్రుని రక్షించినట్లు మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణానికి అధికారులు పూనుకున్నాం.

పల్లెపండుగలో 21 వేలకుపైగా గోకులాలు

పల్లె పండుగ ద్వారా ఇప్పటి వరకు రూ. 377.37 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 21,564 గోకులాలు పూర్తి చేశాం. ఉపాధి శ్రామికుల కష్టం ఫలితంగా గ్రామాల్లో రూ. 60.75 కోట్లు ఖర్చుతో 13,500 పశువుల తొట్టెలు పూర్తిచేశాం. అలాగే రూ. 317.91 కోట్లు ఖర్చుతో 63,582 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాం. ఒకే రోజు 1.21 కోట్ల మంది ఉపాధి శ్రామికులకు ప్రధానమంత్రి సురక్ష యోజన, జీవనజ్యోతి యోజన పథకాల కింద బీమా నమోదు చేశాం. పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలి.శ్రామికులకు పూర్తివేతనం అందే లా అన్ని చర్యలు చేపట్టాం. ఉపాధి వేతనాలు పెరిగే లా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

నీటి సంరక్షణకు చర్యలు

రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచి నీరు అందించాలంటే దాదాపు రూ. 87 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనాతో ప్రతిపాదనలు కేంద్రానికి పంపించాం. వాళ్లు పరిశీలించి ఇప్పటి వరకు రూ. 29 వేల కోట్లకు అనుమతులిచ్చారు. పూర్తి స్థాయిలో పనులు చేయాలంటే ఇంకో రూ. 57 వేల కోట్లు అవసరం. మద్యపానాన్ని నిషేధిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వ పాలకులు.. సారాయి సొమ్ముల మీద కూడగట్టుబెట్టుకున్నారు. మద్యం తయారు చేసి, అమ్మి దాదాపు రూ. 3,200 కోట్లు దోచుకున్నారని ఇప్పటివరకు తెలిసింది" అని పవన్ చెప్పారు. అంతకు ముందు పవన్‌కల్యాణ్ ఉపాధి శ్రామికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలను ఆలకించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఉపాధి పథకం డైరెక్టర్ షణ్ముక్ కుమార్, సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్, ఏసీ శివ ప్రసాద్, జేడీ సునీత తదితరులు పాల్గొన్నారు.



కార్మిక దినోత్సవ వేడుకలలో ఉపాధి శ్రామికులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

"గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు. నాకు పల్లెలు అంటే ఇష్టం. గ్రామాలు బాగుండాలని నిరంతరం ఆకాంక్షిస్తాను. శ్రమ విలువ నాకు తెలుసు కాబట్టి ఉపాధి శ్రామికుల విలువ తెలుసు. కండలు కరిగించేవారు లేకపోతే కట్టడాలు ఉండవు. హరితహారాలు ఉండవు. అందుకే శ్రమపడేవారిని దేశాన్ని, రాష్ట్రాన్ని నిర్మించే శ్రామికులుగా గుర్తించాలి. కార్మిక దినోత్సవాన మిమ్మల్ని ఉపాధి కూలీలుగా కాకుండా దేశ నిర్మాణంలో చమటోడ్చే శ్రామికులుగా గుర్తిస్తున్నాం. ఈ రోజు నుంచి మిమ్మల్ని ఉపాధి శ్రామికులుగానే పిలుస్తాం."

\- పవన్ కల్యాణ్

1.21 కోట్ల ఉపాధి శ్రామికులకు బీమా

ఉపాధి శ్రామికుల కుటుంబాలకు భరోసా కల్పించాలనే పవన్ కల్యాణ్ సూచనలతో కమిషనర్ కృష్ణతేజ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో శ్రామికులందరినీ నమోదు చేయడానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద మే ఒకటో తేదీ ఒక్క రోజే 94 లక్షల మంది నమోదయ్యారని, అలాగే ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద 27 లక్షల మంది నమోదు అయ్యారని మొత్తంగా 1.21 కోట్ల మంది ఉపాధి శ్రామికులకు బీమా సౌకర్యం దక్కిందని అధికారులు తెలిపారు.

పీ4 ద్వారా ఆదుకోండి

ఉపాధి శ్రామికులు పలువురు పవన్‌కల్యాణ్‌తో ముచ్చటించారు. తాను, తన భర్త దివ్యాంగులమేనని, తమను పీ4 ద్వారా ఆదుకోవాలని పల్నాడు జిల్లాకు చెందిన చెంచు భూలక్ష్మి కోరారు. ఖుషి సినిమా పోస్టర్ తమ దేవుడి ఇంట్లో ఉంటుందని తెలిపారు. కుప్పం నుంచి వచ్చిన రామప్ప అనే ఉపాధి శ్రామికుడు మాట్లాడుతూ.. తాను ఉపాధి పథకం ద్వారా పూలతోటలు పెంచి రూ. 30 వేలు ఆదాయం గడించానని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన మల్లేశ్ మాట్లాడుతూ వ్యవసాయ పనులకు ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే బాగుంటుందని సూచించారు. దీనిపై పవన్ మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా ఈ డిమాండ్ ఉందన్నారు. ఈ విషయం కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన శ్రామికులు చెప్పిన వివరాలను పవన్ సావధానంగా విన్నారు. అనంతరం ఆయన ఉపాధి శ్రామికులతో ఫొటోలు దిగారు.

ఐటీ పెట్టుబడులకు భారీ ప్రోత్సాహకాలు

- సెమీ కండక్టర్, గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల ఏర్పాటుకు మార్గదర్శకాలు
- పరిశోధన, అభివృద్ధికి ఊతమిచ్చేలా చర్యలు
- శిక్షణ పొందే యువతకు 10 వేల చొప్పున ఇన్సెంటివ్
- ఉత్తర్వులు జారీ చేసిన ఐటీ శాఖ

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో పెట్టుబడులను భారీగా ఆకర్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈమేరకు సెమీ కండక్టర్లు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల స్థాపనపై వేర్వేరుగా మార్గదర్శకాలు, ప్రోత్సాహకాలను రాష్ట్ర ఐటీ శాఖ గురువారం ప్రకటించింది. ఏపీ సెమీకండక్టర్, ఫ్యాబ్ పాలసీ 2024-29 ప్రకారం మార్గదర్శకాలను రూపొందించింది. ఫ్యాబ్ సెంటర్లలో, సెమీ కండక్టర్ కేంద్రాల్లో పరిశోధన, అభివృద్ధి కోసం, అలాగే మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల పెంపుదల కోసం ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) కింద ప్రత్యేకంగా ప్రోత్సాహకాలను అందిస్తారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సెమీ కండక్టర్, ఫ్యాబ్ పరిశ్రమలకు 30 శాతం వరకూ పెట్టుబడి సబ్సిడీని ఇస్తారు. ఈ సెంటర్లలో శిక్షణ పొందే యువతకు నెలకు రూ. 10,000 చొప్పున ఆరు నెలల పాటు ఇన్సెంటివ్‌లు అందిస్తారు. రూ. 1,001 కోట్లకు పైబడి రూ. 5 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టే సంస్థలను మెగా ప్రాజెక్టులుగా గుర్తిస్తారు. రూ. 5 వేల కోట్లకు పైబడి పెట్టుబడులు పెట్టే సంస్థలను అల్ట్రా మెగా ప్రాజెక్టులుగా గుర్తిస్తారు. ఈ ప్రాజెక్టుల వారీగా ప్రోత్సాహకాలను అందిస్తారు. ఈమేరకు మార్గదర్శకాలు, ప్రోత్సాహకాలను ప్రకటిస్తూ ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీబీజీ ప్లాంట్ ఏర్పాటుకు ఆస్ట్రేలియా కంపెనీ ఆసక్తి

- రాష్ట్రంలో 150 కోట్లతో ఏర్పాటు చేస్తామన్న ఆర్వెన్సిస్
- ఇంధన మంత్రి గొట్టిపాటితో కంపెనీ ప్రతినిధుల భేటీ
- ఏపీలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు: మంత్రి

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి గ్లోబల్ కంపెనీలు ముందుకొస్తున్నాయి. రూ. 150 కోట్ల పెట్టుబడితో ఏటా 12-20 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఆస్ట్రేలియాకు చెందిన ఆర్వెన్సిస్ గ్రూప్ ఆసక్తిని చూపింది. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఆ సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యి తమ ఆసక్తిని తెలిపారు. పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటుకు రాష్ట్రంలో ఉన్న విస్తృత అవకాశాలను ఆ కంపెనీ ప్రతినిధులకు మంత్రి వివరించారు. పునరుత్పాదక విద్యుత్తు రంగంలో సంస్థల ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తున్నామని వెల్లడించారు. ఆర్వెన్సిస్ ప్లాంటు ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వచ్చే ఉద్యోగావకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. త్వరితగతిన సీబీజీ ప్లాంటును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆ కంపెనీ ప్రతినిధులను మంత్రి గొట్టిపాటి కోరారు.

అమరావతి నుంచి కనకదుర్గమ్మ దేవస్థానానికి వెళ్తున్న మహిళలు, రైతులు (ఫైల్)





మహా అమరావతి!

అంతర్జాతీయ నగరంగా అభివృద్ధికి అడుగులు

విమానాశ్రయం, స్టేడియం, ఇతర అవసరాలకు మరో 50 వేల ఎకరాల భూసమీకరణకు యోచన

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

అమరావతి రాజధానిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారు. అమరావతిలో ఎల్‌పీఎస్ లేఅవుట్లు, కమర్షియల్ ప్లాట్లు, వివిధ సంస్థలు, మౌలిక సదుపాయాలకు పోను ప్రభుత్వం వద్ద రిజర్వ్ భూమి కొద్దిగా మాత్రమే ఉంది. దీంతో భవిష్యత్తులో కొత్తగా ఎలాంటి ప్రాజెక్టులకు భూములు కేటాయించే అవకాశం ఉండదు. దీంతో భవిష్యత్తు అవసరాలకు దాదాపు 50 వేల ఎకరాలు అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. నగరానికి అంతర్జాతీయ హంగులు రూపుదిద్దుకోవాలంటే సువిశాలమైన అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం అవసరం. అలాగే ఇంటర్నేషనల్ స్టేడియం, రైలు మార్గాలు ఉంటేనే ఆ నగరం సంపూర్ణంగా ఉంటుంది. ఇతర అవసరాలకు కూడా భూమి అవసరం. గత టీడీపీ ప్రభుత్వం గుంటూరు, విజయవాడ, అమరావతి మూడు నగరాలు భవిష్యత్తులో కలిసిపోయి ఒక పెద్ద అంతర్జాతీయ స్థాయి నగరంగా రూపాంతరం చెందుతాయని భావించింది. గుంటూరు జిల్లా తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లో కృష్ణానది ఒడ్డున దాదాపు 33 వేల ఎకరాలు భూసమీకరణ చేసింది. కేటాయింపులు పోనూ సువిశాలమైన భూమి ప్రభుత్వం వద్ద అందుబాటులో లేదు. ఉన్న రిజర్వ్ భూమి అక్కడక్కడ పార్శిల్స్‌గా ఉన్నది.

రైతుల నుంచి సానుకూలత

శంషాబాద్ ఎయిర్‌పోర్టు కోసం అప్పట్లో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న చంద్రబాబు ఒకే చోట 5 వేల ఎకరాల భూమిని కేటాయించారు. నేడు దేశంలోనే రద్దీ విమానాశ్రయాల్లో ఒకటిగా శంషాబాద్ ఉంది. అంతేగాక ఎయిర్‌పోర్టు చుట్టూ 30 కిలోమీటర్ల పరిధిలో అభివృద్ధి జరుగుతోంది. ఈ నేపథ్యంలో అమరావతికి సమీపంలో మరికొంత భూమిని సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతికి దగ్గరగా వైకుంఠపురం, యంద్రాయి, పెదమద్దూరు, కర్లపూడి, చావపాడు గ్రామాల్లో తొలుత 9 వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించాలని భావిస్తోంది. ఈ గ్రామాల రైతులందరికీ ఒకే చోట ఎల్‌పీఎస్ లేఅవుట్లు వేసి భూములు ఇవ్వడం ద్వారా వేరే చోట ప్రభుత్వానికి ఎక్కువ విస్తీర్ణంలో భూమి సమకూరుతుంది. ఇలాగే తుళ్లూరు మండలంలోని పెదపరిమి, వడ్డమాను, తాడికొండ మండలంలోని కంతేరు, మోతడక, తాడికొండ గ్రామాల్లో కలిసి మరో 40 వేల ఎకరాలకు పైగా భూములు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. తద్వారా అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు నూతన రైలుమార్గం, రైల్వే స్టేషన్లు, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వంటి వాటికి భూములు కేటాయించే అవకాశం ఉంటుంది. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ కొన్ని రోజుల నుంచి రైతులతో సంప్రదింపులు జరుపుతున్నారు. అదనపు భూసమీకరణ చేసినా రాజధానిలో భూముల ధరలు పడిపోవని సీఎం చంద్రబాబు ఇటీవల స్పష్టం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ మేరకు హామీ ఇస్తుండటంతో మెజార్టీ రైతుల నుంచి సానుకూల స్పందన వస్తోంది. త్వరలో భూసమీకరణ పూర్తి చేసి అమరావతి ఒక మహా రాజధానిగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

రాజధాని అమరావతి రైతుల మహా పాదయాత్ర (ఫైల్)





మందడంలో ఇంటికో పోలీసు.. పరదాలు (ఫైల్)



పోలీసు బూట్లు తుడుస్తున్న మహిళ (ఫైల్)





తుళ్లూరులో రైతులు, మహిళల నిరసన (ఫైల్)



అమరావతి రైతులపై పోలీసుల లాఠీచార్జ్ (ఫైల్)

నాడు రాజధాని రైతులకు చిత్రహింసలు

ఉద్యమంపై జగన్ సర్కారు ఉక్కుపాదం

దిగ్బంధాలు దాటి..

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

'మాట తప్పను.. మడమ తిప్పను'.. మాజీ సీఎం జగన్ తన గురించి గొప్పగా చెప్పే మాట ఇది. రాజధాని అమరావతి విషయంలో మాట తప్పి, మడమ తిప్పడమే కాదు నయవంచన చేశారు. 2019 ఎన్నికల ముందు రాజధాని అమరావతికి మద్దతు పలికిన జగన్... అధికారంలోకి వచ్చాక 'మూడు రాజధానులు' అంటూ మోసం చేశారు. అమరావతి కోసం ఉద్యమించిన అన్నదాతలపై పోలీసులను ఉసిగొల్పి చిత్రహింసలు పెట్టారు. మహిళలని కూడా చూడకుండా మగ పోలీసులు దాడి చేశారు. బీసీ, దళిత రైతులపైనే అట్రాసిటీ కేసులు పెట్టారు. అయినా సహనంతో భరించి 1631 రోజులపాటు ఉద్యమాన్ని సాగించారు.

మహిళలపై దౌర్జన్యం

2020 జనవరి 10న దుర్గమ్మకు ముడుపులు చెల్లించుకునేందుకు వెళుతున్న మహిళలపై పోలీసులు దాడి చేశారు. అప్పటి గుంటూరు ఎస్పీ విజయరావు లాఠీలతో మహిళలపై విరుచుకుపడ్డారు. ఇటుక రాళ్లతో దాడి చేయడం, మహిళల జుట్టు పట్టుకుని లాగడం వంటి పోలీసుల అనైతిక చర్యలు ప్రపంచాన్ని కదిలించాయి. దీనిపై హైకోర్టు ఆ ఏడాది జనవరి 13న సూమోటోగా కేసు నమోదు చేసింది.

పోలీసుల గుప్పిట్లో..

జగన్ మూడు రాజధానుల ప్రకటన చేసిన మరుసటి రోజే 2019 డిసెంబరు 18న రాజధాని ఉద్యమం మొదలైంది. ఆ తర్వాతి రోజు అమరావతిలో రైతులు బంద్ నిర్వహించారు. అనూహ్య స్పందన రావడంతో జగన్ ప్రభుత్వం వెంటనే 30 యాక్ట్, 144 సెక్షన్లతో రాజధాని గ్రామాలను గుప్పిట్లో బంధించింది. అయినా ఉద్యమం ఆగలేదు. డిసెంబరు 31న తమకు కారుణ్య మరణాలకు అనుమతించాలని రాజధాని రైతులు సామూహికంగా రాష్ట్రపతికి లేఖలు రాసి తమ ఆవేదనను తెలిపారు.

అసెంబ్లీ ముట్టడి

2020 జనవరి 20న అమరావతి జేఏసీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ ముట్టడిని భగ్నం చేయడానికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చేయని ప్రయత్నం లేదు. ముందస్తుగా అరెస్టులు చేశారు. అయినా రైతులు, మహిళలు, రైతుకూలీలు, దళిత బహుజనులు ఎవరికి వారుగా చెట్లు, పొదలు, తుప్పల మాటున దాక్కొంటూ అసెంబ్లీ చేరుకున్నారు. పోలీసుల రక్షణ వలయాన్ని ఛేదించుకుని అసెంబ్లీ గేటు వరకూ ఉద్యమకారులు దూసుకెళ్లారు. సంక్రాంతి పండగను కూడా ఉద్యమ వేదికగా చేసుకుని 'సంక్రాంతి సెగలు' పేరిట నిరసన తెలిపారు. బోస్టన్ కమిటీ నివేదిక ప్రతులు బోగిమంటల్లో వేశారు.

హైకోర్టు చరిత్రాత్మక తీర్పు

2022 మార్చి 4వ తేదీన హైకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. మూడు రాజధానుల చట్టాన్ని కొట్టివేస్తూ అమరావతిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మూడు నెలల్లోగా రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లను అభివృద్ధి చేసి అందజేయాలని, ఆరు నెలల్లోగా రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేయాలని సూచించింది. కానీ ప్రభుత్వం పట్టించుకోలేదు. జూన్ 4న ఉద్యమం 900 రోజు సందర్భంగా రైతులు న్యాయదేవతకు క్షీరాభిషేకం చేశారు. విజయవాడలో 'హైకోర్టు తీర్పు- సర్కారు తీరు' పేరిట సదస్సు నిర్వహించారు.

రైతులకు సంకెళ్లు

రైతులు 'అమరావతి రైతుల చూపు మోదీ వైపు' పేరిట గుంటూరు నుంచి ఉద్దండరాయునిపాలెం వరకూ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మూడు రాజధానుల శిబిరానికి వెళుతున్న ఆటోలను అడ్డుకున్నారంటూ దళిత, బీసీ రైతులు 11 మందిపై ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టి చేతులకు సంకెళ్లు వేసి అరెస్టు చేశారు.

మహాపాదయాత్రకు అడ్డంకులు

2022 సెప్టెంబరు 12 నాటికి ఉద్యమం మొదలై వెయ్యి రోజులు. ఈ సందర్భంగా అమరావతి టూ అరసవెల్లి పేరిట మహాపాదయాత్రకు రైతులు శ్రీకారం చుట్టారు. కోనసీమ జిల్లా వరకూ సాగిన యాత్రకు ప్రజల నుంచి భారీ మద్దతు రావడంతో ప్రభుత్వం ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది. నిర్బంధాన్ని పెంచింది. దీంతో అక్టోబరు 22న పాదయాత్రను రైతులు తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు.

అమానుషం

అమరావతి ప్రాంతంలో మహిళలు స్నానం చేస్తున్న సమయంలో స్నానపు గదులపై డ్రోన్ కెమెరాలను తిప్పడాన్ని అడ్డుకున్నందుకు 40 మందిపై కేసులు నమోదు చేశారు. 20 రోజులపాటు జైలుపాలు చేశారు. మొత్తం ఉద్యమ క్రమంలో 600 మందిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారు.

అజరామరం

ఫలించిన 1,631 రోజుల అన్నదాతల పోరాటం

అమరావతి.. ఐదు కోట్ల ఆంధ్రుల కలల రాజధాని. గత టీడీపీ ప్రభుత్వంలో పురుడు పోసుకున్న రాజధానికి.. వైసీపీ సర్కారు 'మూడు రాజధానుల' పేరిట సమాధి కట్టేందుకు కుట్ర చేసింది. విద్వేష రాజకీయాలతో నయవంచన చేసింది. రాజధాని రైతుల ఐదేళ్ల సుదీర్ఘ పోరాటంతో అమరావతికే అంతిమ విజయం దక్కింది. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మళ్లీ పట్టాలెక్కుతోంది. గత ప్రభుత్వం చేసిన గాయాలను మాన్పుకుని దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా నిర్మాణ పునఃప్రారంభానికి ముస్తాబవుతోంది. ఈ విజయం అమరావతికి అంత ఆషామాషీగా దక్కలేదు. నాడు రాజధాని లేని రాష్ట్రం కోసం తమ ప్రాణ సమానమైన 34 వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులు.. ఆ రాజధానికి కష్టమొచ్చినప్పుడు రక్షణ కవచంగా నిలిచారు. మరోమారు త్యాగాలతో కూడిన పోరాటం చేసి కాపాడుకున్నారు. మట్టి మనుషుల త్యాగాలతో మొదలైన రాజధాని ప్రస్థానం.. ఇప్పుడు మహానగర నిర్మాణం దిశగా అడుగులు వేస్తోంది. 2015లో ప్రధాని శంకుస్థాపన చేసిన అమరావతి.. మళ్లీ అదే ప్రధాని చేతుల మీదుగా శుక్రవారం పునఃప్రతిష్ఠ చేసుకోనుంది. ఈ సందర్భంగా రాజధాని రైతుల పోరాటంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నాలుగున్నరేళ్ల మొక్కవోని దీక్ష

రాష్ట్రం కోసం, రాజధాని కోసం వేలాది ఎకరాలు ఇచ్చి దగా పడిన రైతులు, మహిళలు, ప్రజలు 2019 డిసెంబరు 18న అమరావతి పరిరక్షణ మహోద్యమం ప్రారంభించారు. తుళ్లూరు, మందడం, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం గ్రామాల్లో మొదలైన ఉద్యమం క్రమంగా రాజధాని గ్రామాలకు విస్తరించింది. ఆ ఏడాది డిసెంబరు 19వ తేదీన రైతులు బంద్ నిర్వహించారు. రైతుల ఉద్యమానికి ఆనాడు అధికారంలో ఉన్న వైసీపీ మినహా మిగిలిన పార్టీలన్నీ సంఘీభావం ప్రకటించాయి. రైతులు, మహిళలు, రైతు కూలీలు, దళిత బహుజనులు, మైనారిటీలు ఏకమై ఉద్యమాన్ని ఉరకలెత్తించారు.

రాజధాని సంకల్ప ర్యాలీ

2021 జనవరి 20న ఉద్యమం 400వ రోజు సందర్భంగా రైతులు చేపట్టిన 'రాజధాని సంకల్ప ర్యాలీ' విజయవంతమైంది. తుళ్లూరులో ప్రారంభమైన ర్యాలీ పెదపరిమి, నెక్కల్లు, అనంతవరం, వడ్డమాను, హరిశ్చంద్రపురం, బోరుపాలెం, దొండపాడు, అబ్బరాజుపాలెం మీదుగా మందడం వరకూ సాగింది. ఇన్‌సైడర్ పేరుతో నమోదైన కేసును హైకోర్టు కొట్టేసింది. ఇది ఉద్యమకారుల్లో నైతిక స్థైర్యాన్ని పెంచింది.

అన్నదాతల మహోద్యమం 1631 రోజుల పాటు సాగింది. దేశ చరిత్రలోనే ఇంత సుదీర్ఘకాలం పాటు క్రియాశీలంగా సాగిన ఉద్యమం మరొకటి లేదు. 2020 మార్చి 20న కరోనా కారణంగా దేశమంతా లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయింది. ఆ సమయంలోనూ లాక్‌డౌన్ నియమాలను పాటిస్తూ ఇళ్లలోనే నిరసన దీక్షలు కొనసాగించారు. ఈ లాక్‌డౌన్ సమయంలోనే అమరావతి ఉద్యమం వందోరోజు పూర్తి చేసుకుంది.

ఎన్‌ఆర్‌ఐల కొవ్వొత్తుల ప్రదర్శన

2020 జూలై 4న ఉద్యమం 200వ రోజు సందర్భంగా 175 అసెంబ్లీ స్థానాల్లో రైతులకు సంఘీభావంగా ప్రజలు దీక్షలు చేపట్టారు. 200 నగరాల నుంచి ఎన్‌ఆర్‌ఐలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. 2020 ఆగస్టు 26న విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్టోబరు 12న 300వ రోజు సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన 92 మంది రైతులకు నివాళిగా తుళ్లూరులో 'ఆత్మబలిదాన యాత్ర' నిర్వహించారు.

మోదీకి లేఖలు

2021 ఏప్రిల్ 31న ఉద్యమం 500వ రోజు సందర్భంగా పలు రాజకీయ పార్టీలు, ఐకాస నేతలు ప్రధాని మోదీకి లేఖలు రాశారు. 2021 ఆగస్టు 8న 600వ రోజు సందర్భంగా అమరావతి నుంచి మంగళగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం వరకూ ర్యాలీకి పిలుపునిచ్చారు. అప్పటికి మరణించిన రైతులు, కూలీల సంఖ్య 170కి చేరింది. 2021 నవంబరు 1 చేపట్టిన 'న్యాయస్థానం టూ దేవస్థానం' పాదయాత్ర ఉద్యమ స్వరూపాన్ని పూర్తిగా మార్చేసింది. నవంబరు 1న హైకోర్టు వద్ద మొదలై, డిసెంబరు 17న తిరుమల తిరుపతి దేవస్థానం చేరేవరకూ 57 రోజులపాటు రైతులు పాదయాత్ర చేశారు. నవంబరు 16న ఉద్యమం 700వ రోజుకు చేరుకుంది. ఈ సమయంలోనే ప్రభుత్వం మూడు రాజధానుల చట్టాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు హైకోర్టుకు తెలిపింది. పాదయాత్ర ముగింపు సందర్భంగా తిరుపతిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సభకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించి అనుమతి పొందారు.

-(గుంటూరు/అమరావతి-ఆంధ్రజ్యోతి)

అమరావతి ప్రజాదీక్ష

2022 ఫిబ్రవరి 24న ఉద్యమం 800 రోజు సందర్భంగా యువకులు పాదయాత్రలు, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ప్రదర్శన నిర్వహించారు. రైతులు అమరావతి ప్రజా దీక్ష చేపట్టారు. 24గంటల దీక్షలో 800 మంది, 12 గంటల దీక్షలో 2000 మంది పాల్గొన్నారు.

జగన్ నయవంచన

2014లో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని నిర్మాణం అవసరమైంది. రాజధాని రాష్ట్రం నడిబొడ్డున ఉండాలన్నది అప్పటి ప్రభుత్వం ఆలోచన. దానికి అనుగుణంగా గుంటూరు-కృష్ణా మధ్యన రాజధాని వస్తుందని ప్రకటించింది. ప్రభుత్వంపై భారం పడకుండా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు భూసమీకరణ చేపట్టారు. ఆయన పిలుపు మేరకు రాజధాని అమరావతి నిర్మాణానికి 29 గ్రామాల పరిధిలో ఉన్న 34,322 ఎకరాల భూములను 29,881 మంది రైతులు భూసమీకరణ కింద ఇచ్చారు. భూములను త్యాగం చేసినవారిలో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. 2019 ఎన్నికలకు ముందు అమరావతి రాజధానికి నాటి ప్రతిపక్ష నేతగా జగన్ మద్దతు పలికారు. అయితే ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ ఆ తర్వాత మాట మార్చారు. రాజధాని నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని, అక్కడంతా ఒక సామాజికవర్గం వారే ఉన్నారని ఆరోపణలు చేశారు. అత్యంత విఫల నమూనా అయిన దక్షిణాఫ్రికా మూడు రాజధానుల విధానాన్ని ముందుకుతెచ్చి వితండవాదం చేశారు. 2019 డిసెంబరు 17న జగన్ అసెంబ్లీ సాక్షిగా మూడు రాజధానుల ప్రకటన చేశారు. కర్నూలులో న్యాయ రాజధాని, అమరావతిలో శాసన రాజధాని, విశాఖలో కార్యనిర్వాహక రాజధాని వస్తాయని చెప్పారు. మూడు ప్రాంతాల అభివృద్ధి పేరిట అమరావతిని అటకెక్కించారు. నమ్మిన నాయకుడు నయవంచన చేయడంతో విధిలేని పరిస్థితిలో ఆ మరుసటి రోజే అన్నదాతల ఉద్యమం మొదలైంది.

మహాపాదయాత్ర 2.0

2022 సెప్టెంబరు 12 నాటికి అమరావతి ఉద్యమం మొదలై వెయ్యి రోజులు పూర్తయింది. ఆ సందర్భంగా అమరావతి టూ అరసవెల్లి పేరిట 630 కిలో మీటర్ల మహా పాదయాత్రకు రైతులు శ్రీకారం చుట్టారు. దారి పొడవునా రైతులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పోలీసుల నిర్బంధాలు, వైసీపీ దౌర్జన్యాలను ఎదుర్కొంటూ క్రమశిక్షణతో రైతులు పాదయాత్ర కొనసాగించారు. అమరావతి-కోనసీమ వరకూ సాగిన ఈ పాదయాత్రకు ప్రాంతాలకతీతంగా ప్రజల నుంచి సంఘీభావం వ్యక్తమైంది. దీంతో ఆందోళన చెందిన ప్రభుత్వం ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది. విధిలేని పరిస్థితిలో అక్టోబరు 22న పాదయాత్రను రైతులు తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. ముఖ్యనేతలు మిగిలిన పాదయాత్రను పూర్తిచేసి 2024ఫిబ్రవరి అరసవెల్లి స్వామివారిని దర్శించుకుని రైతుల మొక్కులు చెల్లించుకున్నారు.

భూసమీకరణ అంటే..

భూసమీకరణ ప్రకారం రైతుల నుంచి ప్రభుత్వం భూములు తీసుకుంటుంది. భూములిచ్చిన రైతులకు డబ్బులకు బదులు రాజధానిలో రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు కేటాయిస్తుంది. ప్రభుత్వమే సౌకర్యాలు కల్పించి, వాటిని అభివృద్ధి చేసి ఇస్తుంది. తద్వారా వాటికి విలువ పెరుగుతుంది. దీంతో పాటు పట్టా, అసైన్డ్ భూములకు ఏడాదికి రూ.50 వేలు, 30 వేలు చొప్పున పదేళ్లపాటు ప్రభుత్వం కౌలు చెల్లిస్తుంది. ఈ మేరకు గత టీడీపీ ప్రభుత్వ నిర్ణయానికి రైతులు సుముఖత వ్యక్తం చేయడంతో పాటు అతి తక్కువ సమయంలో 34 వేల ఎకరాలను అప్పగించారు.

వెనక్కి నడుస్తూ నిరసన తెలుపుతున్న రాజధాని మహిళలు (ఫైల్)




రాజధాని అమరావతిలో నిర్మించిన ఎన్జీవో గృహ సముదాయం


రాజధానిలో సీఆర్డీఏ కార్యాలయం


ప్రజా ప్రతినిధుల కోసం నిర్మించిన నివాస సముదాయం


అఖిలభారత సర్వీసు అధికారుల కోసం నిర్మించిన ఇళ్లు

అమరావతి.. అపురూపం!

మేటి నగరంగా నిలిపే 11 ప్రాజెక్టులు.. నేడు ప్రధాని మోదీ శంకుస్థాపన

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతిని మేటి నగరంగా తీర్చిదిద్దేందుకు మొత్తం 11 కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నారు. ప్రధాని మోదీ ఈ పనులకు శంకుస్థాపన చేస్తున్నారు. రాజధానిలో రూ.75 వేల కోట్ల పనులు చేపట్టాలని నిర్ణయించగా.. ప్రస్తుతానికి రూ.49 వేల కోట్ల వ్యయంతో పనులు చేయడానికి టెండర్లు పిలిచారు. మోదీ శంకుస్థాపన చేసిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన పనులు చేయడానికి కాంట్రాక్టు సంస్థలన్నీ సంసిద్ధంగా ఉన్నాయి. రాజధానికి అసలైన రూపం మరో మూడేళ్ల తర్వాత కనిపిస్తుంది. ఐకానిక్ భవనాలుగా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్లను మూడేళ్లలో, ఇతర ప్రాజెక్టులను రెండేళ్ల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది. రాజధానిలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో చేపట్టే కీలక ప్రాజెక్టుల గురించి...

1 హ్యాపీనెస్ట్

రాజధాని నేలపాడులో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు తిరిగి పురుడు పోసుకుంటోంది. రూ.856.31 కోట్ల వ్యయంతో తొలి రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో జీ + 18 అంతస్తులతో కూడిన 12 టవర్లను నిర్మించబోతున్నారు. మొత్తం 1200 అపార్ట్‌మెంట్లు ఉంటాయి. 2018లో ఫస్ట్ కమ్ ఫస్ట్ ప్రాతిపదికన మొదటి నుంచి 1200 వరకు దరఖాస్తు చేసిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అత్యాధునిక వసతులతో జిమ్, ఇండోర్ స్టేడియం, స్పా, షాపులు వంటి సదుపాయాలతో హ్యాపీనెస్ట్‌ను అభివృద్ధి చేయనున్నారు.

2 ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్‌ల భవనాలు

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారుల నివాసాల కోసం భారీ బహుళ అంతస్తుల భవన సముదాయాల నిర్మాణాల బ్యాలెన్స్ పనులను రూ.452.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. స్టిల్ట్ + 12 అంతస్తులతో కూడిన మొత్తం 18 టవర్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. 432 అపార్ట్‌మెంట్లు సమకూరుతాయి. 30 శాతానికి పైగా ఉన్న బ్యాలెన్స్ పనులను పూర్తి చేయాలి.

3 మంత్రులు, జడ్జీల బంగ్లాలు

మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తుల కోసం గవర్నమెంట్ కాంప్లెక్స్ ఏరియాలో రూ.419.07 కోట్ల వ్యయంతో జీ ప్లస్ 1 విధానంలో 5,82,161 చదరపు అడుగుల విస్తీర్ణంలో మొత్తం 71 బంగ్లాల బ్యాలెన్స్ పనులు చేపట్టనున్నారు.

4 ఐకానిక్ అసెంబ్లీ

అమరావతిలో తాత్కాలిక అసెంబ్లీ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన రూ.617.33 కోట్లతో ఐకానిక్ అసెంబ్లీ భవన నిర్మాణం చేపడుతున్నారు. బేస్‌మెంట్+గ్రౌండ్+3 ఫ్లోర్లతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, అత్యుత్తమ ఆర్కిటెక్చరల్ డిజైన్‌తో నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో ఈ అసెంబ్లీని సందర్శనీయ ప్రాంతంగా అందుబాటులోకి తీసుకువస్తారు.

5 ఐకానిక్ హైకోర్టు

రాజధానిలో తాత్కాలిక హైకోర్టు స్థానంలో శాశ్వత ప్రాతిపదికన ప్రపంచస్థాయి ఆర్కిటెక్చరల్ డిజైన్లతో ఐకానిక్ హైకోర్టు భవనాన్ని రూ.786.05 కోట్ల వ్యయంతో చేపడుతున్నారు. బేస్‌మెంట్+గ్రౌండ్+7 ఫ్లోర్లతో రాఫ్ట్ టెక్నాలజీతో నిర్మించనున్నారు. దీన్నీ సందర్శనీయ ప్రాంతంగా అందుబాటులోకి తెస్తారు.

6 ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఐఏఎస్‌ల బంగ్లాలు

వివిధ శాఖల విభాగాధిపతులైన ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఐఏఎస్ అధికారుల కోసం రాయపూడి గ్రామంలో రూ.429.23 కోట్ల వ్యయంతో జీ ప్లస్ 1 విధానంలో 5,90,761 చదరపు అడుగుల విస్తీర్ణంలో 115 బంగ్లాల బ్యాలెన్స్ పనులను చేపట్టనున్నారు.

7 ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా

రాజధాని కోసం పైసా ఆశించకుండా భూములు ఇచ్చిన రైతులకు నివాస, కమర్షియల్ రిటర్నబుల్ ప్లాట్లను ప్రభుత్వం అందిస్తోంది. ఈ లే అవుట్లను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేయనుంది. రోడ్లు, డ్రెయిన్లు, నీటి సరఫరా, సీవరేజ్, యుటిలిటీ డక్ట్స్, రీయూజ్ వాటర్ లైన్స్ వంటి పనులు చేపట్టనుంది. వివిధ జోన్లలో దాదాపు 15 వేల కోట్ల వ్యయంతో ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా పనులు పెద్ద ఎత్తున చేపడుతోంది.


ఐకానిక్ టవర్ల నమూనా

8 ఐకానిక్ సచివాలయ టవర్లు

రాష్ట్రానికే ప్రధాన పరిపాలన కేంద్రమైన సచివాలయం కోసం జీ ప్లస్ 40 విధానంలో రూ.4,668 కోట్ల వ్యయంతో ఐకానిక్ సచివాలయ టవర్ల నిర్మాణ పనులకు సీఆర్డీఏ టెండర్లు పిలిచింది. మొత్తం 5 టవర్లను డయాగ్రిడ్ విధానంలో చేపట్టనున్నారు. ఇందులో నాలుగు టవర్లను బేస్‌మెంట్ + 39 అంతస్తులు + టెర్రస్ గాను, ముఖ్యమంత్రి ఉండే టవర్‌ను మాత్రం బేస్‌మెంట్ + 47 ఫ్లోర్లు + హెలిప్యాడ్‌తో నిర్మించనున్నారు.

9 వరద నివారణ పనులు

రాజధానిలో వరద సమస్యను శాశ్వతంగా నివారించటానికి వీలుగా రూ.5,944.26 కోట్ల వ్యయంతో మొత్తం 13 ప్యాకేజీలలో పనులు చేపట్టనున్నారు. కొండవీడువాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్స్ విస్తరాభివృద్ధితో పాటు నీరు కొండ రిజర్వాయర్, ఇతర రిజర్వాయర్ల నిర్మాణం, పంపింగ్ స్టేషన్ల నిర్మాణం, వరదనీటి మళ్లింపు కాల్వలు, సంబంధిత ఇతర పనులను చేపట్టనున్నారు.

10 ట్రంక్ ఇన్‌ఫ్రా వర్క్స్

రాజధానిలో రోడ్లు, కేబుల్స్ రహిత డక్ట్స్, సైకిల్ ట్రాక్స్, ఈ-6, ఈ-5, ఈ-7, ఈ-11, ఈ-13, ఈ-15, ఎన్-13, ఈ-2, ఈ-4, ఎన్-8, ఎన్-4, ఈ-10, ఈ-12, ఎన్-7 రోడ్లకు సంబంధించిన పునరుద్ధరణ పనులను రూ.9,150 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు.

11 రోడ్డు అనుబంధ పనులు

రాజధానిలో ప్రధాన రోడ్లకు సంబంధించి సీఆర్డీఏ టెండర్లు ఖరారు చేసింది. వీటిలో ఈ-13, ఈ-15 రోడ్ల బ్యాలెన్స్ పనులతో పాటు వీటిని ఎన్‌హెచ్-16కు అనుసంధానించటానికి వీలుగా రూ.700 కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నారు. దీంతో ఎన్‌హెచ్-16 మీదుగా నేరుగా అమరావతిలోకి ప్రవేశించవచ్చు.

మోదీ పర్యటన షెడ్యూల్ ఇదీ

- ప్రధాని మోదీ శుక్రవారం మధ్యాహ్నం తిరువనంతపురం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 2.55 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. ప్రధానికి మంత్రులు, కూటమి నేతలు స్వాగతం పలుకుతారు.
- గన్నవరం నుంచి ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్‌లో వెలగపూడి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. హెలీప్యాడ్ వద్ద ప్రధానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతం పలుకుతారు.
- మధ్యాహ్నం 3.20 గంటలకు హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో సభావేదిక వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- అమరావతి పనుల పునఃప్రారంభోత్సవాన్ని సూచించేలా ఏ ఆకారంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ప్రధాని ఆవిష్కరిస్తారు. ప్రధాన వేదికపై 14మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస భూపతివర్మ, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, నారాయణ ఇతర వీఐపీలు కూర్చుంటారు.

నాడు


2015లో అమరావతి శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని మోదీ, వెంకయ్య నాయుడు, సీఎం చంద్రబాబు తదితరులు

ప్రధాని సభలో ఆరోగ్య శాఖ భారీ ఏర్పాట్లు

3 తాత్కాలిక ఆసుపత్రులు.. 27 అంబులెన్సులతో వైద్య బృందాలు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సభ నేపథ్యంలో ఆరోగ్య శాఖ అత్యవసర స్పందనకు భారీగా ఏర్పాట్లు చేసింది. సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ వైద్యులతో కూడిన 30 బృందాలని వివిధ పాయింట్లలో నియమించారు. అడ్వాన్స్‌డ్ లైఫ్ సిస్టమ్స్‌తో కూడిన ఆరు అంబులెన్సులు, బేసిక్ లైఫ్ సిస్టమ్స్‌తో కూడిన మరో 21 అంబులెన్సులు వివిధ చోట్ల అందుబాటులో ఉంటాయి. అంబులెన్సులతో కూడిన వైద్య బృందాలు విమానాశ్రయం, హెలీప్యాడ్, కాన్వాయ్ మార్గం, గ్యాలరీలు, పార్కింగ్ ప్రాంతాల్లో సేవలందిస్తాయి. సభాస్థలి వద్ద 10 పడకలతో కూడిన మూడు తాత్కాలిక ఆసుపత్రులనూ ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసింది. వైద్య సేవల ఏర్పాట్లను మంత్రి సత్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో రెండుసార్లు సమీక్ష చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సభకు హాజరయ్యే వారికి మజ్జిగ, ఓఆర్ఎస్ అందించడానికి ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో కూడి మరిన్ని వైద్య బృందాలను ఏర్పాటు చేశారు.

నేడు



అమరావతిలో ప్రధాని మోదీ సభకు సిద్ధమవుతున్న పైలాన్

ప్రజారాజధానికి

పునరుజ్జీవం

కూటమి ప్రభుత్వం రాగానే కదలిక.. సీఎం చంద్రబాబు నిరంతర పర్యవేక్షణ

రూ. 36 కోట్లతో కంపచెట్ల తొలగింపు.. పునర్నిర్మాణానికి నిధుల సేకరణ
వరల్డ్ బ్యాంకు, ఏడీబీ సాయం.. కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్
ఏప్రిల్ 1న రాష్ట్రానికి 4,285 కోట్లు.. హడ్కో నుంచి 11 వేల కోట్ల రుణం

(అమరావతి-ఆంధ్రజ్యోతి) గతేడాది టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాగానే రాజధాని పనులపై దృష్టి పెట్టారు. ముందుగా 25వేల ఎకరాల్లో రూ.36 కోట్లతో కంపచెట్ల తొలగింపు చేపట్టి పూర్తి చేశారు. గత ప్రభుత్వం నిలిపివేసిన పనుల పునఃప్రారంభం, వాటి పరిస్థితిపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ 23 రకాల సూచనలు చేయగా, ప్రభుత్వం ఆమోదించింది. వరల్డ్ బ్యాంకు, ఏడీబీ నుంచి వచ్చిన మొత్తంతో పాటు కేంద్రం మ్యాచింగ్ గ్రాంట్ కలుపుకొని ఏప్రిల్ 1న రూ.4,285 కోట్లు అందాయి. హడ్కో నుంచి రూ.11 వేల కోట్లు రుణంగా తీసుకోనున్నారు. అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మొత్తం 100 పనులను రూ.77,249కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్నారు. శుక్రవారం ఒక్కరోజే రూ.49,040కోట్ల పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

జగన్ ఏలుబడిలో విధ్వంసం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ అమరావతిని కొనసాగిస్తానన్న హామీని తుంగలో తొక్కారు. ప్రజారాజధానిపై కక్ష సాధించారు. అమరావతి పనులను ఎక్కడికక్కడే ఆపేశారు. రాజధాని అమరావతిపై బురదజల్లి విష ప్రచారం చేశారు. పర్యావరణ విధ్వంసమని, ఆహార భద్రతకు ముప్పు అని ఆరోపణలు చేశారు. నిర్మాణాలకు అనుకూలం కాదని, భూకంపాల ప్రమాదం ఉందని ప్రచారం చేశారు. ఇవన్నీ తప్పుడు ప్రచారాలని తేలింది. వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన భవనాలను శిథిలాలుగా మార్చారు. 70 నుంచి 90 శాతం పూర్తయిన వాటినీ నిలిపివేశారు.

బ్రాండ్ అమరావతి పునరుద్ధరణ

జగన్ తీరుతో మసకబారిన బ్రాండ్ అమరావతి ఇమేజ్‌ను పునరుద్ధరించే పనిలో సీఎం చంద్రబాబు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ చర్యలు సత్ఫలితాలనిచ్చి పారిశ్రామికవేత్తలు తిరిగి అమరావతిలో తమ కార్యాలయాలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చారు. ఇప్పటికే విట్, ఎస్ఆర్ఎం, అమృత వర్సిటీలు ఏర్పాటయ్యాయి. రానున్న కాలంలో టాటా ఇన్నోవేషన్ హబ్, బిట్స్ పిలానీ లా స్కూల్, ఎక్స్ఎల్ఆర్ఐ వర్సిటీ వంటి సంస్థలు రాబోతున్నాయి. అమరావతిని పూర్తిస్థాయి ఏఐ నగరంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. అడ్వాన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చేందుకు క్వాంటమ్ కంప్యూటింగ్ విలేజ్‌ని ఏర్పాటు చేయబోతున్నారు.

స్వయం సమృద్ధి నగరం

అమరావతిని స్వయం సమృద్ధి నగరంగా నిర్మించాలని చంద్రబాబు ఆలోచన. దీనికి అనుగుణంగా 8,603 చదరపు కిలోమీటర్ల పరిధిని రాజధాని ప్రాంతంగా గుర్తించారు. ఇందులో 217 చ.కి.మీ. పరిధిలో రాజధాని నగరం నిర్మితమవుతుంది. 16.9 చ.కి.మీ. పరిధిలో కోర్ క్యాపిటల్‌ను డిజైన్ చేశారు. విశాలమైన రోడ్లు, అండర్ గ్రౌండ్ పవర్ లైన్స్ నీటి వసతి, బ్లూ అండ్ గ్రీన్ కాన్సెప్ట్‌తో ఆహ్లాదకరమైన ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి ప్రణాళికను సిద్ధం చేశారు. ప్రభుత్వం, న్యాయ, వైద్యం, పర్యాటకం, నాలెడ్జ్ ఫైనాన్స్, స్పోర్ట్స్, మీడియా, టూరిజం వంటి 9 కార్యకలాపాలపై దృష్టి సారించి 9 థీమ్‌ల్లో 9 నగరాలు ప్లాన్ చేశారు. ప్రపంచ ప్రఖ్యాత డిజైనింగ్ సంస్థ నార్మన్ ఫోస్టర్‌తో ముఖ్య కార్యాలయాల డిజైన్లు చేయించారు. 2014-19 మధ్యకాలంలో మొదటి దశ పనులకు అయ్యే ఖర్చు రూ.55,343 కోట్లుగా అంచనా వేశారు. 55 పనులకు రూ.42,500 కోట్లతో టెండర్లు పిలిచారు. 2019 నాటికి రూ.5,587 కోట్ల విలువైన పనులు పూర్తికాగా, 4,318కోట్ల బిల్లులు చెల్లించారు. రాజధాని ప్రాంతంలో 30 శాతం పచ్చదనానికి, జలవనరులకు కేటాయించారు. ఐఆర్ఆర్, ఓఆర్ఆర్‌తో పాటు ఏడు జాతీయ రహదారులు అమరావతి అనుసంధానమయ్యేలా రూపకల్పన చేశారు. 3,300 కి.మీ. మేర సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుచేస్తారు. 131కేంద్ర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు 1277 ఎకరాలు కేటాయించారు.

దేశ చరిత్రలోనే రికార్డు

గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా 29,373 మంది రైతులు 34,281 ఎకరాలను భూసమీకరణ ద్వారా అందించారు. భూములు త్యాగం చేసిన వారిలో 32 శాతం ఎస్సీలు, ఎస్టీలు కాగా, బీసీలు 14 శాతం, రెడ్డి సామాజికవర్గం 20 శాతం, కమ్మ 18 శాతం, కాపులు 9 శాతం, ముస్లింలు 3 శాతం ఉన్నారు. నాయకుడిపై నమ్మకంతో ఇంత మంది రైతులు ఇన్ని వేల ఎకరాలు భూసమీకరణలో ఇవ్వడం ప్రపంచ చరిత్రలో నిలిచిపోయే ఘట్టం. రైతులు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి వేల ఎకరాలు ఇచ్చిన ఉదంతం దేశంలో అమరావతి ఒక్కటే. 58 రోజుల్లో భూసమీకరణ ప్రక్రియను ముగించేయడం మరో విజయం. భూసమీకరణ ద్వారా 34,281 ఎకరాలు, భూసేకరణ ద్వారా 4,300 ఎకరాలు తీసుకోగా, మిగిలిన 15,167 ఎకరాలు.. ప్రభుత్వ, అటవీ, కొండ, ఇతర భూములు. మొత్తం 54 వేల ఎకరాలు రాజధాని కోసం సమకూరింది. 2015 అక్టోబరు 22న రాజధానికి ఉద్దండరాయునిపాలెంలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.


WELCOME
Sir
Amaravati
Venkatesha